ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kurnool, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-7-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 152 పేజీలు: 8+4 వెల: 6.50

ట్రైలర్‌ను ఢీకొన్న బస్సు.. 8 మంది సజీవ దహనం

5లో

మగవాళ్లను చంపడం ఎలా? పుస్తకంపై హాట్‌హాట్ చర్చలు

# యువతే సమాజానికి దిక్సూచి

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో కదలాలి

పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలుగా ఎదగాలి

అణగారిన వర్గాలకు చేయూతనివ్వండి

సెంట్రల్ వర్సిటీ స్నాతకోత్సవ సభలో రాష్ట్రపతి ముర్ము




బుధవారం సెంట్రల్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు లోకేష్, పయ్యావుల కేశవ్

**అనంతపురం, జూలై 1, ప్రభాతవార్త బ్యూరో:** మన యువత సవాళ్లను అవకాశాలుగా మార్చుకొని మరింత సమ్మిలిత సుసంపన్నమైన భారత దేశ నిర్మాణానికి తోడ్పడాలి. పట్టభద్రులు సమాజానికి తిరిగి సేవ చేసేందుకు సిద్ధం కావాలని, ఏ రంగంలో ఉన్న అణగారిన వర్గాలకు బలంగా మారాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం లోని సెంట్రల్ యూనివర్సిటీలో బుధవారం జరిగిన మొదటి స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పట్టభద్రులు, వారి తల్లిదండ్రుల ఆనందోత్సవాల మధ్య కన్నుల పండుగగా జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతితోపాటు గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్, రాష్ట్ర మానవ వనరుల >>2

## ఉద్యోగాల సృష్టికర్తలుగా యువతరం ఎదగాలి

స్వర్ణాంధ్ర 2047 దిశగా చంద్రబాబు అడుగులు..

సెంట్రల్ వర్సిటీ సభలో మంత్రి లోకేష్

**బుక్కరాయ సముద్రం/అనంతపురం, జూలై 1, ప్రభాత వార్త బ్యూరో:** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీ దూరదృష్టి గల నాయకత్వంలో భారతదేశ జాతీయ విద్యా విధానం డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, వికసిత్ భారత్ 2047 దార్శనికత ద్వారా విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్నారు. ఈ స్ఫూర్తితో మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'స్వర్ణాంధ్ర 2047' దిశగా అడుగులు వేస్తున్నారు. తద్వారా విద్య, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలను సృష్టించగల, భవిష్యత్తుకు సంసిద్ధమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతున్నారని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బుధవారం అట్టహాసంగా జరిగిన అనంతపురం లోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ ప్రసంగిస్తూ ఈరోజు యువ పట్టభద్రులతోనిండిన ఈసభను చూస్తున్న >>2




బుధవారం 'జాతీయ వైద్యుల దినోత్సవ' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సత్యకుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## 3వేల డాక్టర్ పోస్టుల భర్తీ

జీరో వేకెన్సీ ప్రాధాన్యంతో నియామకాలు: మంత్రి సత్యకుమార్

**ప్రొద్దుటూరు అర్బన్,జూలై 1, ప్రభాత వార్త :** సమాజంలో వైద్యులపట్ల గౌరవ భావం పెరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆరోగ్య పరిస్థితి ఆధారంగా చికిత్స అందించే వైద్యులకు ఆసుపత్రుల్లో తగిన వాతావరణం, భద్రత కల్పిస్తేనే రోగులు సత్వరం కోలుకుంటారని పేర్కొన్నారు. వైద్యులు అందించే ఉత్తమ వైద్య సేవలవల్ల రోగుల కుటుంబాలకు భరోసా లభిస్తోందని తెలిపారు. అటువంటి పవిత్ర వృత్తిలో ఉన్న వైద్యులకు గౌరవంఇవ్వాల్సిన అవసరం ఉందని, అన్ని స్థాయి >>2

## 10న 'తల్లికి వందనం' జమ

**విజయవాడ,జూలై 1,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ప్రభుత్వం విద్యార్థులకు శుభవార్తతెలిపింది. సిఎం చంద్రబాబు నేతృత్వంలో. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న "తల్లికి వందనం" పథకం నిధుల విడుదలకు ముహూర్తం ఖరారు చేసింది. జులై 10 న తల్లికి వందనం డబ్బులు ఖాతాల్లో జమ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గత ప్రభుత్వంలో ఒకే బిడ్డకు పరిమితమైన ఈ పథకాన్ని, ఇప్పుడు ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటున్నా వారందరికీ వర్తింపజేయనున్నారు. ఇది చదువుకునే పిల్లలున్న ప్రతి కుటుంబానికి పెద్ద ఊరటనిచ్చే విషయమనే ప్రభుత్వం భావిస్తోంది. తల్లికి వందన పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.13,000 ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం నేరుగా తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. రూ.2 వేలు పాఠశాలల అభివృద్ధికి అందిస్తుంది.ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే వారు కొన్ని నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు కనీసం 75 శాతం హాజరు కలిగి ఉండాలి. లబ్ధిదారులైన తల్లుల బ్యాంక్ అకౌంట్లకు ఇకేవైసీ ప్రక్రియ పూర్తి అయ్యి ఉండాలి. ఎన్‌పిసిఐ లింక్ కూడా ఉండాలి. తల్లికి వందన పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.13,000 ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం నేరుగా తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. రూ.2 వేలు పాఠశాలల అభివృద్ధికి అందిస్తుంది.

## పలు జిల్లాల్లో భారీ వర్షాలు

**విజయవాడ,జూలై 1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అల్పపీడన ప్రభావంతో పలు జిల్లాల్లో చెదురుమదురు నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది.కొన్ని జిల్లాల్లో వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తోంది. విజయవాడ నగర పరిసరాల్లో. గుంటూరు. విజయనగరం,విశాఖ, గోదావరి జిల్లాల్లో అక్కడ వర్షాలు భారీగానే కూరుస్తున్నాయి.తీవ్ర ఉక్కపోత అనంతరం కురుస్తున్న ఈ వర్షాలతో పాటుగా ఉరుములు, మెరుపులు., ఈదురుగాలులు ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.పలు చోట్ల చెట్లుకూలడం, విద్యుత్తు స్తంభాలు ఒరగడంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, ఉత్తర కోస్తా తీర జిల్లాలు కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, మధ్య కోస్తా ప్రాంతాలు కృష్ణాతో పాటు ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందనిపేర్కొంది.మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడొచ్చు. రాయలసీమలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురుస్తాయని విపత్తు నిర్వహణ సంస్థ అంచనా వేసింది.అక్కడక్కడ పిడుగులుపడేఅవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

## పెన్షన్ల పంపిణిలో ఎపి టాప్

ప్రతినెల 28 కేటగిరీల లబ్ధిదారులకు అందిస్తున్నాం

పాదుపులో డ్వాక్రా మహిళలు ఆదర్శం

నెల్లూరు జిల్లా పున్నపువారిపల్లె పేదల సేవలో సిఎం చంద్రబాబు



**చిల్లకూరు, (నెల్లూరు) జూలై 1, ప్రభాతవార్త:** రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజాభీష్టం మేరకే సుపరిపాలన అందిస్తున్నామని వివరించారు. ప్రజల జీవితాల్లో శాశ్వతంగా వెలుగులు నింపే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. గూడూరు నియోజకవర్గం ఓడూరు పంచాయతీలోని పున్నపువారిపాలెంలో బుధవారం పేదల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజా వేదికసభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజలు చూపిస్తున్న అభిమానంతో పడుతున్న కష్టాన్ని మర్చిపోతున్నామని గత పాలకులు నెల్లూరు జిల్లాను అశాస్త్రీయంగా విభజించారు. గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చి నెరవేర్చాం. సైదాపురం, కలవాయి రాపూరు మండలాలను కూడా నెల్లూరు జిల్లాలో కలిపాం. ప్రజల అభీష్టం ప్రకారమే పరిపాలన జరగాలి. పెత్తందారీ వ్యవస్థకు చోటు లేదు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఆశాస్త్రీయంగా జరిగినల్లాల విభజనను సవరించాం. ప్రజల జీవితాల్లో శాశ్వతంగా వెలుగునింపాలనే లక్ష్యంతోనేపనిచేస్తున్నాం. సామాజిక బాధ్యతగానే ప్రతీ నెలా 1వ తేదీన కనీస అవసరాలు తీర్చుకోలేని ఆపన్నులకు పెన్షన్ అందిస్తున్నాం. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు సహా 28 కేటగిరీల లబ్దిదారులకు పెన్షన్లు అందిస్తూ వారిని ఆదుకుంటున్నాం. పేదల జీవన ప్రమాణాలను పెంచాలనే లక్ష్యంతో పీ4 కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తున్నాం. ఇప్పటి వరకూ రూ.68,598 కోట్ల మేర పెన్షన్ల కింద కూటమి ప్రభుత్వం పంపిణీ చేసింది. ప్రతీ నెలా 62.20 లక్షల మందికి రూ.2,712 కోట్లు పెన్షన్లకు చెల్లిస్తున్నామని సిఎం అన్నారు.

**పొదుపు ఉద్యమానికి డ్వాక్రా మహిళలే దిక్సూచి**

గడిచిన రెండేళ్ల ప్రయాణంలో రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయటంతో పాటు వ్యవస్థలను గాడిలో పెట్టామని, సంక్షోభాలు, సమస్యలను దాటుకుని ప్రజలకు మేలు చేసేలా అనునిత్యం పనిచేస్తున్నామని అన్నారు. గత అవినీతి పాలనను మార్చి రాష్ట్రంలో మళ్లీ సుపరిపాలన తీసుకువచ్చాం. మనమిత్ర వాట్సప్ గవర్నెన్సు ద్వారా ఆన్‌లైన్‌లో సేవలను అందిస్తూ ప్రజల చేతిలోకి పౌర సేవలను తీసుకు >>2

## తమిళనాట విజయ్ సర్కార్‌ను కూల్చే కుట్ర!

ముగ్గురు అరెస్టు.. దర్యాప్తు



**చెన్నై, జూలై 1:** తమిళనాడులో ముఖ్య మంత్రి విజయ్ నేతృత్వంలోని టివికె ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర జరిగినట్లు రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం వెల్లడించింది. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కూడా పూర్తికాకముందే ఈ కుట్రను భగ్నం చేసినట్లు అధికా రులు తెలిపారు.సమాచారం ప్రకారం టివికెకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలతో ఒకేసారి రాజీనామాలు చేయించి ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నం జరిగినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది.ఈ వ్యవహారంపై టివికె ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో ఒక కన్సల్టెన్సీ సంస్థ ఉద్యోగిని చెన్నైలో అరెస్టు చేశారు. అతని విచారణలో డిఎంకె ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు, కరూర్‌లో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కుట్ర వెనుక మరెవరైనా ఉన్నారా అనే >>2

## ఎపి ఇఎపిసెట్ ఫలితాల్లో బాలికల ఆధిక్యం

ఇంజనీరింగ్‌లో మొత్తం 1,82,317 మంది విద్యార్థులు ఉత్తీర్ణత

అగ్రికల్చర్, ఫార్మసీలో 63,546 మంది అభ్యర్థులు అర్హత

**విజయవాడ, జూలై1,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ఇఎపిసెట్ 2026 ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ ర్యాంకులను అధికారికంగా వెల్లడించారు. ఇఎపిసెట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఇంజినీరింగ్‌లో 71.65 శాతం ఉత్తీర్ణతతో బాలికలు ముందంజలో నిలవడం గర్వకారణం అని ఆయన కొనియాడారు. విద్యార్థులు సాధించిన ఈ విజయం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు సరికొత్త ఉత్తేజాన్ని ఇస్తుందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇక ఈ యేడాది ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించగా, ఉత్తరాంధ్రకు చెందిన విద్యార్థులు టాపర్లుగా నిలిచారు. విజయనగరం జిల్లా రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించి సత్తా చాటింది.ఇంజినీరింగ్ విభాగంలో మొత్తం 1,82,317 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇది 70.52 శాతంగా నమోదైంది. అలాగే అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో 63,546 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ విభాగంలో ఏకంగా 89.59 శాతం అత్యుత్తమ ఉత్తీర్ణత నమోదైంది. ఇంజినీరింగ్ విభాగంలో అమ్మాయిలు ప్రతిభ కనబరిచారు. బాలుర కంటే బాలికలే ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించి ముందంజలో నిలిచారు. ఈ విభాగంలో బాలురు 1,00,844 (69.63 శాతం) మంది పాస్ అయ్యారు. కానీ బాలికలు 71.65 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇఎపిసెట్ ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థుల వివరాలను మంత్రి వెల్లడించారు. అగ్రికల్చర్, ఫార్మసీలో జస్వంత్ నాయుడు (విజయనగరం) ప్రథమ ర్యాంకు, వెంకటమహంత్ (కూకట్‌పల్లి) ద్వితీయర్యాంకు, హారికా దేవి >>2

## రాష్ట్రంలో 18 నగర వనాలు

రూ. 36 కోట్ల వ్యయంతో అభివృద్ధి: డి.సిఎం పవన్

అటవీ సంపద, సంప్రదాయాల కలబోతగా నిర్మాణం

వినోదం, ఆరోగ్యం ఒకేచోట ఉండేలా ప్రత్యేక సౌకర్యాలు



బుధవారం రాష్ట్రంలో 8 నగరవనాలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న డి.సిఎం పవన్

**విజయవాడ,జూలై1, ప్రభాతవార్తప్రతినిధి:** ఏ దేశమైతే ప్రకృతితో కలిసి ఎదుగుతుందో, ఆ దేశం ఎప్పటికీ నిలిచి ఉంటుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రకృతితో పాటు సాధించే అభివృద్ధే శాశ్వతంగా ఉంటుందని పేర్కొన్నారు. మన వారసత్వం అనేది కేవలం మనం నిర్మించిన కట్టడాలు కాకూడదన్నారు. మనం కాపాడిన ప్రకృతి అయి ఉండాలని ఆకాంక్షించారు. అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖల పరిధి రాష్ట్రంలో కొత్తగా అభివృద్ధి చేసిన 18 నగరవనాలు, ఎకో పార్కులు, కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం ప్రాజెక్టులను బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా డి.సిఎం ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ 'నగరాలు, పట్టణాలు శరవేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ నగర వనాలు పట్టణాలకు గ్రీన్ లంగ్స్ లాగా పని చేస్తూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడతాయి. కేంద్ర ప్రభుత్వ నగర వన యోజన నిధులతో పాటు స్థానిక నిధులను సమకూర్చుకుంటూ రూ. 36 కోట్ల భారీ వ్యయంతో ఈ ప్రాజెక్టును సిద్ధం చేశాం. ఒక్కో నగర వనాన్ని సుమారు 50 హెక్టార్ల విస్తీర్ణంలో, రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించాం. కొడూరు, కైలాసగిరి, మదనపల్లెలలో ప్రత్యేకంగా ఎర్రచందనం పరిరక్షణ పార్కులను ఏర్పాటు చేశాం. మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయ జ్ఞానాన్ని చాటి చెప్పేలా, జీవవైవిధ్య పరిరక్షణే ధ్యేయంగా నక్షత్ర వనాలు, రాశి వనాలను అభివృద్ధి చేశాం. ఈ పార్కులు కేవలం >>2

## మరో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు అరెస్టు

సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు

**విజయవాడ,జూలై1, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విజయవాడ కృష్ణలంక గాదె సాయి కృష్ణ (25) కస్టడీ మృతి కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో తాజాగా మరో ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లను అరెస్ట్ చేసింది. దీంతో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య ఐదుకుచేరింది. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుళ్ల బాబూరావు, సాంబయ్యలను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కేసులో ఐదో నిందితుడిగా బాబూరావు, ఆరో నిందితుడిగా సాంబయ్య ఉన్నారు. వారిని రెండో ఎసిఎం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. బాబూరావును అవనిగడ్డ జైలుకు, సాంబయ్యను గన్నవరం జైలుకు తరలించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌హెచ్‌ఓ) ఎస్ఎస్‌వివి నాగరాజుకు వీరిద్దరూ సహకరించారని ఆరోపణలు ఉన్నాయి.మే 6వ తేదీన పోలీసులు అదుపులోకి తీసుకున్న సాయి కృష్ణ అదృశ్యమయ్యాడు. లాకప్‌లో చిత్రహింసలకు గురిచేసి, కొట్టి చంపేశారని, ఆ తర్వాత మృతదేహాన్ని ఎలక్ట్రిక్ శ్మశానవాటికలో దహనం చేసి ఆధారాలు మాయం చేశారని అతని కుటుంబం ఆరోపిస్తోంది. సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు జూన్ 19న భారతీయ న్యాయ సంహిత కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కస్టడీలో తీవ్ర గాయాల వల్లే సాయి కృష్ణ మరణించాడని సిట్ ఇప్పటికే కోర్టుకు నివేదించింది. అంతేకాకుండా పోలీస్ స్టేషన్‌లోని సిసిటివి ఫుటేజీని ఉద్దేశపూర్వకంగా తొలగించారని కూడా >>2



ప్రమాదంలో రెండు లారీలు దగ్ధమవుతున్న దృశ్యం

## గుంటూరు జిల్లాలో ఘోర ప్రమాదం భగ్గుమన్న రెండు లారీలు

ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్ సజీవ దహనం

**యడ్లపాడు(పల్నాడు జిల్లా), జూలై 1, ప్రభాతవార్త :** ఉమ్మడి గుంటూరు మరియు పల్నాడు జిల్లా సరిహద్దు ప్రాంతము గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం పంచాయితీ పార్వతీ పురం గ్రామ సమీపంలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొని మంటలు చెలరేగి ఇరువురు డ్రైవర్లు, ఒక >>2




బుధవారం ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో భారీ వర్షాలకు జలమయమైన రహదారులు

# యువతరం ఎదగాలి

>> వృద్ధు.. నాకు కేవలం పట్టాలు స్వీకరిస్తున్న విద్యార్థులు మాత్రమే కనిపించడం లేదు. భవిష్యత్తును తీర్చిదిద్దడానికి సిద్ధంగా ఉన్న ఒక తరం కనిపిస్తోంది. ప్రతి తరానికీ ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. భవిష్యత్తును నిర్మించే అవకాశం ఈ తరానికి లభించింది. ఇది మీ సమయం, ఇది మీకు లభించిన గొప్ప అవకాశం. మీ నేపథ్యం మీ భవిష్యత్తును నిర్ణయించలేదని ఎప్పుడూ అనుమతించకండి. మీ కలలు, మీ కఠోర శ్రమ, మీ వ్యక్తిత్వం.... ఇవే మీరు ఎవరన్నదాన్ని నిర్ణయించేలా చూసుకోండి అన్నారు.

**ముర్ము జీవితం... స్ఫూర్తిదాయకం..**

ఈరోజు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఇక్కడ కూర్చునే భాగ్యం మనకు దక్కింది. ఆమె జీవితం కేవలం తరగతి గదిలో నేర్చుకోలేని ఒక పాఠం. ఆమె ఒక చిన్న గిరిజన గ్రామంలో జన్మించారు. చాలా మందిలాగే కుంగదీసే వ్యక్తిగత విషాదాలను ఆమె ఎదుర్కొన్నారు. అయినా ఆమె ఎప్పుడూ విశ్వాసం కోల్పోలేదు. సేవ చేయడం ఆపలేదు.ఒక ఉపాధ్యాయురాలిగా,.. ఒక శాసనసభ్యురాలిగా,.. ఒక గవర్నర్‌గా, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాష్ట్రపతిగా మన ముందున్నారు. ఆమె ప్రయాణం ప్రతి యువ విద్యార్థికి ఒక సత్యాన్ని చెబుతుంది. మీ ప్రారంభం మీ గమ్యాన్ని నిర్ణయించదు. మీ ధైర్యమే నిర్ణయిస్తుంది. మేడమ్ జీవితం లక్షలాది మంది భారతీయ యువతకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. సెంట్రల్ యూనివర్సిటీ మొదటి బ్యాచ్ స్నాతకోత్సవం కోసం ఎప్పుడూ గుర్తుండిపోయే ఉంటుందన్నారు.

**అవకాశాలు సృష్టించే వారు కావాలి..**

నేటి ప్రపంచానికి అవకాశాల కోసం ఎదురుచూసే వారు అవసరం లేదు. అవకాశాలను సృష్టించే వారు కావాలి. కేవలం ఉద్యోగార్థులుగా ఉండాలని ఆశించవద్దు. ఉద్యోగ సృష్టికర్తలుగా మారండి. సంస్థలను నిర్మించండి. ఆవిష్కరణలను నిర్మించండి. పరిష్కారాలను రూపొందించండి. ఇతరుల్లో ఆశను నింపండి. ఎప్పుడూ సౌకర్యవంతమైన మార్గాన్ని ఎంచుకునే వారికి విజయం దక్కదు. కఠినమైన మార్గాన్ని ఎంచుకునే ధైర్యం ఉన్నవారికే విజయం లభిస్తుంది. తక్కువ మంది ప్రయాణించే మార్గమే తరచూగా అద్భుతమైన విజయానికి దారితీస్తుంది. కొత్త విషయాలను అన్వేషించే ఆసక్తి పెంపొందించుకోండి. విఫలమైనా తట్టుకునే ధైర్యం, మళ్లీ పుంజుకునేంత దృఢ సంకల్పం కలిగి ఉండండి. గుర్తుంచుకోండి... పట్టభద్రుల వేడుకతో విద్య ముగిసిపోదు. అది జీవితకాల అభ్యాసానికి నాంది పలుకుతుందని లోకేష్ అన్నారు.

**యూనివర్సిటీ గర్వపడే స్థాయికి ఎదగండి..**

ఈ రోజు మీరు ఈ ప్రాంగణం నుండి వెళుతున్నప్పుడు మీ విజ్ఞానాన్ని ఆత్మవిశ్వాసంతో, మీ విలువలను వినయంతో, మీ కలలను ధైర్యంతో ముందుకు తీసుకువెళ్లండి. జీవితంలో ఎక్కువ మంది ప్రయాణించని మార్గాన్ని ఎంచుకోవడానికి ఎప్పుడూ భయపడకండి. ఎందుకంటే గొప్ప విజయాలు సమూహాలను అనుసరించడం వల్ల రావు. దానికి నాయకత్వం వహించే ధైర్యంతోనే వస్తాయి. మీ కుటుంబం గర్వపడేలా చేసే వృత్తిని ఎంచుకోండి. మీ విశ్వవిద్యాలయానికి గర్వకారణమయ్యే వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోండి. భారతదేశం గర్వపడేలా ఒక గొప్ప వారసత్వాన్ని సృష్టించండి. ఎందుకంటే, పట్టభద్రులయ్యే మొదటి బ్యాచ్ కేవలం డిగ్రీలను మాత్రమే పొందదు. అది మీ తర్వాత వచ్చే ప్రతి తరానికీ స్ఫూర్తినిస్తుంది. కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టండని మంత్రి లోకేషు సూచించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ శంకర్ ఆచార్య, వైస్ ఛాన్సర్ కోరి , ప్రభుత్వ విప్ రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎపి ఇఎపిసెట్ ఫలితాల్లో బాలికల ఆధిక్యం

>> (కృష్ణా జిల్లా), తృతీయ ర్యాంకు హారికాదేవి (కృష్ణా జిల్లా) సాధించారు. కొండ్రెడ్డి హారికాదేవి శ్రీ అనూహ్య నాలుగవ ర్యాంకు,కర్రి సత్యనారాయణ అయిదువ ర్యాంకు బంటు ధాత్రిక ఆరవ ర్యాంకు పల్లికొండ దర్శ్‌తేజ ఏడవ ర్యాంకు వల్లెపు ధీరజ్ కృష్ణ 8వ ర్యాంకు దండమూడి జాగృతి తొమ్మిదివ ర్యాంకు ఆళ్ల శ్రీలక్ష్మి సత్యసాయి నిఖితారెడ్డి రేలంగి జయ షణ్ముఖ 10వ ర్యాంకు సాధించారు.ఇంజినీరింగ్‌లో రోషన్ మణిదీప్ (తాడేపల్లి) ప్రథమ ర్యాంకు, శ్రావ్య (శ్రీకాకుళం జిల్లా) ద్వితీయ ర్యాంకు, ప్రవీణ్ కుమార్ (పల్నాడు జిల్లా) తృతీయ ర్యాంకు సాధించారు.తెల్లూరి శ్రేయస్ రెడ్డి నాలుగవ ర్యాంకు ముక్కార సాకేత్ అయిదవ ర్యాంకు బండి వెంకట సాత్విక్ ఆరవ ర్యాంకు నూర్ బాషా హాఫీజ్ ఏడవ ర్యాంకు,పసల మోహిత్ 8వ ర్యాంకు,మరక వంశీధర్ రెడ్డి తొమ్మిదవ ర్యాంకు సాధించారు.వాస్తవానికి ఈ ఫలితాలు గురువారం విడుదల కావాల్సి ఉంది. సిబిఎస్ఇ 12వ తరగతి విద్యార్థులకు సంబంధించి ఇంకా కొంతమంది మార్కులు రావాల్సి ఉండటం, అలాగే ఇంటర్మీడియట్‌లో ఒక సబ్జెక్టు ఫెయిలై అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఇఎపిసెట్‌లో 25 శాతం వెయిటేజీ ఇవ్వాల్సి ఉండటంతో ఫలితాలను వాయిదా వేశారు. అయితే తాజాగా ఈ ప్రక్రియ పూర్తై లైన్ క్లియర్ అవ్వడంతో బుధవారం మధ్యాహ్నమే ర్యాంకులను వెల్లడించారు. విద్యార్థులు తమ ర్యాంకు కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. సంబంధిత వెబ్‌సైట్‌లోకి వెళ్లి వివరాలు నమోదు చేసి ర్యాంకు కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థుల సౌకర్యార్థం ఫలితాల కోసం ప్రత్యేకంగా వాట్సప్ నంబర్‌ను కూడా అధికారులు అందుబాటులోకి తెచ్చారు. 95523 00009 నంబర్‌కు మెసేజ్ చేయడం ద్వారా కూడా విద్యార్థులు తమ ఫలితాలను పొందవచ్చు

# సమాజానికి దిక్సూచి

>> అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్రీయ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డా.శంకరాచార్య, ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ.కోరి, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవం కేవలం ఒక వేడుక దినం మాత్రమే కాదని, ఈ యువ సంస్థ ప్రస్థానంలో ఇది ఒక కీలకమైన మైలురాయి అని అన్నారు. భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే సంస్థగా మారడానికి ఈ విశ్వవిద్యాలయం ఒక దీర్ఘకాలిక దార్శనికతను అభివృద్ధి చేసుకుందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పట్ల, ముఖ్యంగా నాణ్యమైన విద్యకు సంబంధించిన లక్ష్యాల పట్ల దీనికున్న నిబద్ధత, సమ్మిళిత, సమానత్వ అభివృద్ధి పట్ల బాధ్యతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆమె అన్నారు. ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం ఒక శ్రేష్ఠతా కేంద్రంగా ఆవిర్భవించి, 2047 నాటికి వికసిత్ భారత్ దార్శనికత సాకారానికి గణనీయంగా దోహదపడుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ, ఈ స్నాతకోత్సవం వారి సంవత్సరాల అంకితభావం, పట్టుదల, కఠోర శ్రమకు పరాకాష్ఠ అని అన్నారు. విద్యార్థులు కలలతో విశ్వవిద్యాలయంలోకి ప్రవేశించారు. ఈ రోజు వారు జ్ఞానం, ఆత్మవిశ్వాసంతో పాటు వారికి కొత్త అవకాశాల తలుపులు తెరిచే డిగ్రీతో బయటకు వెళ్తున్నారు అని ఆమె అభిప్రాయపడ్డారు.విద్యార్థుల విజయం వారి సొంత కఠోర శ్రమ ఫలితమే అయినప్పటికీ, అది వారి తల్లిదండ్రుల త్యాగాలు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, సమాజ మద్దతుతో కూడా రూపుదిద్దుకుందని రాష్ట్రపతి అన్నారు. అందువల్ల, సమాజానికి తిరిగి సేవ చేయాలన్న బాధ్యత వారిపై ఉంది అని చెప్పారు. నేడు వైద్యులు ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కరణలను నడిపించే శాస్త్రవేత్తలుగా, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులుగా, లేదా సమాజ సేవ చేసే దాతలుగా మారినా, వారి విద్య అణగారిన వర్గాలకు బలంగా మారాలి అని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. సాంకేతిక పురోగతులు ప్రతి రంగాన్ని మారుస్తున్నాయని రాష్ట్రపతి అన్నారు. ఇంత వేగంగా మారుతున్న ప్రపంచంలో, డిగ్రీ సంపాదించడంతో చదువు ముగిసిపోకూడదు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు నిరంతరం అనుగుణంగా మారే తపన విద్యార్థులకు గొప్ప బలాలలో ఒకటిగా ఉంటుంది. కొత్త ఆలోచనలను అన్వేషించడానికి, కొత్త జ్ఞానాన్ని సంపాదించడానికి ధైర్యాన్ని పెంపొందించుకోవాలని ఆమె వారికి సూచించారు. నేర్చుకోవాలనే తపన, పట్టుదల, నూతన ఆవిష్కరణలు చేసే మన యువత తమ అమూల్యమైన జాతీయ సంపద అని రాష్ట్రపతి అన్నారు. తమ జ్ఞానాన్ని సృజనాత్మకత, పట్టుదల, బాధ్యతా భావంతో మేళవించడం ద్వారా, మనయువత సవాళ్లను అవకాశాలుగా మార్చుకుని, మరింత సమ్మిళిత, సుసంపన్నమైన భారతదేశ నిర్మాణానికి దోహదపడగలరు. నైతిక విలువలను అలవర్చుకోవడం విద్యార్థులకు ఎంతో సహాయపడుతుందని రాష్ట్రపతి చెప్పారు. నిజాయితీ, కరుణ, సానుభూతి, ప్రకృతి పట్ల గౌరవం అనేవి కేవలం ఉన్నతమైన నైతిక ఆదర్శాలు మాత్రమే కాదని, అవి సంపూర్ణ అభివృద్ధికి పునాదులని ఆమె అన్నారు. ఈ గుణాలు వారి జీవితాన్ని సుసంపన్నం చేసుకోవడానికి, సమాజానికి, దేశానికి అర్థవంతంగా తోడ్పడటానికి వీలు కల్పిస్తాయి. మన యువత యొక్క శక్తి, ప్రతిభ, నిబద్ధత ద్వారా మాత్రమే వికసిత భారత్ దార్శనికతను సాకారం చేసుకోగలమని రాష్ట్రపతి అన్నారు. వారు ఏ మార్గాన్ని ఎంచుకున్నా, అంకితభావంతో, నిజాయితీతో శ్రేష్ఠతను సాధించాలి అని అన్నారు.

**పట్టబదులకు గోల్డ్ మెడల్స్ ను బహుకరించిన రాష్ట్రపతి**

ఈ కార్యక్రమంలో భాగంగా గోల్డ్ మెడల్ సాధించిన కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు గోల్డ్ మెడల్ లను రాష్ట్రపతి బహుకరించారు. అంతకుముందు రాష్ట్రపతిని రాష్ట్ర గవర్నర్‌ను, రాష్ట్ర మంత్రులు మంత్రి నారా లోకేష్, పయ్యావుల కేశవ్‌ను ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ.కోరి శాలువా కప్పి జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ హేమచంద్ర రెడ్డి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ జగదీష్, ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, తాడిపత్రి ఏఎస్పి రోహిత్ కుమార్ చౌదరి, ఆయా శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

# యూట్యూబర్ 'ప్రశ్న రావణ్' అరెస్టు

## పిఠాపురం పోలీస్టేషన్ వద్ద హైరానా

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జులై 1 (ప్రభాతవార్త):** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాధా మనోహర్ దాస్‌పై ఇటీవల ఏలూరు బహిరంగ సభలో యూట్యూబర్ ప్రశ్న రావణ్ అనుచిత వ్యాఖ్యలు చేసారంటూ పిఠాపురం జనసేన నాయకుడు బొజ్జా కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.కాకినాడ జిల్లా పిఠాపురం పోలీసులు ప్రశ్న రావణ్‌ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ వద్ద జరిగిన నాటకీయ పరణామాలతో ఉత్కంఠ నెలకొంది.అదుపులోకి తీసుకున్న ప్రశ్న రావణ్‌ను పిఠాపురం టౌన్ పోలీస్టేషన్‌లో విచారించారు. విచారణ అనంతరం రావణ్‌ను జిల్లా కోర్టులో హాజరుపరచాలని పోలీసులు ప్రయత్నించారు. పిఠాపురం పోలీస్ స్టేషన్ నుంచి వైద్య పరిక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించబోతుండగా జనసేన నాయకులు భారీ సంఖ్యలో చేరుకుని ఆందోళనకు దిగారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు క్షమాపణలు చెప్పిన తరువాతే తరలించాలని డిమాండ్ చేసారు. అయితే రావణ్‌కు మద్దతుగా మరో వర్గం ఆందోళనకు రావడంతో ఉత్కంఠగా మారింది. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. 24 గంటల లోపు న్యాయమూర్తి ఎదుట హాజరు పరచాలని పోలీసులు ప్రయత్నాలు చేసారు. పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొనడంతో అదనపు బలగాలను మోహరించారు. దీంతో ఏంజరుగుతుందోనని ఆందోళన వ్యక్తంఅవుతుంది.ఎట్టకేలకు పిఠాపురం పోలీసులు న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు.

### వారం - వర్జ్యం

02-07-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
విదియ ఉ.9.37
ఉత్తరాషాఢ ఉ.9.26
వర్జ్యం : మ.1.49-మ.3.34
దు.ఉ.10.00-ఉ.10.52, 2) మ.3.14-సా.4.00
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**మేషం:** పాతమిత్రులనుండి కీలక సమాచారం అందుకుంటారు. సంతాన పరంగా బాధ్యతగా వ్యవహరిస్తారు.

**వృషభం:** అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. స్థిరాస్తివివాదాలు తీరి లబ్ధి పొందుతారు. పెట్టుబడులకు తగిన సమయం.

**మిథునం:** కలలప్రపంచంలో విహరించకకుండా వాస్తవికతను దృష్టిలో ఉంచుకొని ముందడుగువేసి లాభపడతారు.

**కర్కాటకం:** కార్యాలయంలో అర్థంలేని రాజకీయాలు మిమ్మల్ని విసుగుకలిగిస్తాయి. యాంకరింగ్ రంగంలోవారికి అనుకూలం.

**సింహం:** దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు. సంఘంలో కీర్తిప్రతిష్ఠలు నామమాత్రంగా పెరుగుతాయి.

**కన్య :** సంతానపరంగా విశేషశ్రద్ధను కనబరుస్తారు. ఈరోజు అనేక అనుకూల ఫలితాలను సాధిస్తారు.

**తుల :** రాజకీయరంగాలవారు గౌరవ సత్కారాలు పొందుతారు. మోకాళ్ళనొప్పులు బాధించవచ్చు. వాహన సౌలభ్యం.

**వృశ్చికం:** నూతనకార్యక్రమములను గురించి ఆలోచనలు, చర్చలు మాటల రూపములోనికి వస్తాయి.

**ధనుస్సు:** ఆరోగ్య, వాహనాల విషయంలో జాగ్రత్తలు అవసరం. దూరప్రాంతాలనుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

**మకరం:** మీరు చేస్తున్న పనులను గోప్యంగా ఉంచండి. హోటల్ వ్యాపారస్థులకు అనుకూలమైన కాలం.

**కుంభం:** మీ మాటలకు, మంచి తనమునకు గాను సమాజములో మీకు గౌరవప్రతిష్ఠలు పెంపొందుతాయి.

**మీనం:** దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పెన్షన్ల పంపిణిలో ఎపి టాప్

>> వచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు అందించగలుగుతున్నామన్నారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, దివ్యాంగ శక్తి, మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో లాంటి వివిధ పథకాలను అమలు చేశాం. మహిళలను పారిశ్రామిక, వ్యాపార వేత్తలుగా తయారు చేసేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. పొదుపు ఉద్యమంలో మన డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శంగా నిలిచారు. అందుకే బ్యాంకులు కూడా డ్వాక్రా మహిళలకు పెద్ద ఎత్తున రుణాలు అందించేందుకు ముందుకు వస్తున్నాయ్ని అని ముఖ్యమంత్రి అన్నారు.

**రాష్ట్రంలోనే అగ్రగామిగా నెల్లూరు జిల్లా**

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందాలన్నదే మా ఆకాంక్ష. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు రీజియన్లుగా చేసి అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నాం. అభివృద్ధిలో సంపద సృష్టిలో నెల్లూరు జిల్లా దేశంలోనే అగ్రగామి జిల్లాగా మారుతుంది. రామాయపట్నం పోర్టు, కృష్ణపట్నం పోర్టు, దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ వస్తున్నాయి. రామాయపట్నం వద్ద బిపిసిఎల్ లక్ష కోట్లతో రిఫైనరీ పెడుతోంది. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో కూడా పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయి. ఇప్పటికే గూడూరు ప్రాంతంలో 27 మెగా పరిశ్రమలు వచ్చాయి. మెగా ఫర్నిచర్ పార్కు కూడా ఏర్పాటు కాబోతోంది. మన రాష్ట్రంలోనే ఉన్న శ్రీసిటీ దేశ పారిశ్రామిక ప్రాంతాలకు ఆదర్శం. జాతీయ రహదారి కారిడార్లు, 4 లేన్ రైల్వే ట్రాక్ కూడా మన ప్రాంతం నుంచి వెళ్లేలా ప్రాజెక్టులు వస్తున్నాయి. అన్ని పోర్టులకూ రైల్వే లైన్లను అనుసంధానించి ఈ ప్రాంతాన్ని లాజిస్టిక్స్ కేంద్రంగా తయారు చేస్తాం అని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ అవసరమైన రాజధాని అమరావతి గొడ్డలి పార్టీకి అవసరం లేదు. అందుకే ఇంకా రాజధానిపై కుట్రలను కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పుడు వేగంగా పనులు జరుగుతుంటే సహించలేకపోతున్నారు. గత పాలకుడు తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాలతో రాష్ట్రానికి రాజధానే లేకుండా పోయింది. మూడు రాజధానుల పేరిట గందరగోళ పరిచారు. ఎవరైనా పొరుగు రాష్ట్రాలకు వెళ్తే ఎపికి మూడు రాజధానులా అని హేళనకు గురయ్యారు. పార్లమెంటులో శాశ్వత రాజధాని చట్టం చేస్తుంటే మావిగన్ అంటూ కొత్త ఆటలు మొదలు పెట్టారు. అమరావతి పరిరక్షణ కోసం అంటూ రౌడీలతో ఇప్పుడు దండయాత్ర చేస్తున్నారు. నిలకడలేని వ్యక్తులు రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్ని ఇబ్బందులు పెడుతున్నారు.

**హోంమంత్రిపై అవమానర వ్యాఖ్యలు**

విజయవాడలో యువకుడి అదృశ్యం ఘటన నా దృష్టికి వస్తూనే సిఐను సస్పెండ్ చేశాం, చర్యలకు ఆదేశించాం. కానీ వైసీపీ నాయకులు కులాల మధ్య వివాదాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులతో విష ప్రచారం చేస్తున్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లతో ఆ పార్టీ నేతలు రెచ్చిపోతున్నారు. హోం మంత్రి అనిత మేకప్‌పై ఆ పార్టీ నేతలు అసహ్యంగా, అవమానకరంగా మాట్లాడారు. మహిళా కమిషన్ ఈ అంశంపై గట్టిగా ప్రశ్నించినా ఆ పార్టీ నేతలు తమ వ్యాఖ్యల్ని సమర్థించుకుంటున్నారు. జగన్ సహకారం లేకపోతే ఆయన వెంట ఉన్న నేతలు విచ్చలవిడిగా మాట్లాడే పరిస్థితి ఉండదు. మా పార్టీలో ఈ తరహా మాట్లాడిన వారిని పార్టీ నుంచి బయటకు పంపించాం. మేం యజ్ఞంలా అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నేతలు రాక్షసుల్లా దానికి ఆటంకం కలిగిస్తున్నారు అన్ని చంద్రబాబు అన్నారు.

**డ్వాక్రా మహిళలకు అభినందన**

అనంతరం ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాల మహిళలు ప్రదర్శించిన అధునాతన కుట్టు మిషన్లను సిఎం తిలకించారు. ఆధునిక కుట్టు మిషన్‌తో సీఎం చంద్రబాబు చిత్ర పటాన్ని అప్పటికప్పుడే తయారు చేసిన మహిళలు దానిని ముఖ్యమంత్రికి అందించారు. అరటి నారతో తయారు చేసిన వివిధ ఉత్పత్తులను చూసిన సిఎం డ్వాక్రా సంఘాల మహిళలను అభినందించారు. ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న ఉద్యాన పంటల ఉత్పత్తులు, మత్స్యకార బోట్లకు బిగించే ట్రాన్స్ పాండర్లను సిఎం పరిశీలించారు. అదే విధంగా పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గతంలో అభివృద్ధి సంక్షేమ విషయంలో రెండవ స్థానంలో ఉండేదని ఇప్పుడు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ హిమాన్ శుక్లాను అభినందించడం జరిగింది. గూడూరు నియోజకవర్గ అభివృద్ధి బాగుందని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ని అభినందించారు జిల్లాలో పెన్షన్ పంపిణీ విషయంలో 91 శాతం పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. అనంతరం శాఖల వారీగా వారి వారి పనితీరును బట్టి ఎంతవరకు పని చేస్తున్నారో రికార్డు పూర్వకంగా తెలుపుతూ ఇంకా చురుగ్గా పనిచేయాలన్నారు.

**ఓడూరు గ్రామానికి వరాల జల్లు..**

గూడూరు గ్రామపంచాయతీలో సిసి రోడ్డు డ్రైనేజీ వాటర్ పైప్లైన్ పూర్తిస్థాయిలో గ్రామానికి కావాల్సిన అన్ని పనులు త్వరితిగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్‌కి ఎమ్మెల్యేకి ఆదేశాలు జారీ చేయడం జరిగింది జిల్లాలో అక్రమ గంజాయి డ్రగ్స్ పూర్తిస్థాయిలో అరికట్టినందుకు జిల్లాఎస్పీ అజిత వేజెండ్ల ఏఎస్పి సౌమ్య, డి.ఎస్.పి దీక్షిత్లను ప్రత్యేకంగా అభినందించారు. ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు రౌడీయిజాలో రాజీ పడకూడదని వారికి ఆదేశాలు ఇచ్చారు.



వెనెజులా భూకంప దుర్ఘటనలో భవన శిధిలాలవద్ద విచారకరంగా కూర్చున్న బాధితులు

# విజయ్ సర్కార్‌ను కూల్చే కుట్ర!

>> కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

**ఎమ్మెల్యేకు రూ.35 కోట్ల ఆఫర్!**

తంగరై టివికె ఎమ్మెల్యే ఎన్. ఎళయ్యరాజా చెన్నై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో సంచలన ఆరోపణలు చేశారు. ఐపీడీఎస్ అనే కన్సల్టెన్సీ సంస్థకు చెందిన వ్యక్తి తనకు రూ.35 కోట్ల ప్రలోభం చూపించి, తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జెసిడి ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ విషయాన్ని బయటకు చెబితే పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరించినట్లు కూడా ఆయన ఆరోపించారు.అరెస్టయిన వారిలో ఒకరు డిఎంకె ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీ, ఆయన సోదరుడు అశోక్‌కు అత్యంత సన్నిహితుడని సమాచారం. డిఎంకెపై టివికె మంత్రి తీవ్ర ఆరోపణలుఈ ఘటనపై తమిళనాడు మంత్రి సీటీ నిర్మల్ కుమార్ డిఎంకేపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.సెంథిల్ బాలాజీకి సన్నిహితులు, అలాగే కరూర్ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తులు ఈ కుట్రలో నేరుగా పాల్గొన్నారని ఆరోపించారు. కుట్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ పోలీసులు అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎంకే ఏఐఏడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామితో కుమ్మక్కై విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తమ పార్టీ ఎమ్మెల్యేలకు రూ.10 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఆఫర్లు ఇస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.డిఎంకే అగ్రనేతలు ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ ఆదేశాల మేరకు సెంథిల్ బాలాజీ పలువురు టివికే ఎమ్మెల్యేలను సంప్రదించారని కూడా మంత్రి ఆరోపించారు. డిఎంకే కౌంటర్ టివికె ఆరోపణలను డీఎంకే ఖండించింది. విచారణ పూర్తికాకముందే దర్యాప్తు వివరాలను లీక్ చేసి ప్రజల్లో తప్పుడు అభిప్రాయం కల్పించేందుకు టీవీకే ప్రయత్నిస్తోందని డీఎంకే అధికార ప్రతినిధి ఏ. శరవణన్ విమర్శించారు.సెంథిల్ బాలాజీపై స్పష్టమైన ఆధారాలు ఉంటే వెంటనే అరెస్టు చేయాలని టీవీకే ప్రభుత్వానికి ఆయన సవాల్ విసిరారు.

# భగ్గుమన్న రెండు లారీలు

>> క్లీనరు సజీవ దహనం జరిగిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసు కుంది. సంఘటనకు సంబంధించి స్దానికుల సమాచారం మేర జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై ఒక లారీ డీజిల్ అయిపోయి బ్రేక్ డవున్ అవ్వటం లారీ ముందుకు కదలక సుమారు అర్ధ రాత్రి నుండి అక్కడే నిల్చిపోవటం జరిగింది. అయితే గ్రానైట్‌లోడు కలిగిన తాడిపత్రికి చెందిన ఎపి 02 టిఇ 2679 నంబరు లారీ చిలకలూరిపేట వైపు నుండి గుంటూరు వైపు వెళుతున్న క్రమంలో అగి ఉన్న లారీని గుర్తించలేకపోవటంతో లారీ సమీపంలోకి వచ్చేసరికి లారీని తప్పించే క్రమంలో కుడివైపు డివైడర్‌ను బలంగా ఢీకొనటంతో డివైడర్‌పై ఉన్న ఇనుప గడ్డర్‌లు ఎగిరి పడిపోవటం కారణంగా గుంటూరు వైపు నుండి చిలకలూరిపేట వైపు వెళుతున్న పేపర్ లోడు లారీ కర్ణాటక లోని కోలార్ జిల్లా శెట్టి లింగం పల్లి గ్రామంకు చెందిన ఎపి 39 వియఫ్ 1959 నంబరు లారీని బలంగా ఢీకొనటం ఢీకున్న సమయంలో గ్రానైట్ లారీ సుమారు మూడు నుండి నాలుగు మీటర్లు ఎత్తు ఎగిరి పడిపోవటం జరిగిందన్నారు. ఈ క్రమంలో లారీలోని గ్రానైట్ మరియు ఎదురు లారీలోని పేపర్ ఎగిరి రెండు లారీల క్యాబిన్‌లను కప్పి వేయటం జరిగింది. బలంగా ఢీకొనటంతో రెండు లారీల క్యాబిన్‌లు పూర్తిగా అతుక్కు పోయాయి. ఈ విషయం స్దానిక ప్రజలు గమనించి వెంటనే సంఘటన ప్రాంతానికి చేరుకొని లారీ క్యాబిన్‌లలో నుండి వస్తున్న డ్రైవర్ల అర్తనాధాల అధారంగా కప్పివేసిన రాళ్లను, పేపర్ కట్టలను తొలగించుకుంటూ ముందుకు పోయి వారిని కాపాడే ప్రయత్నం చేయటం ప్రారంభిస్తున్న తరుణంలో మంటలు ఒక్కసారిగా ఎగిసి పడేసరికి ఎక్కడి వారు అక్కడ నుండి పక్కకు రాక తప్పలేదు. విషయాన్ని వెంటనే అగ్నిమాపక, పోలీసులకు చేరవేయటం జరిగిందన్నారు. లారీల డ్రైవర్లు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నాపరాయి లారీ డ్రైవర్ మేకల రవికుమార్‌గా గుర్తింపు, నంద్యాల జిల్లా నేరేడుచర్ల గ్రామవాసి అయిన రవికుమార్‌కు భార్య అపర్ణ, ఇద్దరు పిల్లలు ఉన్నారని, అదేవిధంగా రెండో మృతుడు నాపరాయి లారీకి చెందిన క్లీనర్ రమేష్‌గా గుర్తించారు. రెండవ పేపర్ లారీ లోడు డ్రైవర్ ధర్మపతిగా పోలీసులు గుర్తించారు. సంఘటనా స్దలంకు అగ్నిమాపక సిబ్బంది రెండు వాహనాల ద్వారా మంటలను అదుపులోకి తీసుకు వచ్చినా అప్పటికే జరగవల్సిన నష్టం జరిగిపోయింది. సంఘటనా స్దలాన్ని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు అందజేసారు.

# రాష్ట్రంలో 18 నగర వనాలు

>> పచ్చదనాన్ని ఇవ్వడమే కాకుండా, ప్రజల శారీరక, మానసిక ఉల్లాసానికి కేంద్రాలుగా నిలవనున్నాయి. ఇందులో పక్షుల ఆవాసాలు, బోటింగ్, కయాకింగ్ (చిన్న పడవలు నడపడం), ట్రెకింగ్ పాయింట్లు, యోగా కేంద్రాలు, ఓపెన్ జిమ్‌లు వంటి ఎన్నో ప్రత్యేక ఆకర్షణలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

**పచ్చదనాన్ని కాపాడుకుందాం**

కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న ఆధునిక నగరాలలో, అలసిన మనుషులకు ఈ నగర వనాలు ప్రకృతిలోని ప్రశాంతతను పరిచయం చేస్తాయి. ఇవి కేవలం నేటి అవసరాల కోసమే కాదు, రాబోయే తరాల కోసం మనం అందిస్తున్న పచ్చని వారసత్వం. ప్రతి ఒక్కరూ వీటిని కాపాడుకుంటూ, మరింత పచ్చని, పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వాములు కావాల్ని అని పిలుపు నిచ్చారు.

**స్వయంగా పరిశీలించాను... నిజంగా అద్భుతం**

ఈ సమావేశంలో తన కార్యాలయం నుంచి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఉన్న నగర వనాన్ని స్వయంగా వెళ్లి పరిశీలించాను. పచ్చదనం, ప్రశాంతతో పాటు ఏర్పాటు చేసిన అత్యాధునిక వసతులు కుటుంబంతో కలిసి సమయం గడపడానికి ఎంతో అద్భుతంగా ఉన్నాయి. నగర వనానికి సమీపంలోనే ఉన్న గుట్టను, దానిపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని ఈ పార్కుతో అనుసంధానం చేస్తే బాగుంటుంది అన్నారు.పార్కును, గుట్టను కలిపి ట్రెకింగ్ పాయింట్‌గా అభివృద్ధి చేస్తే, అది నగరవాసులకు ఒక సరికొత్త ఆధ్యాత్మిక, సాహస పర్యాటక అనుభూతిని అందిస్తుంద"న్నారు.

# 3వేల డాక్టర్ పోస్టుల భర్తీ

>> ల్లోని వారందరూ ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని కోరుతున్నానని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో చోటు చేసుకున్టుకున్న పలు సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. వైద్యులతో వాగ్వాదాలు , దూషణలు లకు దిగకుడా గౌరవాన్ని ప్రదర్శించాలని తెలిపారు. భగవంతుడు ప్రాణాలు ఇస్తుంటే.. వాటిని నిలుపుతున్న వైద్యులకు అభినందనలు తెలుపుతున్నానని చెప్పారు. వైద్యులు కూడా వృత్తిపట్ల నిబద్ధత పాటిస్తూ రోగులు, వారికుటుంబాల్లో ఉండే ఆందోళనను అర్థంచేసుకుంటూ సేవా భావం, మానవతా వాదంతో వ్యవహరించాలని కోరారు. గడిచిన 2 సంవత్సరాల్లో కొత్తగా విధుల్లోనికి వచ్చిన 3000 మంది యువ వైద్యులు రోగులకు వైద్య సేవలు అందిస్తూనే పరిశోధనలపై దృష్టి పెట్టాలన్నారు.కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, స్థానిక పట్టణ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, వరుణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం జరిగిన 'జాతీయ వైద్యుల దినోత్సవ' వేడుకల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ గడిచిన రెండు సంవత్సరాల్లో కూటమిప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల బలోపేతానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నందువల్ల ఓపీలో 18!!, ఐపీలో 6.5!! చొప్పన వృద్ధి నమోదైందన్నారు. జీరో వెకెన్సీ విధానంలో ప్రభుత్వాసుపత్రుల్లో పారా మెడికల్ కేటగిరిలో అన్ని స్థాయుల్లో కలిపి 12వేల ఖాళీలను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసామన్నారు.వైద్యుల ఖాళీల్లో 3వేల వరకు భర్తీచేసినట్లు తెలిపారు.

# హెడ్ కానిస్టేబుళ్లు అరెస్టు

>> దర్యాప్తులో తేలింది. కొన్ని కేసులు, నాన్‌బెయిలబుల్ వారెంట్లు ఉన్న సాయి కృష్ణను మార్కాపురంలో అదుపులోకి తీసుకుని, కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించినట్లు సిట్ పేర్కొంది.
ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఇన్‌స్పెక్టర్ నాగరాజును సిట్ జూన్ 23న అరెస్ట్ చేయగా, కోర్టు అతనికి జులై 8 వరకు రిమాండ్ విధించింది. మరో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, నాని ఇప్పటికే పోలీసులకు లొంగిపోగా, వారిని కూడా ప్రభుత్వం సస్పెండ్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. ఐజీ ఎం. రవిప్రకాశ్ నేతృత్వంలోని సిట్ బృందం కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తోంది.

# ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

**• మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టీకరణ • శ్రీకొలనులో రూ.1.31 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**



**అనుమసముద్రంపేట, (నెల్లూరు), జులై 1 ప్రభాతవార్త:** ఆనం రామనారాయణరెడ్డి ఏఎస్‌పేట మండలంలోని శ్రీకొలను గ్రామ పర్యటన సందర్భంగా గ్రామమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. గ్రామ ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి మంత్రికి ఘనస్వాగతం పలికారు. జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రాంగణానికి బాలికలు పూలబాటతో మంత్రిని ఆహ్వానించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు హారతలు పట్టి స్వాగతం పలికారు. ఈసందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శ్రీకొలను గ్రామంలో మొత్తం రూ.1.31 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, శంకుస్థాపనలు చేశారు. రూ.31.50 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించగా రూ.31 లక్షలతో నిర్మించిన 5సిసిరోడ్లను ప్రజలకు అంకితం చేశారు. రూ.28 లక్షలతో చేపట్టనున్న సాగునీటి చెరువు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. టిటిడి శ్రీవాణి ట్రస్ట్ నిధులతో రూ.40లక్షల వ్యయంతో నిర్మించనున్న శ్రీ గంగమ్మ అమ్మవారి ఆలయానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, రాష్ట్ర పాఠశాలల, సంక్షేమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్, టిడిపి మండల అధ్యక్షుడు అబ్బూరి రమేష్‌నాయుడు, రాజవోలు సొసైటీ చైర్మన్ కాటంరెడ్డి నర్సింహారెడ్డి, టిడిపి మండల ఉపాధ్యక్షుడు పులిమి సుధాకర్‌రెడ్డి, టిడిపి మండల మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ జిలానీబాషా, జిల్లా తెలుగుయువత మాజీ అధ్యక్షుడు ఏలూరి మాల్యాద్రి నాయుడు, పేట మాజీ ఎంపిటిసి సభ్యులు షేక్ షబ్బీర్‌బాషా, జనసేన పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సయ్యద్ అక్బర్‌బాషా, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, షేక్ యస్దానిబాషా, ఇతర పార్టీ ముఖ్య నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

**శ్రీకొలను గిరిజన కాలనీలో పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి 'ఆనం':** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌పథకం కింద లబ్ధిదారులకు మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి బుధవారం ఏఎస్‌పేట మండలంలోని శ్రీకొలను గ్రామ గిరిజన కాలనీలో స్వయంగా ఇంటింటికి వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేశారు.

ఈసందర్భంగా మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి వృద్ధులు. వికలాంగులు, వితంతువులు, బ్రాహ్మణులతోపాటు ఇతర పెన్షన్ లబ్ధిదారులను ఆప్యాయంగా పలుకరించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ అవసరమైన సూచనలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేస్తున్న మూడు కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి రామనారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# హీరో మోటోకార్ప్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్-2.0కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

**రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ప్రాజెక్టు దోహదమన్న ముఖ్యమంత్రి**

**సత్యవేడు, జులై 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం సత్యవేడు మండలం మదనపాళెం గ్రామంలోని హీరో మోటోకార్ప్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0 కేంద్రానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రపంచంలోనే అతి పెద్ద ద్విచక్రవాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ తన రెండో గ్లోబల్ పార్ట్స్ సెంటర్ నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవతో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం మండలం మదనపాళెంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుని అక్కడి నుంచి శంకుస్థాపన ప్రాంగణానికి ముఖ్యమంత్రి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హీరో మోటోకార్ప్ సంస్థ చేపట్టనున్న గ్లోబల్‌పార్ట్స్ సెంటర్ 2.0 ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి, ఉపాధి అవకాశాల విస్తరణకు దోహదం అవుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హీరో మోటోకార్ప్ గ్లోబల్ విడి భాగాల సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లకు వేగవంతమైన సేవలు అందించడం లక్ష్యంగా ఈ గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌ని ఏర్పాటు చేస్తున్నట్లు హీరో సంస్థ తెలిపింది. అనంతరం హీరో మోటోకార్ప్ సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా. పవన్ ముంజాల్, అనీషా ముంజాల్, సీఈవో హర్షవర్ధన్ చిట్లే, సంస్థ ప్రతినిధులు, రాష్ట్ర మంత్రులు, అధికారులతో కలసి హీరో మోటోకార్ప్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్న ప్రదేశాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. భవిష్యత్‌లో ప్లాంట్ ద్వారా చేయనున్న ఉత్పత్తి, నిల్వ పంపిణీ విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రిని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను హీరో మోటోకార్ప్ సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పవన్ ముంజాల్ ఘనంగా సన్మానించారు. హీరోమోటో కార్ప్ వ్యవస్థాపకుడు, మాజీ చైర్మన్ బ్రిజ్‌మోహన్ లాల్ ముంజాల్, 103వ జయంతిని పురస్కరించుకుని ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.




అనంతరం హీరోమోటో కార్ప్ సంస్థ సిఇఒ హర్షవర్ధన్ చిట్లే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధికి మరో మైలురాయిగా రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధికి మరింత ఊతమిస్తూ తిరుపతి జిల్లాలో హీరో మోటోకార్ప్ సంస్థ రెండవ గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కి శంకుస్థాపన నిర్వహించామన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి, సుపరిపాలన, సమ్మిళిత అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు అందిస్తున్న ప్రోత్సాహం, అనుకూల విధానాలు పెట్టుబడులను ఆకర్షించబడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు, జేసీ ఆర్.గోవిందరావు, ఎమ్మెల్యే ఆదిమూలం, సూళ్లూరుపేట ఆర్డీఒ దేవేందర్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు కంభంపాటి రామ్మోహనరావు, ప్రజాప్రతినిధులు, హీరో మోటోకార్ప్ సంస్థ శ్రీసిటీ అధికారులు, సిబ్బంది, వివిధశాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పెన్షనర్ల కళ్ళల్లో ఆనందం

**• విజయనగరం జిల్లా పాచలవలసలో పెన్షన్లు పంపిణి చేసిన మంత్రి శ్రీనివాస్**



**విజయనగరం, జులై 1 ప్రభాతవార్త:** ప్రభుత్వం నుంచి ఇస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో పెన్షనర్ల కళ్ళల్లో ఆనందం చూడగలుగుతున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం దత్తిరాజేరు మండలం పాచలవలస గ్రామంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి నెలా ఒకటినే పింఛన్ల పంపిణీ చేయటం జరుగుతుందనీ, పింఛన్ల పంపిణీ విధానంలో దేశానికే ఏపీ ఆదర్శం అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పెన్షన్ల కోసం రూ.68,598.44 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సంక్షేమానికి పునాదిగా అన్న ఎన్టీఆర్ నిలిచారు. 1983లో ఎన్టీఆర్ పెన్షన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2014-19లో పెన్షన్ రూ.2 వేలు చేసిన ఘనత సీఎం చంద్రబాబు గారిదేనని, నేడు రాష్ట్రంలో సామాజిక పెన్షన్ ద్వారా లబ్ధిదారులకు రూ.4 వేల పెన్షన్‌ను అందిస్తున్న ఘనత కూడా కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో రూ.66 వేల కోట్లు పింఛన్ పంపిణీ కోసం ఖర్చు చేయటం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని పెన్షన్లు పంపిణీ చేసి పేదలు మరింత గౌరవంగా జీవించేలా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాల రాజు, దత్తిరాజేరు పార్టీ మండల అధ్యక్షులు చప్పా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవు

**• సద్విమర్శలను స్వాగతిస్తాం.. వ్యక్తిగత దూషణలు చేస్తే సహించం • సోషల్ మీడియా ఫిర్యాదులపై ప్రత్యేక విభాగం అవసరమైతే కొత్త చట్టాలు తీసుకొస్తాం • ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**



**విజయవాడ, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును మన స్ఫూర్తిగా స్వాగతిస్తామని, అయితే సరైన ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే మాత్రం ఎంత మాత్రం ఉపేక్షించబోమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. వాక్ స్వాతంత్రం అనేది అపరిమితమైన హక్కు కాదని, దానికీ కొన్ని పరిమితులు ఉన్నాయన్నారు. ఇతరుల హక్కులను కాలరాసే హక్కు దానికి లేదన్నారు. సోషల్ మీడియాలో మత విశ్వాసాలను గాయపచడం, వ్యక్తిగత దూషణలకు దిగడం, హత్యా బెదిరింపులకు పాల్పడడం, దేవుళ్లు, దేవతలపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడం సమంజసం కాదని స్పష్టం చేశారు. ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇందుకోసం అవసరమైతే కొత్త చట్టాలు, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. వాక్ స్వాతంత్రం.. సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం సాయంత్రం సోషల్ మీడియాలో సందేశం ఇచ్చారు. 'సోషల్ మీడియా మన అభిప్రాయాలను చెప్పడానికి, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడానికి, ఒకరితో ఒకరు అనుసంధానమవ్వడానికి, ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ఇది ఒక శక్తివంతమైన వేదిక. భావ ప్రకటన స్వేచ్ఛ అనేది మన రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. ఆ హక్కును గౌరవిస్తాను.. ప్రభుత్వం గౌరవిస్తుంది. కానీ వాక్ స్వాతంత్రం ముసుగులో ఇతరుల హక్కులకు భంగం వాటిల్లితే చట్టపరమైన పరిణామాలు తప్పవు అని హెచ్చరించారు. 'ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్ అంటే ఫ్రీడమ్ టూ అబ్యూజ్ కాదు. ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు మీకుంది. మమ్మల్ని ప్రశ్నించే హక్కు మీకుంది. మా నిర్ణయాలతో విభేదించే హక్కు మీకుంది. అదే ప్రజాస్వామ్యం... దాన్ని మేము స్వాగతిస్తామ్ము అని పేర్కొన్నారు.

**ఫేక్ అకౌంట్ల వెనుక దాక్కుని అరాచకాలా?:** 'గత కొన్ని ఏళ్లుగా సోషల్ మీడియాను కొందరు తప్పుడు పనులకు వాడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఫేక్ అకౌంట్ల వెనుక దాక్కుని అసభ్యంగా మాట్లాడడం, వ్యక్తిగతంగా తిట్టడం, పరువు తీయడం, ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ఎక్కువైపోయింది. అబద్ధపు ప్రచారాలు చేయడం, ఫోటోలను అసభ్యంగా మార్చడం, భయపెట్టడం వంటి పనులకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా మహిళలను టార్గెట్ చేస్తూ చండాలమైన పోస్టులు పెడుతున్నారు. ఇలాంటి పనులను భావ ప్రకటన స్వేచ్ఛ అనరు. ఇది మంచి విమర్శ కాదు, ప్రజాస్వామ్యం అసలే కాదు. తప్పులను ఎత్తిచూపడం, సరదాగా సెటైర్లు వేయడం, సొంత అభిప్రాయాలను చెప్పే హక్కును మేము పూర్తిగా గౌరవిస్తాము. కానీ కావాలనే అబద్ధాలు ప్రచారం చేయడం, విద్వేషాలు రెచ్చగొట్టడం, ప్రాణాలతో చెలగాటం ఆడుతామని బెదిరించడం, ఆన్‌లైన్ వేధింపులకు పాల్పడడం, ఒకరి పరువు తీయాలని చూడడం... ఇవన్నీ భావ ప్రకటన స్వేచ్ఛ కిందకు రావు. వీటిని ఏమాత్రం సమర్థించలేమ్ము అని డి.సిఎం పవన్ హెచ్చరించారు. 'నేరానికి కులం, మతం, లేదా రాజకీయ పార్టీ అనే తేడాలు ఉండవు. చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానమే. తప్పు చేసిన వాడు ఎంతటి వాడైనా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవు అని డి.సిఎం స్పష్టం చేశారు.

'సోషల్ మీడియాలో వేధింపులు, దూషణల వల్ల ఇబ్బందులు పడుతున్న బాధితులందరికీ నేను ఒకే మాట చెబుతున్నాను... మీరు అస్సలు ఒంటరివారు కాదు. ఈ ప్రభుత్వం మీకు పూర్తి అండగా ఉంటుంది. మీ సమస్యలపై ఫిర్యాదులు తీసుకోవడానికి ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాము. వేధింపులకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లు, లింక్‌లు, వీడియోలు వంటి డిజిటల్ ఆధారాలతో మీరు ఫిర్యాదు చేయవచ్చు. ప్రతి నిజమైన ఫిర్యాదును మేమే స్వయంగా పరిశీలించి, అధికారుల ద్వారా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తామ్ము అని డి.సిఎం పవన్ హామీనిచ్చారు.

# జగన్‌కు దమ్ముంటే పులివెందుల వదిలి ఎక్కడి నుంచైనా పోటీ చేయాలి

**• రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ • నర్సీపట్నంలో ఎంపికి ఘన సన్మానం • జనసంద్రంగా మారిన భారీ ర్యాలీ**



**నర్సీపట్నం, జులై 1 ప్రభాతవార్త:** రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన చింతకాయల విజయ్ అభినందన సభ నర్సీపట్నంలో అత్యంత ఘనంగా జరిగింది. రాజ్యసభ ఎంపీగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారిగా నర్సీపట్నం వచ్చిన సందర్భంగా ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఆయన నర్సీపట్నం దుర్గా మల్లేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది ప్రజలు, అభిమానులు, కార్యకర్తల నడుమ భారీ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. దారిపొడవునా ఇసుకవేస్తే రాలనంత జనసందోహంతో ఈ ర్యాలీ నర్సీపట్నంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన ఈ వేడుకలో పలువురు రాజకీయ ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొని విజయ్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రసంగించారు. భవిష్యత్తులో జిల్లాను విజయ్ ముందుకు నడిపించాలని గండి బాబ్జీ ఆకాంక్షించారు. సీనియర్ నాయకులు దాడి వీరభద్రరావు మాట్లాడుతూ వైసిపి హయాంలో అయ్యన్న కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, చెరువులను ఆక్రమించింది వైసిపి నాయకులేనని విమర్శించారు. పెద్ద చెరువులో శివ పార్వతులు ఏర్పాటును అడ్డుకోవడం సిగ్గుచేటని, విజయ్ పడిన కష్టానికి దక్కిన ఫలితమే ఈ రాజ్యసభ పదవి అని కొనియాడారు. అనకాపల్లి ఎంపి సిఎం రమేష్ మాట్లాడుతూ.. రాజ్యసభలో పలువురు సభ్యులు తెలుగులో ప్రమాణస్వీకారం చేస్తే, విజయ్ హిందీలో అనర్గళంగా చేశారని, ఆయన సామాన్యమైన వ్యక్తి కాదని ప్రశంసించారు. దేశంలోనే అతి చిన్న వయసులో రాజ్యసభ సభ్యుడు కావడం చిన్న విషయం కాదని, అనకాపల్లి పార్లమెంటు అభివృద్ధికి తామిద్దరం కలిసి సమష్టిగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. హోం మంత్రి అనిత ప్రసంగిస్తూ సైకోలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాజకీయాలు చేయడం ఎంతో కష్టమని, అయినా వారి కుట్రలను, కేసులను ధైర్యంగా ఎదుర్కొని నిలబడ్డ వ్యక్తులు అయ్యన్న, విజయ్ లే అని ప్రశంసించారు. అయ్యన్న ఒకే పార్టీకి కట్టుబడి ఉన్న నాయకుడని, ఆయనపై కేసులు పెట్టిన రోజు కూడా ఏమాత్రం వెనుకడుగు వేయలేదని గుర్తుచేశారు.

మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ కేంద్రం తీసుకునే నిర్ణయాల్లో విజయ్ భాగస్వామ్యం కావడం శుభపరిణామం అన్నారు. వైసిపి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టడంలో విజయ్ కీలక పాత్ర పోషించారని, అప్పట్లో జగన్మోహన్ రెడ్డికి చెమటలు పట్టించింది అయ్యన్న, విజయ్ లేనని అన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ స్పీకర్ పదవి ఇచ్చి తన నోటికి తాళం వేశారని సరదాగా వ్యాఖ్యానించారు. ఇది సన్మాన సభ కాదని, ఆశీర్వాద సభ అని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే పనులను పార్టీ నాయకులు బాధ్యతగా పర్యవేక్షించాలని సూచించిన ఆయన, తప్పుడు పనులను తాను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించనని స్పష్టం చేశారు. సభలో చివరగా రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, నియోజకవర్గ ప్రజల సహకారంతోనే తాను ఈ స్థాయికి చేరుకున్నానని వినమ్రంగా తెలిపారు. ఏ కార్యకర్తకు అన్యాయం జరిగినా తాను ముందుండి పోరాడతానని భరోసా ఇచ్చారు. తాను ఎప్పటికీ పార్టీ జెండాకు కూలీగా పనిచేస్తానని చంద్రబాబుకు మాటిచ్చానని, దానికి తగ్గట్టుగానే గతంలో ఇచ్చిన మాటను తాను నిలబెట్టుకున్నానని చంద్రబాబు చెప్పారని గుర్తుచేసుకున్నారు. తనను సొంత కుటుంబ సభ్యుడిలా భావించిన నారా లోకేష్ ఈ అవకాశం కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు. జగన్‌కు దమ్ముంటే పులివెందుల వదిలి బయటకు వచ్చి పోటీ చేయాలని సవాల్ విసిరారు.

# విషపురుగు కాటు

**• 16మంది విద్యార్థులకు అస్వస్థత... ఆస్పత్రిలో చేరిక • చిత్తూరు జిల్లా డిఎంపురం ఉన్నతపాఠశాలలో ఘటన**

**చిత్తూరు(కార్వేటినగరం), జులై 1 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా జిడినెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండలంలోని డియంపురం ఉన్నతపాఠశాల విద్యార్థులకు విషపురుగుకాటు వేయడంతో శరీరమంతా దద్దుర్లు, దురదలతో విలవిల్లాడారు. ఈ ఉదంతం మంగళవారం జరిగింది. ఉన్నతపాఠశాలలో 8, 9, 10 తరగతులు చదువుతున్న వారిలో దాదాపు 19మంది వరకు విద్యార్థినీవిద్యార్థులు వింత పురుగు పాకడంతో ఏం జరిగిందో తెలియక భయంతో వణికిపోయారు. కార్వేటినగరం మండలంలోని డి.యం. పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విషపురుగుల దాడి కలకలం రేపింది. తరగతి గదుల్లో ఉన్న విద్యార్థుల శరీరంపై ఒక్కసారిగా దురదలు రావడంతో అవస్థలు పడ్డారు. ఇలా సుమారు 16 మంది విద్యార్థుల శరీరంపై దద్దుర్లు ఏర్పడడంతో అసలు ఏం జరిగిందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అస్వస్థతకు గురైన విద్యార్థుల విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్ఎం తో పాటు ఉపాధ్యాయులకు ఏదో విష పురుగు కాటుకు గురైనట్లు గుర్తించారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు వెంటనే పుత్తూరు ఆసుపత్రికి తరలించారు. విద్యార్థుల పరిస్థితిని గమనించిన ఉపాధ్యాయులు వెంటనే అసలు కారణాన్ని వెతికే ప్రయత్నం చేశారు. పాఠశాల పరిసరాల్లో తిరుగుతున్న ఒక రకమైన విషపురుగు కాటు వల్లే పిల్లలకు ఈ పరిస్థితి వచ్చిందని వారు గుర్తించారు. ఆలస్యం చేయకుండా, దురదలతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులందరినీ వెంటనే పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాదముని రెడ్డి ఈ విషయాన్ని వెంటనే కార్వేటినగరం ఎంఇఒ విజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. పుత్తూరు ఆసుపత్రి వైద్యులు విద్యార్థులకు తక్షణమే అత్యవసర చికిత్స, యాంటీ అలర్జీ మందులను అందించారు. ఈ విషపురుగుల కాటు వల్ల ప్రాణాపాయం ఏమీ లేదని, పిల్లలందరూ క్షేమంగానే ఉన్నారని వైద్యులు స్పష్టం చేయడంతో అటు తల్లిదండ్రులు, ఇటు విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## రేపటిలోగా గురుకుల పాఠశాలల్లో చేరాలి

**విజయవాడ, జులై 1 ప్రభాతవార్త:** ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థినీ విద్యార్థులు ఈనెల 3వ తేదీలోపు తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరాలని కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల సమన్వయ అధికారి ఏ.మురళీ తెలిపారు. రేపు సాయంత్రంలోగా పాఠశాలల్లో చేరని విద్యార్థుల సీట్లు రద్దుచేసి వారి స్థానంలో తదుపరి మెరిట్ జాబితాలో ఉన్న అర్హులైన విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామన్నారు. ఎంపికయిన విద్యార్థులు ఆలస్యం చేయ కుండా తక్షణమే తమకు కేటా యించిన పాఠశాలలకు వెళ్ళి ప్రవేశ ప్రక్రియను పూర్తిచేయాలని, గడువు దాటిన వారిసీట్లు రద్దు చేస్తామని హెచ్చరించారు.




రేఖా నెం.1261/2026/జి1 తే.02.06.2026 ది                శ్రీ జిల్లా కలెక్టర్, శ్రీకాకుళం వారి కార్యాలయం

ఫారమ్ నెం. VI (ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావసం, పునఃస్థాపనలో న్యాయరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ నుదహరించిన షెడ్యూల్ భూములు ప్రజా ప్రయోజనము నిమిత్తం **శ్రీకాకుళం జిల్లా, పలాస డివిజన్** పరిధిలో ప్రభుత్వం వారిచే ఇటీవల మంజూరు చేయబడిన విద్యుత్ రహిత మరుగునీటి శుద్ధి కర్మాగారం (Natural Sewage Treatment Plant -NSTP) నిర్మాణం నిమిత్తం పలాస మండలములో గల **చిన్నబడం** గ్రామములో గుర్తించబడిన ప్రైవేటు భూములను భూ సేకరణ నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున **శ్రీ జిల్లా కలెక్టర్, శ్రీకాకుళం వారు** భూ సేకరణ చట్టం 2013 (సెంట్రల్ ఆర్ట్ నెం.30 ఆఫ్ 2013 వలన ప్రకారం భూ సేకరణ, పునరావాసం, పునః స్థాపనలలో న్యాయపరమైన నష్ట పరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టములో సెక్షన్ 11(1) నిబంధనలు అనుసరించి, ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుములముగా ఈ ప్రాదమిక ప్రకటన ప్రకారం తెలియజేయబడుచున్నది. ఈ భూ సేకరణ వల్ల నిర్వాసిత కుటుంబాలు లేవు.

పైన పేర్కున్న చట్టములో సెక్షన్- 12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి **శ్రీ రెవిన్యూ డివిజనల్ అధికారి, పలాస** వారిని, వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల సేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు శ్రీయుత జిల్లా కలెక్టర్ వారిచే **రేఖా నెం. 2050/2022 జి1 తేది 07.10.2024** ద్వారా అధికారము ఇవ్వబడినది.

పై చట్టములోని సెక్షన్ 11 (4) ననుసరించి ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి రెవిన్యూ డివిజనల్ అధికారి/ భూ సేకరణ అధికారి, పలస వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం / కొనుగోలు (క్రయ విక్రయములు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టములో సిషన్ 15 ననుసరించి భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధిత వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా రెవిన్యూ డివిజనల్ అధికారి/భూసేకరణ అధికారి, పలస వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలా చేసుకొనవచ్చును. (ఇందుతో భూ సేకరణ కు ప్రతిపాదించబడిన భూముల వివరములు జతపర్చడమైనది).

షెడ్యూల్

జిల్లా : **శ్రీకాకుళం**          మండలం : **పలాస**          గ్రామం : **చిన్నబడాం**

| వరుస సంఖ్య | సర్వే మెంబర్ | భూ వివరణ | పూరా విస్తీర్ణం (ఎ. సెంట్లు) | సేకరించే విస్తీర్ణం (ఎ. సెంట్లు) | పట్టాదారు పేరు మరియు చిరునామా | సరిహద్దులు | | | | చెట్లు, నిర్మాణం మొదలగునవి వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | ఉత్తర | దక్షిణ | తూర్పు | పడమర | |
| 1 | 106-16E | నంజ | 0.09 | 0.09 | మాదిన వెంకటేశం తండ్రి చంద్రయ్య | 106-16D | 105 | 106-10C | 83 | 0 |
| 2 | 106-16D | నంజ | 0.09 | 0.09 | మాదిన బాలకృష్ణ తండ్రి చంద్రయ్య | 106-16C1 | 106-16E | 106-21B | 106-8 | 0 |
| 3 | 106-16C1 | నంజ | 0.05 | 0.05 | మాదిన బాలకృష్ణ తండ్రి చంద్రయ్య | 106-16C2 | 106-16D | 106-21A | 106-8 | 0 |
| మొత్తం | | | | ఎ.0.23 సెంట్లు | | | | | | |

సం/- స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఐ.ఏ.ఎస్.,
జిల్లా కలెక్టర్, శ్రీకాకుళం


వార్త

మనం ఎంత నిజాయితీ పరులం అయి ఉంటే, ప్రభుత్వం పరిపాలన అంత చక్కగా సాగుతుంది.

- జఫర్సన్

# 'పెళ్లి' పుస్తకానికి చెదలు!

భారతీయ వైవాహిక వ్యవస్థ కట్టుబాట్లకు ప్రపంచ వ్యాప్తంగా జనం నీరాజనాలర్పిస్తున్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలంటే పాశ్చాత్య దేశాలూ మెచ్చుకోలుగా ప్రస్తావిస్తాయి. ఇదే తరుణంలో వైవాహిక భాగస్వాముల మధ్య వికారాలు కూడా నవ్వులపాలవుతున్నాయి. ఎన్నో వేల సంవత్సరాలుగా ఈ కట్టుబాట్లకు అగ్రస్థానమిస్తున్నాం. రెండు వేర్వేరు కుటుంబాల నుంచి వచ్చిన ఒక ఆడ మగా పాణిగ్రహణం పూర్తయ్యాక ఒకరినొకరు అర్థం చేసుకుని తరించడమే అందులోని అంతరార్థం. పవిత్ర ధర్మంలా ఆచరించి నూరేళ్ల పండించుకోవడమే కీలకం. వరకట్నాలు, కన్యాశుల్కాల వంటి ఆచారాలకు కాలదోషం పట్టి ఇప్పుడు భార్యాభర్తల అనురాగ మైత్రి మాత్రమే జీవితానుబంధంగా పెనవేసుకుపోతుందని చాటి చెప్పగల రోజుల్లో జీవిస్తున్నాము. ప్రాశ్చాత్య దేశాలలో కలిసికట్టుగా ఉండలేని కాంట్రాక్టు ఉన్నా లేకున్నావద్దనుకుంటే తప్పుకాదు. వారి మధ్య ఏవిధమైన ఆత్మీయ బంధాలు ఉండవు. అక్కడేమీ ఎలాంటి అభ్యంతరాలుండవు. అనుమానాలుండవు. విపరీత వికృత వికారాలు తక్కువే. అలా సాగిపోయే వ్యవస్థనూ తప్పుపట్టలేం. కానీ భారతీయ సంస్కృతికి పట్టుకొమ్మగా ఎంతో బలిష్టమైన నియమ నిబంధనలు ఉన్నాయంటూ ఎన్నో వందల ఏళ్లుగా చెప్పుకునే వైవాహిక వ్యవస్థ కొన్ని వెర్రితలలు వేస్తోంది. సాఫ్ట్‌వేర్ చదువులొచ్చాక యువతలో కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలు ఏర్పడడం కొందరు వివాహం ఆలస్యం చేసుకోవడం, కొందరు వయసు మళ్లుతున్నా వివాహం వైపు దృష్టి మరల్చుకోకపోవడం వంటి ఆలోచనల్లో పడ్డారు. ఇదే సమయంలో ప్రపంచం యావత్తూ ఇదేదో కొత్తగా ఉందనుకుంటున్న డేటింగ్ సంస్కృతి, సహజీవనం వంటి కొత్త పోకడలతో పోటీపడుతున్న పరిస్థితినీ గమనిస్తున్నాము. వివాహం, ప్రేమ, అప్యాయతలు, అనురాగాలకు, అనుబంధాలకు ఆటపట్టుగా ఉంటుంది. ఇప్పుడు జరుగుతున్న కొన్ని ఘటనలు చూస్తే కట్టుబాట్లకు విలువల్లేకుండా మారిపోయాయి. యువత ప్రవర్తనలో వికృత ప్రవర్తన బయటపడుతుంది. సమాజం చెడిపోయిందనేంత పెద్ద మాట వాడనక్కర్లేదు కానీ అదే దిశగా పయనిస్తుందేమోనన్న భయం వేయకమానదు. ఏది ఏమైనా వ్యవస్థ కుళ్లిపోవడం మొదలౌతోందని అనుకున్నప్పుడే మందు ఎలావేయాలో ఆలోచించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. యువత వికృత చేష్టలకు పాత తరాల వారయితే కంగారు పడుతున్నారు. వివాహ వ్యవస్థలో భాగస్వాములకు ఒకరి మీద ఒకరికి నమ్మకం ముఖ్యం. అదే సన్నగిల్లి ఒకరి చావును మరొకరు కళ్లారా చూడాలనుకున్న కొన్ని ఉదంతాలను గూర్చి చర్చించుకోవాలి. ఉత్తరాఖండ్‌లోని ముస్సోరిలో జరిగిన విశాఖ పట్నంకు చెందిన రాధా గాయత్రి హత్యకేసు, పూణెలో కేతన్ అగర్వాల్ హత్య కేసులను విశ్లేషించుకుంటే అన వసర కారణాలు, అనుమానాలతో తనను నమ్మి వచ్చిన భాగస్వాములను పరలోకానికి పంపి తమ జీవితాలను ఎలా జైళ్లపాలు చేసుకున్నారో అర్థమవుతుంది. ఇవే ఇప్పుడు వివాహ వ్యవస్థను కుదిపేసాయి. వ్యవస్థకు చెదలు పడుతున్నట్లు చెప్పుకోవచ్చు. పెళ్లంటే ఇష్టం లేకపోతే తల్లి దండ్రులకు, చెబితే వాళ్లే సాహసించరు కానీ వాళ్లకు చెప్పి ఒప్పించడం కన్నా కాబోయే వరుడిని చంపడమే తేలికగా భావించి కటకటాలపాలైన పూణె యువతి సియాగోయెల్ వ్యవహారం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పూణెలోని లోహాగఢ్ కోటలో ఔత్సాహిక పారిశ్రామికవేత్త కేతన్ అగర్వాల్‌తో సియో వివాహం కుదుర్చుకుంది. తనకు అంత క్రితమే పరిచయమున్న ప్రియుడు చేతన్ చౌదరి సాయంతో నమ్మించి లోయలోకి తోసేసింది. కేతన్‌తో పెళ్లి వద్దనుకున్నప్పుడు అప్పటికే కోటి రూపాయలు ఎందుకు తీసుకున్నట్లు? డబ్బు ఇవ్వక్కర్లేకుండా ప్రియుడితో కాలక్షేపం చేసేందుకు ఈ దురాగతానికిపాల్పడి ఉండొచ్చునన్న అనుమానం రాకపోదు. పెళ్లి వద్దని చెప్పేస్తే కేతన్ మరో మంచి సంబంధం చేసుకుంటాడుగా. ఆమె ఆలోచన దుష్కృత్యం వైపు ఎందుకు మళ్లింది. వివాహ బంధాన్ని తేలిక తీసుకున్నట్లు అనుకోవాలి. అంటే తాంబూలాలు మార్చుకుని కూడా తప్పుడు త్రోవతొక్కింది. అతని ప్రాణాల్ని తీసే హక్కు ఆమెకెవరు ఇచ్చారు? ఆ మధ్య మేఘాలయాలో హనీమూన్ హత్యకేసు ఇదే స్థాయిలో సంచలనం సృష్టించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారి రాజా రఘువంశీని సాక్షాత్తు అతని భార్య సోనమ్ తన ప్రియుడి రాజ్‌కుశ్వాహాతో కలిసి అత్యంత కిరాతకంగా హత్యచేసింది. మే 23న హనీమూన్ ట్రిప్' ఫొటోషూట్' కని తీసుకెళ్లి అక్కడ హత్యకు ప్లాన్ చేసింది. ఇక్కడ కిరాయి హంతకులకు రూ.20 లక్షల సుపారీ ఖర్చు. భర్తతో సంసారం చేయలేనని నిర్ణయించుకున్నప్పుడు హుందాగా చెప్పి విడాకులు తీసుకోవచ్చు. ఈకాలంలో అదేదీ తప్పేకాదు. మరి ఇప్పుడే మయ్యింది. ఒకళ్ల ప్రాణం తీయడం అంత సులువా, తీరా జైలు గతిని తప్పించుకోవడం సాధ్యమేనా? ఎందుకు ఆలోచించరు? ముస్సోరిలో విశాఖపట్నంకు చెందిన రాధా గాయత్రి దుర్మరణం మరీ ఘోరం. అనుమానపు భర్తతో హనీమూన్ కెళ్లడమే ఆమె చేసిన తప్పు. అంతిమ నిర్ణయం తీసుకునే లోపు ఓ శాడిస్టు భర్త చేతన్‌కుమార్ మారతాడని చివరి అవకాశం ఇవ్వడమే ఆమె అపరాధమని ఇప్పుడు అందరూ అనుకుంటున్న మాట. పైగా తప్పుకోడానికి ఎన్నో డ్రామాలు ఆడుతున్నాడు. చదువు నేర్పిన సంస్కారమిదా? అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఇవన్నీ వివాహ బంధాన్ని వికృత క్రీడగా భావించి దురాగతానికి అంకురార్పణ చేసిన వారు శిక్షార్హులు. దేశ కాలమాన పరిస్థితులు యువతలో వైపరీత్య ఆలోచనలు పెచ్చు పెరుగుతున్నాయని ముందే గ్రహించి సంబంధాల కూర్పులో తల్లిదండ్రులు మరింత జాగ్రత్త వహించాల్సిందే.



ఎంత గొప్ప చదువు అయినా, ప్రావీణ్యత అలవాటు అవ్వాలంటే అది చెప్పే వారిపై ఆధారపడి ఉంటుంది.

మహాత్మా గాంధీ



చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందుచూపు ఎంతో అవసరం.

వి.జాన్సన్

## ప్రజావాక్కు

### అగ్నిప్రమాదాల నుంచి గుణపాఠం నేర్చుకోవాలి

లక్నోలో వాణిజ్యభవనంలో నిర్వహిస్తున్నకోచింగ్ సెంటర్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం దేశాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న ఈ ఘటన భవన భద్రత, అగ్నిమాపక ఏర్పాట్లు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే సామర్థ్యంలో ఉన్న లోపాలను బహిర్గతం చేసింది. గతఏడాదిలో ఢిల్లీలోని మాలవీయనగర్ అతిథి గృహం, తుగ్లకాబాద్ నివాస భవనం, బెంగళూరులోని కుంబారపేట గిడ్డంగి వంటి చోట్ల జరిగిన అగ్నిప్రమాదాలు కూడా భద్రతా నిబంధనల నిర్లక్ష్యానికి ఉదాహరణలుగా నిలిచాయి. అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయడం మాత్రమే సరిపోదు. వాటిని ఎలా ఉపయోగించాలి? అత్యవసర పరిస్థితుల్లో భవనం నుంచి ఎలాబయటపడాలి? అనే విషయాలపైవిద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన ఉండాలి. ప్రతి కోచింగ్ సెంటర్, పాఠశాల, కళాశాల, వాణిజ్య భవనంలో నిరంతరం ఫైర్ డ్రిల్స్, ఎవాక్యుయేషన్ శిక్షణ, భద్రతా సూచనలను తప్పనిసరి చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### మద్యం దుకాణాలను ఎత్తివేయాలి

తమిళనాడుప్రభుత్వం ప్రార్థనాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్ల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను తొలగించేందుకు తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమైనది. ఇటువంటి చర్యలు విద్యార్థులకు, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడంలో దోహదపడతాయి. ఆధ్యాత్మిక కేంద్రాల పవిత్రతను, విద్యాలయాల గౌరవాన్ని కాపాడే ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించి అమలు చేస్తే సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటు అందుతుంది. సమాజంలో సానుకూల ఆలోచనలు, మంచి విలువలు, ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని ప్రోత్సహించేందుకు కూడా ఇది దోహదపడుతుంది.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### పాఠశాలలో తనిఖీలు చేపట్టాలి

ప్రభుత్వ పాఠశాలలో బడి పిల్లలకు నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, సరైన పౌష్టికాహారం అందినప్పుడే వారు నిరంతరం అభివృద్ధి చెందగలరు. కావున అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రత్యేక తనిఖీలు చేపట్టి పిల్లలకు సరైన నాణ్యమైన విద్య, అందేలా చర్యలు తీసుకోవాలి. దీనిపై అధికారులు దృష్టి పెట్టాలి.

-మోతె శివకుమార్, నల్గొండ జిల్లా

### భక్తుల మనోభావాలతో చెలగాటం!

అయోధ్య రామమందిరంలో భక్తులు సమర్పించిన కోట్లాది రూపాయల విలువైన కానుకలు మాయమైన వార్తలు ఆందోళనకరంగా ఉన్నాయి. ఈ మందిరంలో ఉండాల్సిన అయిదు నుంచి ఏడున్నర కోట్ల మేర భక్తులు సమర్పించిన డబ్బు మాయమైనట్లు వివిధ పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. భారీ దోపిడీకారణంగా పూజ్యమైన 'అయోధ్య' ఇప్పుడు 'అయోజ్యు' నగరంగా మారింది. ఉత్తరప్రదేశ్‌లో మత అల్లర్లు, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం వంటి ఘటనల్లో నిందితుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారు. చాలా మంది దీనిని 'త్వరిత న్యాయం' అని ప్రశంసించినారు. ఇదే న్యాయం రామమందిర విరాళాల కానుకలు మాయమైన కేసులో నిందితులకు వర్తించదా?. కోట్లాదిమంది భక్తుల మత విశ్వాసాలను దెబ్బ తీసిన ఈ కేసును దేశద్రోహ నేరంగా పరిగణించి, 'త్వరిత న్యాయం' అందించాలి. అలాచేయకపోతే, స్వయంగా శ్రీరాముడినే న్యాయ నిర్ణేతగా ఉండనివ్వండి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### డబుల్ బెడ్‌రూమ్స్ ఇవ్వాలి

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డబుల్ బెడ్ రూమ్లను వెంటనే ఇవ్వవలెను. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లు ఇప్పుడు ఉన్న ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించాల్సినవి కేటాయిస్తే తమకేమీ నష్టంవాటిల్లుతుందో అర్థం కావటం లేదు. ప్రజలను ఒక రకమైన ఆందోళనకు గురి చేస్తున్నారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూంలో నిర్మించి ఇంత వరకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. గ్యారెంటీ వారంటీ అనుకుంటూ ఓట్లు దండుకోవటం తప్ప ప్రజలకు మేలు చేకూర్చే, బాగోగులు చూసే పథకాలను ప్రణాళిక తీసువచ్చి ప్రజలకు లబ్ధిదారులకు న్యాయం చేయాలి.

- ఎస్. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### గ్రామాలలో జంతుబలిని నిషేధించాలి

గ్రామాలలో ఇండ్ల వీధులలో జంతు బలిని నిషేధించాలి. వర్షాకాలంలో జంతువులను వధించడం వలన జంతువు కళేబరాలు, వ్యర్థపదార్థాలను, రక్తం, మాంసం, ఎముకలు, కసరు, వంటి పదార్థాలు మురుగు వాసనతో అంటూ రోగాలు వస్తున్నాయి. జంతువులు బలిచేసే వారు ఆర్థికంగా లాభం పడుతున్నారు. కానీ చుట్టూ ప్రక్కల ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారు. కనుక తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య, హెల్త్ డిపార్ట్మెంట్, స్థానిక గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో జంతు బలిని నిషేధం చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# 'నాణ్యమైన విద్య' అందరికీ అందాలి

**ప్రభుత్వ పాఠశాలలను కేవలం పేదల పాఠశాలలుగా కాకుండా ప్రతి వర్గం పిల్లలు చదవాలనుకునే స్థాయికి తీసుకురావాలి. ఆధునికభవనాలు, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, నాణ్యమైన ఉపాధ్యాయులు, ఇంగ్లీష్‌తో పాటుమాతృభాషలో బోధన, క్రీడలు, కళలు, సాంకేతిక విద్య అన్నీ అందుబాటులో ఉండాలి. కామన్ స్కూలింగ్ విధానం, సమాన విద్యా అవకాశాలు, పారదర్శక పెట్టుబడులు, ప్రభుత్వ బాధ్యతాయుత మైన అమలు ద్వారా మాత్రమే ఈ అసమానతలను తగ్గించగలం. విద్య అనేది ధనికులకు మాత్రమే లభించే ప్రత్యేక హక్కు కాదు. ప్రతి చిన్నారి హక్కు. పుట్టుక కాదు, ప్రతిభ భవిష్యత్తును నిర్ణయించే దేశాన్ని నిర్మించాలంటే విద్యలో సమానత్వం అత్యవసరం. నాణ్యమైన విద్య కొందరికే కాదు, అందరికీ అందాలి. 'క్వాలిటీ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ - నాట్ ఫర్ ది ప్రివిలేజ్డ్' అనే సూత్రం నినాదంగా కాకుండా ప్రభుత్వ విధానంగా మారిన రోజే భారతదేశం నిజమైన అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది.**

వనకల్ల వీరప్ప

ఒకే వయసు, ఒకే తెలివితేటలు, ఒకే తరహా కలలు, అయినా ఇద్దరు పిల్లల జీవితాలు పూర్తిగా భిన్నంగా మారుతున్నాయి. కారణం వారి ప్రతిభ కాదు, వారు చదివే పాఠశాల. నేటి భారతదేశంలో పిల్లల భవిష్యత్తును వారి కృషి కంటే ముందే వారి కుటుంబ ఆర్థిక స్థితి, వారు చేరే స్కూల్ నిర్ణయిస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఇది కేవలం విద్యా రంగంలోని సమస్య మాత్రమే కాదు, సమాజంలో కొత్త తరహా అసమానతలకు బలమైన పునాది. ఒకప్పుడు పదో తరగతి లేదా ఇంటర్ తర్వాత పోటీ మొదలయ్యేది. ఇప్పుడు ఎల్‌కేజీ అడ్మిషన్‌తోనే పోటీ ప్రారంభమవుతోంది. ఇంటర్నేషనల్ స్కూల్స్, ఐబీ, కేంబ్రిడ్జ్, డిజిటల్ క్లాస్ రూమ్స్, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, విదేశీ భాషలు వంటి అవకాశాలు సంపన్న కుటుంబాల పిల్లలకు అందుబాటులో ఉంటున్నాయి. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు ఇప్పటికీ ప్రాథమిక మౌలిక వసతుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది. అత్యంత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే మధ్యతరగతి కుటుంబాలు కూడా ఈ పోటీలో వెనుకబడకూడదనే ఆందోళనతో భారీ ఫీజులు చెల్లిస్తూ అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నాయి. విద్య అనేది ఒకప్పుడు కుటుంబ భవిష్యత్తుపై పెట్టుబడిగా భావించేవారు. ఇప్పుడు అది రుణాల భారంగా మారుతోంది. చిన్నారి అడ్మిషన్ నుంచి ఇంటర్మీడియట్ వరకు లక్షల రూపాయల ఖర్చు సాధారణమైపోయింది. విద్య కోసం బ్యాంకు రుణాలు, వ్యక్తిగత అప్పులు తీసుకోవడం అనేక కుటుంబాలకు తప్పనిసరి అవుతోంది. ఈ పరిస్థితి ఒక్క రోజులో ఏర్పడలేదు. 1990ల తర్వాత జనాభా పెరిగింది. విద్యపై ప్రజల్లో అవగాహన పెరిగింది. అయితే ప్రభుత్వ పాఠశాలలు అదే స్థాయిలో అభివృద్ధి చెందలేదు. అవసరమైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన, ఇంగ్లీష్ మీడియం, ఆధునిక సాంకేతికత వంటి అంశాల్లో ఆలస్యం జరిగింది. ఈ ఖాళీని ప్రైవేటు విద్యా సంస్థలు భర్తీచేశాయి. కానీ విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చడంతో అసమానతలు మరింత పెరిగాయి. ఈ మార్పుకు సంబంధించిన గణాంకాలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ముఖ్యంగా ప్రాథమిక తరగతుల్లో ఈ తగ్గుదల మరింత స్పష్టంగా కనిపిస్తోంది. విద్యావంతులైన తల్లిదండ్రులు, మంచి ఆర్థికస్థితి కలిగిన కుటుంబాలు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానంగా పేద కుటుంబాలు, తొలితరం విద్యార్థులు, సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలే చేరుతున్నారు. ఇక్కడే అసలు అసమానత మొదలవుతుంది. ప్రైవేటు పాఠశాలల్లో చదివే పిల్లలకు ఇంట్లో చదువు చెప్పే తల్లిదండ్రులు, ట్యూషన్లు, డిజిటల్ వనరులు, ప్రశాంత వాతావరణం లభిస్తాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో చాలా మంది పేదరికం, పోషకాహార లోపం, కుటుంబ సమస్య



లు, మొదటి తరం విద్యార్థులుగా ఉండటం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటారు. ఈ రెండు వర్గాల ఫలితాలను ఒకే కొలమానంతో పోల్చడం అన్యాయం. 'నీళ్లు ఉన్న చోట ఎవరైనా పంట పండించగలరు. ఎడారిలో పంట పండించడం నిజమైన సవాలు' అనే సామెత ఇక్కడ పూర్తిగా వర్తిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను మాత్రమే విమర్శించడం సరైన పరిష్కారం కాదు. వ్యవస్థ మొత్తం ఎదుర్కొంటున్న నిర్మాణాత్మక సమస్యలను గుర్తించాలి. మౌలిక వసతులు, తగిన ఉపాధ్యాయ నియామకాలు, నిరంతర శిక్షణ, డిజిటల్ సదుపాయాలు, బాధ్యతాయుతమైన పరిపాలన వంటి అంశాల్లో పెట్టుబడులు పెరగాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం విద్యా సమస్య మాత్రమే కాదు, సామాజిక న్యాయం, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశం కూడా. ఒకప్పుడు రైతు కొడుకు డాక్టర్ అయ్యేవాడు. కూలీ బిడ్డ ఐఏఎస్ అధికారి అయ్యేవాడు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థి ప్రతిభతో జీవితాన్ని మార్చుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు పుట్టిన కుటుంబం, చదివే స్కూల్, తల్లిదండ్రుల ఆర్థిక స్థితి భవిష్యత్తును ముందుగానే నిర్ణయిస్తున్నాయి. ప్రతిభ కంటే అవకాశాలు ఎక్కువ ప్రాధాన్యం పొందుతున్నాయి. ఈ ధోరణి కొనసాగితే సామాజికచలనం తగ్గిపోతుంది. పేద కుటుంబానికి చెందిన పిల్లలు అదే వర్గంలో ఉండిపోతారు. ధనిక కుటుంబాల పిల్లలు మరింత ముందుకు వెళ్తారు. ఇలా సమాజం రెండు వర్గాలుగా విడిపోయే ప్రమాదం ఉంది. ఇది ప్రజాస్వామ్యానికికూడా మంచిది కాదు. సమాన అవకాశాలు లేని సమాజంలో అసంతృప్తి పెరుగుతుంది. సామాజిక ఐక్యత బలహీనపడుతుంది. అంతర్జాతీయంగా చూస్తే విద్యలో సమాన అవకాశాలకు ప్రాధాన్యం ఇచ్చినదేశాలు వేగంగా అభివృద్ధిచెందాయి. ముఖ్యంగా చైనా విద్యారంగంలో భారీప్రభుత్వ పెట్టుబడులు పెట్టి గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న అంతరాలను గణనీయంగా తగ్గించింది. నాణ్యమైన ప్రభుత్వ విద్య ద్వారా అన్ని వర్గాల విద్యార్థులను ఆర్థికవ్యవస్థలో భాగస్వాములను చేసింది. ఫలితంగా మానవ వనరులు పెరిగాయి. ఉత్పాదకత పెరిగింది. ఆర్థిక వృద్ధికి బలమైనపునాది ఏర్పడింది. భారతదేశం కూడా ప్రపంచంలో అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశం. కానీ ఈ యువశక్తిని నాణ్యమైన విద్యతో తీర్చిదిద్దలేకపోతే అది డెమోగ్రాఫిక్ డివిడెండ్ గా కాకుండా డెమోగ్రాఫిక్ భారంగా మారే ప్రమాదం ఉంది. ప్రతిభ ఉన్న లక్షలాది మంది విద్యార్థులు అవకాశాల కొరత వల్ల వెనుకబడితే దేశ ఆర్థికాభివృద్ధి కూడా మందగిస్తుంది. అందుకే ఇప్పుడు అవసరమైనది తాత్కాలిక సంస్కరణలు కాదు. నిర్మాణాత్మక మార్పులు. ప్రభుత్వ పాఠశాలలను కేవలం పేదల పాఠశాలలుగా కాకుండా ప్రతి వర్గం పిల్లలు చదవాలనుకునే స్థాయికి తీసుకురావాలి. ఆధునికభవనాలు, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, నాణ్యమైన ఉపాధ్యాయులు, ఇంగ్లీష్‌తో పాటుమాతృభాషలో బోధన, క్రీడలు, కళలు, సాంకేతిక విద్య అన్నీ అందుబాటులో ఉండాలి. కామన్ స్కూలింగ్ విధానం, సమాన విద్యా అవకాశాలు, పారదర్శక పెట్టుబడులు, ప్రభుత్వ బాధ్యతాయుతమైన అమలు ద్వారా మాత్రమే ఈ అసమానతలను తగ్గించగలం. విద్య అనేది ధనికులకు మాత్రమే లభించే ప్రత్యేక హక్కు కాదు. ప్రతి చిన్నారి హక్కు. పుట్టుక కాదు, ప్రతిభ భవిష్యత్తును నిర్ణయించే దేశాన్ని నిర్మించాలంటే విద్యలో సమానత్వం అత్యవసరం. నాణ్యమైన విద్య కొందరికే కాదు, అందరికీ అందాలి. 'క్వాలిటీ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ - నాట్ ఫర్ ది ప్రివిలేజ్డ్' అనే సూత్రం నినాదంగా కాకుండా ప్రభుత్వ విధానంగా మారిన రోజే భారతదేశం నిజమైన అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది. ●

# నకిలీ నోట్లకు పూర్తిస్థాయిలో కళ్లెం వేసేదెప్పుడు!

బుగ్గన మధుసూదనరెడ్డి

కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా వుంది కేంద్ర ప్రభుత్వ వ్యవహారం! కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దు చేసి దాదాపు ఆరేళ్ల అవుతున్నా ఇంకను నకిలీ నోట్లకు పూర్తి స్థాయిలో కళ్లెం వేయాలనుకున్న వారిలక్ష్యం నెరవేరిన దాఖలాల్లేవు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ముఖ్యంగా సమాంతర ఆర్థిక వ్యవస్థను అరికట్టి, నగదు రహిత లావాదేవీలను పెంచడానికి దేశంలో నకిలీ నోట్లను కనిపించకుండా చేయడానికి నోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నామని అప్పట్లో గొప్పగా, అట్టహాసంగా కేంద్రప్రభుత్వం ప్రకటించినప్పటికి ఎందుకనో ఆచరణలో వారు తీసుకున్న నిర్ణయాలు సమర్థవంతంగా అమలు చేయలేకపోయారు అనే చేదువాస్తవం మన కళ్ళముందు కనపడుతూనేవుంది. ఒక వైపు సాక్షాత్తు రిజర్వుబ్యాంకు వారే గత ఏడాది 102 శాతం మేర నకిలీ నోట్లు పెరిగాయి అని ప్రకటించడంతో నకిలీ నోట్లను అరికట్టడంలో కేంద్రం అనుసరించినఎత్తుగడ అంతగా సఫలీకృతం కాలేదు అనే పచ్చి నిజం మనందరికీ బోధపడుతూనే వుంది. దీన్ని బట్టి చూస్తే ఎన్ని చట్టాలు తెచ్చిన కట్టలు కట్టలుగా, గుట్టలు, గుట్టలుగా నకిలీ నోట్లు పుట్టుకొస్తూ మన ఆర్థిక వ్యవస్థకు సవాలు విసురుతుండటం ఎంతైనా ఆందోళనకరమైన విషయం. పైగా మనమంతా ఏమాత్రం జీర్ణించుకోలేని అంశం కూడా. ఇకపోతే పాత వెయ్యి, ఐదువందల నోట్లను రద్దు చేసి వాటికి బదులుగా కొత్త రెండువేలు, ఐదు వందల రూపాయల నోట్లను ప్రవేశపెట్టి ఇక ఈనోట్లకు నకిలీలు సృష్టించడం దాదాపు అసాధ్యం అని ప్రకటించిన కేంద్రప్రభుత్వానికి ఇప్పుడు దేశవ్యాప్తంగా విచ్చలవిడిగా చలామణి అవుతున్న నకిలీ నోట్ల బెడదను అరికట్టడం ఒక శక్తికి మించినపనిగా, తల బొప్పి కడుతున్న వైనంగా పరిణమించడం ఎంతైనా ఆలోచించాల్సిన పరిణామం. దీన్నిబట్టి చూస్తే కేంద్రప్రభుత్వం నకిలీ నోట్లకు చెక్ పెట్టడానికి అనుసరించిన వ్యూహాలు, ప్రతి వ్యూహాలు బెడిసికొట్టి కొండను తవ్వి ఎలుకను పట్టిన చందగా అవతరించడం కేంద్రప్రభుత్వం పరిపాలన లోపాలను ఎత్తి చూపుతున్నది. ఒక విధంగా చెప్పాలంటే ఈ నకిలీ నోట్ల కరెన్సీ సమస్య అంతా తేలికగా వదిలించుకునే వ్యవహారం కాదు అని మనకు ఇదివరకే తెలిసిన సత్యం. ఎందుకంటే నకిలీ కరెన్సీ తయారీలో కొద్దిమంది స్థానికుల పాత్ర ఉండటంతో పాటు చాలా వరకు విదేశీ గూడచార సంస్థలు, మాఫియా ముఠాలు, ఉగ్రవాద మూకల పాత్ర సైతం ఇందులో ఉండటంతో పాటు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న అగ్రరాజ్యాలకు సైతం ఈనకిలీ కరెన్సీ బెడద తప్పడం లేదు. అంటే నకిలీ కరెన్సీ వ్యవహారం ప్రపంచ దేశాలను ఎంతగా బేంబేలు ఎత్తిస్తుందో మనమంతా ఇట్టే ఊహించవచ్చు. ఏది ఏమైనా నకిలీ కరెన్సీ ప్రపంచవ్యాప్త సమస్యగా పరిణమించిన నేపథ్యంలో నకిలీ కరెన్సీ బెడదను అరికట్టడానికి, దాని పీడ విరగడ అవ్వడానికి ప్రతి దేశం తమ వంతు ప్రయత్నంగా తాము అధికారికంగా ముద్రించే కరెన్సీలో ఎప్పటికప్పుడు సెక్యూరిటీ ఫీచర్స్ ఏర్పాటు చేసుకుంటున్నప్పటికీ నకిలీ నిపుణులు వాటికి దీటుగా నకిలీకరెన్సీని చాప కింద నీరులా విస్తరింపచేస్తుండటం, చలామణిలోకి తెస్తూనే ఉండటం అత్యంత బాధాకరమైన, శోచనీయమైన విషయం. ఏమైనా ప్రపంచ వ్యాప్తంగా కరెన్సీ బెడద ఎక్కువగా వున్న అన్ని దేశాలు ముకుమ్మడిగా తమ ఆలోచనలకు, వివేకానికి పదును పెట్టి ఈ నకిలీ కరెన్సీ ఆటకట్టించడానికి యుద్ధ ప్రాతిపదికన ఒక మాస్టర్ ప్లాన్‌ను అనుసరించి ఈనకిలీ కరెన్సీని చలామణిలోకి తెస్తున్న అక్రమార్కుల ఆగడాలకు చరమగీతం పాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ఈ సందర్భంగా 'చట్టాలు అంటే వారి చుట్టం కాదు, వారి పాలిట యమపాశం అని చట్టాలతో ఆటలాడుకోవాలని చూస్తే వారు ఏదో ఒక రోజు చట్టం చేతికి చిక్కి జైలు ఊచలు లెక్కబెట్టాల్సిందే, యావజీవ కారాగారశిక్ష అనుభవించాల్సిందే' అనే నగ్న సత్యాన్ని, ఎవరు కాదనలేని వాస్తవాన్ని నకిలీ కరెన్సీ చలామణిదారులు వీలయినంత త్వరగా ఆకలింపు చేసుకొని, గుర్తుపెట్టుకొని, ఒళ్లు దగ్గర పెట్టుకొని ఇలాంటి దుస్సాహసాలకు పునుకోకుండా ఉండటం వారి ఇంటికి, వంటికి మంచిది. లేకపోతే చట్టం చేతిలో వారు ఏదో ఒక చెడ్డరోజు అత్యంత చావు దెబ్బ తినడం తథ్యం! ఒక విధంగా 'దొరికితే దొంగ, దొరక్కపోతే దొర' అనే సామెత ఈ నకిలీ కరెన్సీ చలామణిదారులకు నూటికి నూరు పాళ్లు వర్తిస్తుంది! ●

# దేశభక్తితో జాతీయవాదాన్ని పోల్చడమా?

డా. ఎ. భాగ్యరాజ్

దేశాన్ని ప్రేమించడం అనే భావన ప్రతి పౌరుడిలో ఉండాల్సిన గొప్ప విలువ, అయితే దేశభక్తి (పేట్రియాటిజం) జాతీయవాదం (నేషనలిజం) ఒకటే కావు. ఈ రెండింటిని ఉద్దేశపూర్వకంగా కలిపివేయడం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ప్రజాస్వామ్య సంక్షోభాలను ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా భారతదేశంలో కూడా గత కొన్నేళ్లుగా 'ప్రభుత్వాన్ని విమర్శిస్తే దేశద్రోహి', ప్రశ్నిస్తే 'దేశ వ్యతిరేకి' అనే రాజకీయ సంస్కృతి పెరిగిందనే విమర్శలు పెరిగాయి. ఇక్కడ దేశభక్తి ఎక్కడ ప్రారంభమౌతుంది, ఎక్కడ ముగుస్తుంది? జాతీయవాదం ఎక్కడ ప్రారంభమవుతుంది, ఎక్కడ ముగుస్తుంది? అనే ప్రశ్నలు చాలా ముఖ్యమైనవి. దేశభక్తి అంటే దేశాన్ని ప్రేమించడం, ప్రజల సంక్షేమాన్ని కోరుకోవడం, రాజ్యాంగ విలువలను గౌరవించడం. దేశభక్తి కలిగిన వ్యక్తి ఎల్లప్పుడూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాడు, తప్పులను విమర్శిస్తాడు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతాడు, సక్రమంగా పన్నులు చెల్లిస్తాడు, పర్యావరణాన్ని పరిరక్షిస్తాడు, పౌర హక్కులను గౌరవిస్తాడు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జవహర్లాల్ నెహ్రూ వంటివారు దేశాన్ని ప్రేమించారు. కానీ ప్రభుత్వాలను, విధానాలను ప్రశ్నించారు, విమర్శలను స్వీకరించారు. జాతీయవాదం అనేది దేశం లేదా జాతి అత్యున్నతమని భావించేది రాజకీయ సిద్ధాంతం. ప్రభుత్వమే దేశమని, పార్టీనే దేశమని, నాయకుడే దేశమని చెప్పి విమర్శను దేశద్రోహంగా చిత్రీకరిస్తారు. జార్జ్ ఆర్వెల్ మాటల్లో దేశభక్తి ప్రేమ ఆధారంగా ఉంటుంది, జాతీయవాదం అధికారం ఆధారంగా ఉంటుంది. పాశ్చాత్య దేశాల అనుభవాలు మనకు సుపరిచితమే. ఉదాహరణకు హిట్లర్ జర్మనీని ప్రపంచంలో అత్యున్నత జాతిగా ప్రకటించాడు. ఫలితంగా ప్రజాస్వామ్యం పతనం, మీడియా నియంత్రణకు లోనైంది. మైనారిటీలపై దాడులు పెరిగాయి, రెండవ ప్రపంచ యుద్ధంలో లక్షలాది ప్రాణనష్టమును మిగిల్చింది. అత్యుత్సాహ జాతీయవాదం ఎంత ప్రమాదకరమో తెలియజేసింది. అలాగే ఇటలీలో ముస్సోలిని దేశభక్తిని జాతీయవాదంగా మార్చి ఫాసిస్టు పాలన నిర్మించాడు. ప్రజాస్వామ్యం బలహీనపడింది. ఇక ప్రస్తుతం అమెరికాలో ట్రంప్ 'అమెరికా ఫస్ట్' నినాదం కొంతమందికి దేశభక్తిగా కనిపించినా, విమర్శకుల దృష్టిలో అది అధిక జాతీయవాద రాజకీయాలకు దారి తీసింది. ఇక మన దేశంలో స్వాతంత్ర్య పోరాటంలో జాతీయవాదం బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ఒక విముక్తి ఉద్యమం జరిగింది. కానీ నేడు జాతీయవాదం రూపం మారింది. ఇక్కడ ప్రస్తుతం నిరుద్యోగంపై ప్రశ్నిస్తే దేశద్రోహులౌతాము, పేపర్లు లీకయితే, పర్యావరణ నాశనంపై మాట్లాడితే దేశ వ్యతిరేకులౌతాము, ఎన్నికల వ్యవస్థపై సందేహాలు వ్యక్తం చేస్తే దేశానికి శత్రువులమవుతాము. ప్రజాస్వామ్యంలో ఇవన్నీ సహజమైన ప్రశ్నలు. ప్రస్తుత జాతీయవాద రాజకీయాలు విమర్శకుల అభిప్రాయం ప్రకారం రాజకీయాల్లో జాతీయవాదం ప్రధాన ఎన్నికల వ్యూహంగా మారింది. ఉదాహరణకు సైన్య విజయాల రాజకీయాకరణ ఆరోపణలు, మతపరమైన గుర్తింపుతో దేశభక్తిని అనుసంధానం



చేయడం, విభేదించే స్వరాలను 'అర్బన్ నక్సల్', 'దేశద్రోహి'గా ముద్రించడం అనే విమర్శలు పెరిగాయి. మీడియాద్వారా భావోద్వేగ జాతీయవాద ప్రచారాన్ని ఉధృతం చేయడం పెరిగింది. అందువల్ల ఈ అంశాన్ని వివిధ కోణాల నుండి పరిశీలించడం అవసరం. డాక్టర్ అంబేద్కర్ అభిప్రాయం ప్రకారం దేశానికంటే రాజ్యాంగ విలువలు (సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, న్యాయం) ముఖ్యమైనవని, దేశాన్ని ప్రేమించడం అంటే ఈవిలువలను కాపాడటమని, జెండాకు సెల్యూట్ చేయడం మాత్రమే దేశభక్తి కాదని, ఆకలితో ఉన్న పౌరుడికి ఆహారం అందించడం, విద్యను అందించడం, అడవులను రక్షించడం, అవినీతిని ప్రశ్నించడం కూడా దేశ భక్తే అవుతుందని చెప్పారు. దేశభక్తి అంటే జరిగే అన్యాయాలను, తప్పులను చూసిగుండెల్లో మంటలు రేగాలి, ప్రశ్నించాలి, పోరాడాలి. కానీ దేశం నిజంగా ఎంత అభివృద్ధి చెందిందో, ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారో, ఎంత స్వేచ్ఛగా జీవిస్తున్నారో కొలవడానికి ప్రపంచవ్యాప్తంగా అనేక సూచీలు ఉన్నాయి. ఉదాహరణకువివిధ రకాల సూచీలను చుస్తే ఆకలి సూచీలో (గ్లోబల్ హంగర్ ఇండెక్స్) నివేదికలో 123 దేశాలకుగాను భారత్ 102వ స్థానంలో (పిల్లల పోషకాహార లోపం, రక్తహీనత, శిశుమరణాలు వంటి సమస్యలు కొనసాగుతున్నాయి). 'రిపోర్టర్స్ విత్ఔట్ బోర్డర్స్' విడుదల చేసిన 2026 సంవత్సరానికిగాను ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచికలో 180 దేశాలలో భారత్ 157వ స్థానంలోను, 2026గాను ప్రపంచ సంతోష సూచికలో 147దేశాలలో భారత్ 116వ స్థానంలోను, అవినీతి అవగాహన సూచికలో 182 దేశాలలో భారత్ 91వ స్థానంలోను, వాతావరణ మార్పుల పనితీరు సూచిక 2026లో పరిశీలించిన 67 దేశాలలో భారత్ మొత్తంమీద 23వ స్థానంలోనునిలిచింది, ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం వారి మానవ అభివృద్ధి సూచికలో 193దేశాలలో భారత్ 130వస్థానంలోను, తాజాగా'మహిళలు, శాంతి, భద్రత సూచిక'లో ప్రపంచవ్యాప్తంగా 181 దేశాలలో భారత్ 131వ స్థానంలో, రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వశాఖ ఇటీవలి గణాంకాల ప్రకారం గత మూడేళ్ల కాలంలో జాతీయ రహదారులపై మొత్తం 21వంతెనలు (15 పూర్త యినవి 6 నిర్మాణంలో ఉన్నవి) కూలిపోయాయి. విస్తృత కోణంలో చూస్తే గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా వందలాది వంతెనలు రహదారి మౌలిక సదుపాయాలు కూలిపోయి నట్లు సోషల్ మీడియా విశ్లేషణలు, నిర్మాణ సంబంధిత సమాచారం అంచనా వేస్తున్నాయి. వీడెమ్ ఇన్స్టిట్యూట్ లిబరల్ డెమోక్రసీ ఇండెక్స్ ప్రకారం సూచీ ప్రకారం భారతదేశం 'ఎలక్టోరల్ ఆటోక్రసీ' (ఎన్నికల నిరం కుశత్వం) దేశంగా వర్గీకరించబడింది. ఎకనామిస్ట్ ఇంటెలి జెన్స్ యూనిట్ (ఈ.ఐ.యూ) డెమోక్రసీ ఇండెక్స్ప్రకారం భారతదేశాన్ని 'పాక్షిక లోపాలు గల ప్రజాస్వామ్య' దేశంగా వర్గీకరించారు. నిజమైన దేశభక్తి ఈ సూచీలను చూసి దేశాన్ని మెరుగుపరచుకోవాలని కోరుతుంది. అతి జాతీయవాదం మాత్రం ఈసూచీలను పట్టించుకోకుండా 'విశ్వగురువు' అనే ప్రచారానికే పరిమితం అయ్యే ప్రమాదం ఉంది. డోనాల్డ్ ట్రంప్ మన దేశ ప్రతిష్టను, అంతర్గత వ్యవహారాలను, ఎగుమతులపై పన్ను పెంపు, పెట్రోల్ రష్యాదగ్గర కొనగూడదు అని ఇలా చాలారకాలుగా వ్యవహరించినా మనవిశ్వగురువు ఏమి జరగనట్టు వ్యవహరిస్తున్నారు. దేశభక్తి ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తుంది, అతి జాతీయవాదం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచే ప్రమాదం కలిగి ఉంటుంది. ప్రభుత్వాన్ని ప్రేమించడం దేశభక్తి కాదు, దేశాన్ని ప్రేమించడం దేశభక్తి. నాయకుడిని ప్రశ్నించడం దేశద్రోహంకాదు, ప్రజాస్వామ్య బాధ్యత. దేశభక్తి 'నా దేశం గొప్పది' అని చెప్పడం మాత్రమే కాదు. 'నా దేశం మరింత న్యాయంగా, సమానంగా, ప్రజాస్వామ్యంగా మారాలి' అని కోరుకోవడమే నిజమైన దేశభక్తి. ●

# శత్రుత్వాన్ని సాగనంపండి



### భారత్, పాక్ మధ్య శాంతికి బాటలు వేయండి
### ఇరుదేశాల ప్రధానమంత్రులకు 117 మంది ప్రముఖుల లేఖ

**న్యూఢిల్లీ/ ఇస్లామాబాద్, జులై 1:** భారత్ - పాకిస్థాన్‌ల మధ్య పహల్గాం ఉగ్రదాడితో మొదలైన అగ్ని జ్వాలలు ఇంకా రగులుతూనే ఉన్నాయి. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టడంతోపాటు సింధు జలాల ఒప్పందాన్ని సైతం భారత్ నిలిపివేసింది. ఆపరేషన్ సిందూర్ జరిగి సంవత్సరం పూర్తయింది. అగ్ని జ్వాలలు ఇంకా రగులుతూనే ఉన్నాయి. అయితే ఇప్పటికైనా ఇరు దేశాల మధ్య శాంతి నెలకొల్పే ప్రయత్నం చేయాలని ప్రముఖులు కోరుకుంటున్నారు.

ఈ మేరకు భారత్ - పాకిస్థాన్‌కు చెందిన 117 మంది ప్రముఖులు ప్రధాని మోడీ, షెహబాజ్ షరీఫ్‌లకు బహిరంగ లేఖ రాశారు. ఇరు దేశాల మధ్య పూర్తి స్థాయిలో దౌత్య సంబంధాలు పునరుద్ధరించాలని కోరారు. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలతో కోట్లాది మంది యువత అవకాశాలు, అభివృద్ధి, భవిష్యత్ దెబ్బతింటోందని వారు లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికైనా శత్రుత్వానికి ముగింపు పలికి ఇరు దేశాల మధ్య శాంతి నెలకొల్పే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ లేఖను సెంటర్ ఫర్ పీస్ అండ్ ప్రోగ్రెస్ విడుదల చేసింది. దీనిపై భారత్‌కు చెందిన 61 మంది, పాకిస్థాన్‌కు చెందిన 56 మంది ప్రముఖులు సంతకాలుచేశారు. ఏ రాజకీయ పార్టీకి తాము మద్దతు తెలపడం లేదని, దాదాపు 200 కోట్లమంది ప్రజల సంక్షేమం, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కోరుతున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. భారత్ తరఫున సంతకాలు చేసిన ప్రముఖుల్లో నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ, కశ్మీర్ మత, రాజకీయ నాయకుడు మిర్వైజ్ ఉమర్ ఫరూఖ్, ఆర్జేడీ రాజ్యసభ సభ్యుడు మనోజ్ ఝా, ఎజెయుపి నాయకుడు, టిఎంసి మాజీ మంత్రి హుమాయున్ కబీర్ ఉన్నారు. పాకిస్థాన్ తరఫున పాక్ మాజీ విదేశాంగ మంత్రి ఖుర్షీద్ మహ్మూద్ కసూరీ, మాజీ దౌత్యవేత్త అష్రఫ్ జహంగీర్ ఖాజీ, పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ సభ్యుడు ఇస్ఫన్యార్ భండారా, అణు భౌతిక శాస్త్రవేత్త, రచయిత పర్వేజ్ హుద్‌భాయ్ తదితరులు ఉన్నారు. అంతేగాక ఆ లేఖలో పలు సూచనలు కూడా చేశారు. ఇరు దేశాల మధ్య పూర్తి స్థాయి దౌత్య సంబంధాలు పునరుద్ధరించాలి. న్యూఢిల్లీ, ఇస్లామాబాద్‌లో హైకమిషనర్లను తిరిగి నియమించాలి. సాధారణ వీసా సేవలు పునఃప్రారంభించాలి. వాణిజ్య విమానాల కోసం గగనతలాన్ని తిరిగి తెరవాలి. అట్టారి-వాఘా సరిహద్దును వాణిజ్యం, ప్రయాణాల కోసం మళ్లీ ప్రారంభించాలి. శ్రీనగర్- ముజఫరాబాద్ బస్సు సర్వీసును తిరిగి ప్రారంభించాలని ఇరు దేశాల ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.



## సప్తపదిలేకుండా హిందూ వివాహమే కాదు
### గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

**అహ్మదాబాద్,జూలై 1:** హిందూ వివాహ వ్యవస్థ విశిష్టతను చాటిచెబుతూ గుజరాత్ హైకోర్టు ఒక చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. హిందూ సంప్రదాయాల ప్రకారం సప్తపది (ఏడడుగులు) వంటి శాస్త్రోక్తమైన క్రతువులు నిర్వహించకుండా, కేవలం మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందినంత మాత్రాన ఆ పెళ్లి చట్టబద్ధంగా చెల్లుబాటు కాదని హైకోర్టు స్పష్టం చేసింది. హిందూ వివాహం అనేది కేవలం పాటలు, డ్యాన్స్‌లు, విందు వినోదాల కోసం జరుపుకునే వేడుక కాదని, వధూవరులు పవిత్రమైన అగ్ని సాక్షిగా ఏడు అడుగులు వేయడమే వివాహానికి ఆధ్యాత్మిక, సామాజిక, చట్టపరమైన హోదాను కల్పిస్తుందని జస్టిస్ ఇలేష్ వోరా, జస్టిస్ ఆర్.టి. వాచ్ఛానిలబెంచ్ తేల్చిచెప్పింది. యూకేలో నివసిస్తున్న కౌశల్ సోనార్ అనే వ్యక్తి అప్పీల్‌పై విచారణ జరుపుతూ కోర్టు ఈ తీర్పునిచ్చింది. అహ్మదాబాద్‌కు చెందిన ఒక మహిళ తన సంతకాలను మోసపూరితంగా సేకరించి మ్యారేజ్ సర్టిఫికేట్ పొందిందని, తమ మధ్య ఎలాంటి సంప్రదాయ వివాహ క్రతువులు జరగలేదని కౌశల్ కోర్టును ఆశ్రయించాడు. గతంలో ఫ్యామిలీ కోర్టు ఈ పిటిషన్‌ను తిరస్కరించగా, ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణలో సదరు మహిళ కూడా తమ మధ్య ఎలాంటి పెళ్లి ఆచారాలు జరగలేదని అంగీకరించింది. దీంతో, హిందూ వివాహ చట్టం ప్రకారం సప్తపది లేని వివాహం అసలు పెళ్లే కాదని స్పష్టం చేస్తూ, గతంలో ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ ఆ పెళ్లి చెల్లదంటూ హైకోర్టు తీర్పునిచ్చింది.



## ట్రైలర్‌ను ఢీకొన్న బస్సు
### 8 మంది సజీవదహనం, 22మందికి తీవ్రగాయాలు
### రాజస్థాన్‌లో విషాదం

**జైపూర్, జులై 1:** రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఢిల్లీ- ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై ఒక ప్రయాణికుల బస్సు ట్రైలర్‌ను ఢీకొట్టి మంటలు చెలరేగడంతో కనీసం ఎనిమిది మంది మృతి చెందగా, 20 మందికి పైగా గాయపడ్డారు. ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్ నుండి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు దాదాపు 37 మంది ప్రయాణికులతో ప్రయాణిస్తున్నబస్సులో తెల్లవారు జామున 3:30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ట్రైలర్‌ను ఢీకొట్టడానికి ముందే బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. ఈ ధాటికి భారీ మంటలు చెలరేగి, కొద్ది నిమిషాలకే వాహనాన్ని చుట్టుముట్టాయి, దీంతో పలువురు ప్రయాణికులు బస్సు లోపల చిక్కుకుపోయారు. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం, ఆ సమయంలో చాలా మంది ప్రయాణికులు నిద్రపోతున్నారు, బస్సు వెనుక భాగంలో మొదట మంటలు చెలరేగడంతో భయాందోళనలు, గందరగోళం నెలకొన్నాయి. ప్రమాద తీవ్రతకు పై బెర్త్‌లలోని ప్రయాణికులు కిందపడిపోవడంతో వారికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. సమాచారం అందిన వెంటనే పోలీసులు, అత్యవసర బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని జిల్లా ఆసుపత్రికి తరలించగా, అక్కడ ఎనిమిదిమంది ప్రయాణికులు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. మరో 20మంది చికిత్స పొందుతుండగా, తీవ్రంగా గాయపడిన ఒక ప్రయాణికుడిని మెరుగైన చికిత్స కోసం జైపూర్‌కు తరలించారు.

## మంత్రివర్గప్రక్షాళనపై సిఎం విజయ్ ఫోకస్
### వివాదాలలో చిక్కిన ఇద్దరు మంత్రులకు ఉద్వాసనే



**చెన్నై,జూలై 1:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వంలో భారీ ప్రక్షాళన జరగబోతోంది. ప్రభుత్వ ప్రతిష్టను కాపాడుకోవడంతో పాటు పాలనా వేగాన్ని పెంచేందుకు వీలుగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు సీఎం విజయ్ ముహూర్తం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. తమిళనాడు నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రితో కలిపి గరిష్టంగా 35 మందికి మాత్రమే మంత్రివర్గంలో చోటు ఉంటుంది. ప్రస్తుతం కేబినెట్‌లో అన్ని స్థానాలూ భర్తీ అయి ఉండటంతో కొత్తవారికి అవకాశం ఇవ్వాలంటే కొందరిపై వేటు వేయడం తప్పనిసరిగా మారింది. ముఖ్యంగా అన్నాడిఎంకె నుంచి టివికెలో చేరిన సీనియర్ నేతలకు సముచిత స్థానం కల్పించడం కోసమే సిఎం విజయ్ ఈ కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఇద్దరు వివాదాస్పద మంత్రులను కేబినెట్ నుంచి తప్పించడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుత సమాచారం ప్రకారం తాంబరం ఎమ్మెల్యేగా గెలిచిన మంత్రి శరత్ కుమార్, సామాజిక సంక్షేమశాఖ మంత్రి జగదీశ్వరిలకు మంత్రిపదవులు ఊడటం దాదాపు ఖాయమైంది. ఐపిఎల్ మ్యాచ్ సందర్భంగా మంత్రి శరత్ కుమార్ వివాదాస్పద రీతిలో కనిపించిన ఒక వీడియో సోషల్ మీడియాలో హల్చల్ చేసింది. ఇది ప్రతిపక్షాలకు పెద్ద ఆయుధంగా మారడంతో పాటు ప్రభుత్వంపై విమర్శలకు దారితీసింది. ప్రముఖ రౌడీషీటర్ రాకెట్ రాజాతో మంత్రి జగదీశ్వరి దిగిన కొన్ని పాత ఫోటోలు ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యాయి. దీనికి తోడు తోటి మంత్రి కీర్తనతో ఆమెకు ఉన్న తీవ్ర విభేదాలు పార్టీకి, ప్రభుత్వానికి తీవ్ర అప్రతిష్ట తెచ్చిపెట్టాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరినీ సాగనంపడమే శ్రేయస్కరమని సిఎం విజయ్ భావిస్తున్నట్లు సమాచారం. తప్పించబోయే ఇద్దరి స్థానాల్లో అన్నాడిఎంకె నుంచి వచ్చిన సి.విజయభాస్కర్ వంటి సీనియర్లను రాబోయే ఉప ఎన్నికల్లోగెలిపించి మంత్రివర్గంలోకి తీసుకునే యోచనలో ముఖ్యమంత్రి ఉన్నారు. మిత్రపక్షాల నుంచి కూడా ఒత్తిడి పెరుగుతోంది. టివికె మిత్రపక్షమైన విసికె నేత వన్నియరసు శాఖను మార్చాలని, తమకు మరింత ప్రాధాన్యత ఉన్న కీలక శాఖను కేటాయించాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఐయూఎంఎల్ మంత్రి షాజహాన్ పోర్ట్‌ఫోలియోపై కూడా ఒక ఖచ్చితమైన నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ మంత్రివర్గ ప్రక్షాళన తక్షణమే జరిగే అవకాశం లేదు. రాష్ట్రంలో మరికొన్ని నెలల్లో వివిధ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఉప ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెల్లడైన తర్వాతే, సమీకరణాలను బట్టి సీఎం విజయ్ తన కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై అధికారిక నిర్ణయాన్ని ప్రకటిస్తారని టీవీకే సీనియర్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

## మరో 2 కొత్త హైవేలు
### రూ.14,115 కోట్లతో నిర్మాణం
### కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, జులై 1:** దేశంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం దిశగా కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన నిర్వహించిన కేంద్ర ఆర్థిక వ్యవహారం మంత్రిత్వ కమిటీ జరిగిన కేబినెట్ భేటీలో రహదారులకు విస్తరణకు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు దేశ వ్యాప్తంగా పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.6,970 కోట్లతో ఢిల్లీలో 6 లేన్‌లతో 'ద్వారకా సొరంగన్ని నిర్మించాలని ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే (ఎన్‌హెచ్248బిబి)ను వసంత్ కుంజ్‌లోని నెల్సన్ మండేలా మార్గ్‌తో అనుసంధానించే 8.1 కిలో మీటర్ల మేర ఆరు లేన్ల రోడ్డు సొరంగ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టును జాతీయ రహదారుల (ఒరిజినల్) ఎన్‌హెచ్(ఓ) పథకంలో భాగంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్‌ఏఎం) కింద అభివృద్ధి చేయనున్నారు.

అలాగే ఉత్తర్‌ప్రదేశ్‌లో కాన్పూర్ నుంచి కబ్రాయ్ వరకు 4 లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ హైవే నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. దీనిని గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మించనున్నారు. ఇందుకూ గానూ రూ.7,145 కోట్లతో కేటాయింపునకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే దేశంలో రవాణా వ్యవస్థ మరింత బోలోపేతం అవుతుందని, ఇది దేశ ప్రగతికి కూడా దోహదపడుతుందని మంత్రి వర్గం పేర్కొంది.

## చోరీ సొమ్మును బాత్‌రూమ్‌లో దాచేవాళ్లం
### అయోధ్య విరాళాల చోరీ కేసులో నిందితుల వెల్లడి

**అయోధ్య,జూలై 1:** అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీ కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అరెస్టైన ఎనిమిది మంది నిందితుల్లో ఒకరైన అవినాశ్ శుక్లాను పోలీసులు విచారించారు. చోరీ చేసిన నగదును ముందుగా మరుగుదొడ్లలో దాచేవాళ్లమని, తర్వాత అవకాశం చూసుకుని బయటకు తరలించేవాళ్లమని చెప్పినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. విరాళాల లెక్కింపు ప్రక్రియలో ఆలయ ట్రస్టీ అనిల్ మిశ్రా కీలక పాత్ర పోషించేవారని కూడా అవినాశ్ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ ఇంకా వెలువడలేదు. దర్యాప్తు ప్రకారం విరాళాల లెక్కింపు గది తాళాల్లో ఒకటి రామశంకర్ అలియాస్ టిన్నూ యాదవ్ వద్ద ఉండేది. మరో తాళం బ్యాంకు సిబ్బంది వద్ద ఉండేదని నిందితుడు తెలిపాడు. పలువురు కలిసి పక్కా ప్రణాళికతో చోరీకి పాల్పడేవారని, ఒకరు నగదు తీస్తుండగా మిగిలినవారు అతడికి అడ్డుగా నిలిచేవారని వెల్లడించాడు. ఆలయ ప్రాంగణంలో ఎక్కడెక్కడ సిసి కెమెరాలు ఉన్నాయో తమకు ముందే తెలుసని, వాటికి కనిపించకుండా కదిలేవాళ్లమని కూడా నిందితుడు చెప్పినట్లు సమాచారం. సిసిటివి పర్యవేక్షణ ఉన్నప్పటికీ తమ కదలికలను ఎవరూ నిశితంగా గమనించలేదని పేర్కొన్నట్లు తెలుస్తోంది. చోరీ చేసిన సొమ్ముతో భూములు, ఇల్లు కొనుగోలు చేసినట్లు కూడా నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు చెబుతున్నారు. దీంతో నిందితుల ఆస్తులు, బ్యాంకు లావాదేవీలపై దర్యాప్తు అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. అంతకుముందే జూన్ 5న అవినాశ్ శుక్లా ఇంటి నుంచి రూ.58 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు బయటపడింది. మిగిలిన మొత్తాన్ని జూన్ 5 నుంచి 8 మధ్య బ్యాంకు ఖాతాల ద్వారా తిరిగి చెల్లించినట్లు సమాచారం. దీంతో ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే నిధుల రికవరీ ప్రక్రియ ప్రారంభమైనట్లు దర్యాప్తులో తేలింది.

**కుంభ్‌మేళానుంచే అయోధ్య విరాళాలచోరీ**

2025 మహా కుంభమేళా సమయంలో భక్తుల రద్దీ, విరాళాలు ప్రవాహాన్ని ఆసరాగా చేసుకుని భారీగా నిధులు పక్కదారి పట్టించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కుంభకోణంలో బావ, బావమరిది అయిన అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా కీలక సూత్రధారులుగా ఉన్నారని, నిధులను దారి మళ్లించడంలో వీరే ప్రధాన పాత్ర పోషించారని పోలీసులు ధృవీకరించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి సుమారు రూ.79.85 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో జరిగే నగదు లెక్కింపు ప్రక్రియలోని లొసుగులని ఆసరాగా చేసుకుని నిందితులు చేతివాటం ప్రదర్శించారు. సిసిటివి కెమెరాల కంటపడకుండా దుప్పట్లలో నగదును దాచి తరలించినట్లు విచారణలో వెల్లడైంది. నిందితులపై నేరపూరిత కుట్ర, నమ్మకద్రోహం వంటి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రధాన నిందితులైన అనుకల్ప్, లవకుశ్ దొంగిలించిన సొమ్ముతో ఫామ్‌హౌస్, రూ.65 లక్షల విలువైన ఇల్లు మరియు పలు ప్లాట్లను కొనుగోలు చేసినట్లు నిర్ధారణ అయింది. స్కార్పియో వంటి విలాసవంతమైన కారును కొనుగోలు చేసేందుకు కూడా సిద్ధమయ్యారు. వారి జీవనశైలిలో అకస్మాత్తుగా వచ్చిన మార్పులే పోలీసుల అనుమానాలకు కారణమయ్యాయి.





## మగవాళ్లను చంపడం ఎలా..?
### మెట్రోరైల్‌లో మహిళ చదివిన పుస్తకంపై హాట్ చర్చలు

**న్యూఢిల్లీ,జూలై 1:** మెట్రో రైళ్లలో ప్రయాణించేటప్పుడు కొందరు ఫోన్లు చూస్తుంటే, మరి కొందరు పుస్తకాలు చదువుతూ కనిపిస్తుంటారు. అలాగే ఓ యువతి మెట్రోలో ఓ పుస్తకం చదువుతోంది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక రేంజ్‌లో హల్‌చల్ చేస్తోంది. ఆమె చేతిలో ఉన్న పుస్తకం పేరు మగాళ్లను చంపడం ఎలాఅని ఉండటమే ఇందుకు కారణం. ఆ టైటిల్ చూడగానే తోటి ప్రయాణికులతోపాటు నెటిజన్లు సైతం ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఎవరో తీసిన ఈ వీడియో కాస్తా ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ కావడంతో, ఇప్పటివరకు దీనికి ఏకంగా 19 మిలియన్లవ్యూస్, 4లక్షలకు పైగా లైకులు వచ్చాయి. ఈ వీడియో చూసిన నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. కొందరు దీన్ని కేవలం ఒక కామెడీగా తీసుకుంటే, మరి కొందరు మాత్రం ఇటీవలి కాలంలో సంచలనంసృష్టించిన సియాకేసుతో ముడిపెడుతూ తీవ్రమైన చర్చకు తెరలేపారు. ఆ మహిళ నిజంగానే ఆపుస్తకం లోపలఉన్న కంటెంట్‌ను చదువుతుందా లేక కేవలం కవర్ పేజీ మాత్రమే అలా ఉందా అనేది వీడియోలో స్పష్టంగా లేదు. కేవలం పుస్తకం టైటిల్‌ను బట్టే ఆమె ఆలోచనలను తప్పుపట్టలేమని, పాఠకుల దృష్టిని ఆకర్షించడానికి ఇలాంటి వివాదాస్పద టైటిళ్లు పెట్టడం సహజమేనని కొందరు అభిప్రాయపడుతున్నారు.

## పదవీవిరమణకు ఒక్కరోజు ముందు టీచర్ నియామక ఉత్తర్వు
### జార్ఖండ్‌లో ప్రభుత్వ జాప్యానికి కొలువును కోల్పోయిన టీచర్

**రాంచి,జూలై 1:** ప్రభుత్వ నియామక ప్రక్రియలో దొర్లే జాప్యానికి ఝార్ఖండ్‌లో ఉదంతమే నిదర్శనం. దశాబ్దాలుగా పారా టీచర్‌గా సేవలందించిన ఒక వ్యక్తికి, తన పదవీ విరమణకు కేవలం ఒక్కరోజు ముందు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా శాశ్వత నియామక పత్రంఅందింది. ఆ హోదాలో విధుల్లో చేరకుండానే ఆయన ఉద్యోగ విరమణ చేయాల్సిరావడం గమనార్హం. మ్రారా జిల్లాకు చెందిన నంద్ లాల్ రవాణీ (60) 2006 నుంచి పారా టీచర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2016లో ఆయన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర ప్రభుత్వం 2023లో పారా టీచర్ల క్రమబద్ధీకరణ కోసం చేపట్టిన నియామక ప్రక్రియకు ఆయన దరఖాస్తు చేసుకోగా, అప్పటికి ఆయన వయసు 57 యేళ్లు. మూడేళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం, 2026 జూన్ 29న ఆయనకు శాశ్వత అసిస్టెంట్ టీచర్‌గా నియామక ఉత్తర్వులు అందాయి. సరిగ్గా మరుసటి రోజే (జూన్ 30న) ఆయన 60 యేళ్ల పూర్తి కావడంతో పదవీ విరమణ పొందారు. జూన్ 29న రాంచీలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మొత్తం 1,042 మంది నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేశారు. రవాణీ సైతం ఇదే వేదికపై ముఖ్యమంత్రి నుంచి పత్రం అందుకున్నారు. ఇదే తరహాలో పాలము జిల్లాకు చెందిన నియుమ్ అన్సారీ అనే మరో ఉపాధ్యాయుడికి, ఆయన మే 31న పదవీ విరమణ చేసిన తర్వాత నియామక పత్రం అందడం గమనార్హం. ఈ ఉదంతంపై నంద్‌లాల్ రవాణీ స్పందిస్తూ, 2006 నుంచి విద్యాబోధన చేస్తున్నాను. శాశ్వత ఉద్యోగం కోసం ఎన్నో యేళ్లుగా ఎదురుచూశాను. సోమవారం నాడు నియామక పత్రం అందినా, మరుసటి రోజే పదవీ విరమణ చేయాల్సి రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పారా టీచర్ల విషయంలో ప్రభుత్వం వయోపరిమితి సడలించినప్పటికీ, నియామక ప్రక్రియలో చోటుచేసుకున్న విపరీతమైన జాప్యం వల్లే ఈ అసాధారణ పరిస్థితి తలెత్తిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## సంగీత దర్శకుడు ఇళయరాజాకు కోర్టు షాక్



**న్యూఢిల్లీ,జూలై 1:** సంగీత దర్శకుడు ఇళయరాజాకు న్యాయస్థానంలో భారీ షాక్ తగిలింది. ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సరిగమ ఇండియా లిమిటెడ్ సంస్థతో నడుస్తున్న కాపీరైట్ వివాదంలో ఢిల్లీ హైకోర్టు బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో ఇళయరాజాకు వ్యతిరేకంగా ఇచ్చిన మధ్యంతర స్టే (ఇంజంక్షన్ ఆర్డర్)ను ఎత్తివేయడానికి కోర్టు నిరాకరించింది. ఫలితంగా, ఆ 134 సినిమాల్లోని పాటలపై ఇళయరాజాకు ప్రస్తుతానికి ఎలాంటి హక్కులు ఉండవని స్పష్టమైంది. ఈ వివాదం మొత్తం 134 సినిమాలలోని సౌండ్ రికార్డింగ్‌లు, లిరిక్స్, మ్యూజికల్ వర్క్‌లకు సంబంధించింది. ఇందులో ఇళయరాజా క్లాసిక్స్ అయిన అన్నకిలి, 16 వయతినిలే, కవిక్కుయిల్, భారతి, పల్లవి అను పల్లవి, ముల్లుమ్ మలరుమ్, రాజా పార్వై, నెట్రికన్, కల్యాణరామన్ వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాలు ఉన్నాయి. ఈ సినిమాల మ్యూజిక్ రైట్స్, ఓనర్‌షిప్ తమదేనంటూ సరిగమ్మ సంస్థ కోర్టును ఆశ్రయించింది. తమకు తెలియకుండా ఇళయరాజా ఈ పాటలను వేరే ప్లాట్‌ఫారమ్‌లకు లైసెన్స్ ఇస్తున్నారని, యాజమాన్య హక్కులు క్లెయిమ్ చేస్తున్నారని ఆరోపించింది.

దీనిపై విచారణ జరిపిన జస్టిస్ తుషార్ రావు నేతృత్వంలోని సింగిల్ బెంచ్ గత ఫిబ్రవరి 13న ఇళయరాజాపై ఎక్స్‌పార్టీ మధ్యంతర స్టే విధించింది. ఈ ఆర్డర్ ప్రకారం సరిగమ కాపీరైట్ కలిగి ఉన్న పాటలను వాడటం, వేరొకరికి లైసెన్స్ ఇవ్వడం లేదా ఓనర్‌షిప్ క్లెయిమ్ చేయడం వంటివి ఇళయరాజా చేయకూడదు. ఈ స్టేను రద్దు చేయాలంటూ ఇళయరాజా దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తాజాగా తిరస్కరించింది.

## సంక్షిప్త వార్తలు

### పాక్-అఫ్గాన్ సరిహద్దుల్లో తాలిబన్ల డ్రోన్ దాడులు



**కాబూల్,జూలై 1:** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌ల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. పాకిస్థాన్ భూభాగంపై ఆఫ్ఘనిస్థాన్ తాలిబన్ దళాలు డ్రోన్లతో దాడులు చేశాయి. పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులలోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. ఇవి ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ (ఐసిస్‌కే) ఉగ్రవాద సంస్థ స్థావరాలని, వాటిని ధ్వంసం చేసేందుకే దాడులు చేశామని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. పాకిస్థాన్‌పై దాడులను తాలిబన్లు సమర్థించుకు న్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో పౌరులపై దాడులు, విద్రోహ చర్యలకు ఈ స్థావరాల నుంచి ప్రణాళికలు రచిస్తున్నారని ఆరోపించారు.


### ఎంపి మహువా మొయిత్రాపై కోడిగుడ్లతో దాడి

**కోల్‌కత్తా,జూలై 1:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి ఆ రాష్ట్రంలో రాజకీయ దాడులు జరుగుతూనే ఉన్నాయి. ప్రతిపక్ష టిఎంసి ముఖ్య నాయకులే లక్ష్యంగా ఈ దాడులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ ముఖ్య నాయకుడు అభిషేక్ బెనర్జీ పైనా, కొందరు మాజీ మంత్రులపైన భౌతిక దాడులు జరిగాయి. తాజాగా మహిళా ఎంపీపై మహువాపై దాడికి పాల్పడ్డారు. టిఎంపి ఎంపీ మహువా మొయిత్రా పశ్చిమ బెంగాల్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశంలో ఉండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

### గ్యాంగ్‌రేప్ నిందితుల హోటళ్లు కూల్చివేత


**జైపూర్,జూలై 1:** రాజస్థాన్‌లో 13 యేళ్లబాలికపై సామూహిక అత్యాచారంచేసిన నిందితులకు సంబంధించిన నాలుగు హోటళ్లను అధికారులు కూల్చేశారు. రాజస్థాన్‌లోని, శ్రీగంగానగర్‌కు చెందిన పదమూడేళ్ల బాలిక జూన్ 18న కిడ్నాప్‌నకు గురైంది. బాలికను స్థానిక రిక్షా కార్మికుడు ఎత్తుకెళ్లి ఒక హోటల్ నిర్వాహకుడికి ఇచ్చేశాడు. ఆ హోటల్ ఓనర్ బాలికపై హోటల్‌లో అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఇతర హోటళ్లకు కూడా బాలికను తీసుకెళ్లాడు. నాలుగు హోటళ్లలో చిన్నారిపై అత్యాచారం, లైంగికదాడి జరిగింది. దాదాపు ఐదు రోజులపాటు బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. వివిధ హోటళ్లలో మొత్తం 30 మంది వరకు ఈ దారుణానికి ఒడిగట్టారు.

### బోరుబావిలో పడిన చిన్నారి మృతి



**అంబాలా, జూలై 1:** హర్యానాలోని అంబాలా జిల్లాలో విషాదం చోటుచేసుకున్నది. బోరుబావిలో పడిన నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. సుమారు 21 గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్ జరిగింది. ఆ చిన్నారిని బయటకు తీసినా ఆ బాలుడు మృతిచెందినట్లు గుర్తిం చారు. సుమారు 220 అడుగుల లోతులో ఆ పిల్లోడు బోరుబావిలో చిక్కుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున 3.40 నిమిషాలకు నిర్‌వాయిర్ సింగ్‌ను బోర్‌వెల్ నుంచి బయటకు తీశారు. మంగళ వారం ఉదయం నుంచి రెస్క్యూ ఆపరేషన్ జరిగింది.

### 'సింధుజలాలపై ఏకపక్ష నిర్ణయాలు భవిష్యత్తుకు ముప్పు'



**ఇస్లామాబాద్,జూలై 1:** సింధు నదీ జలాల ఒప్పందం విషయంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని పాకిస్థాన్ భారత్‌ను హెచ్చరించింది. ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి ఈ ఒప్పందం అత్యంత కీలకమని, దీనిని ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. ఇస్లామాబాద్‌లో నిర్వహించిన ఒక సదస్సులో పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) అధ్యక్షుడు బిలావల్ భుట్టో జర్దారీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. సింధు జలాల ఒప్పందం సక్రమంగా అమలు కాకపోతే, అంతర్జాతీయ వ్యవస్థల మనుగడే ప్రశ్నార్థకమవుతుందని వారు అభిప్రాయపడ్డారు.

# కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం

- శ్రీకాళహస్తి నియోజకవర్గస్థాయి టిడిపి కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేష్



**రేణిగుంట, జులై 1 ప్రభాతవార్త:** కార్యకర్తలే పార్టీకి బలమని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం ఎల్లమండ్యం పంచాయితీ కొత్తపాలెం వద్ద జరిగిన శ్రీకాళహస్తి నియోజకవర్గ స్థాయి టిడిపి కార్యకర్తల సమావేశం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన బుధవారం వేడుకగా జరిగింది. సభా ప్రాంగణ పరిసరాలు పసుపు జెండాలతో పసుపు మయంగా మారిపోయాయి. పార్టీకి కష్టకాలంలో సేవలు చేసిన దాదాపు 200 మంది కార్యకర్తలకు ఉత్తమ కార్యకర్తలుగా నారా లోకేష్ చేతుల మీదగా మెమెంటోలు అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నారా లోకేష్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలే పార్టీకి బలమని అన్నారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు అన్యాయం జరగదన్నారు. ప్రతి కార్యకర్తకు సొంతింటి కల సహకారం చేస్తామన్నారు. పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు పేద ప్రజలకు చేసిన సేవలు అన్నిర్వచనీయమన్నారు. చిత్తూరు జిల్లా మహిళలు చదువుకోవడానికి తిరుపతిలో మహిళా యూనివర్సిటీ స్థాపించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు.

ప్రతిరోజు వేలాదిమంది భక్తులు దర్శించుకునే శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధి తిరుమల నందు నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించారన్నారు. ఎన్టీఆర్ ఎలాగైతే ప్రజాసేవకు అంకితమయ్యారో అదేబాటలో ముఖ్యమంత్రి చంద్రబాబు పయనిస్తున్నారని, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న శ్రమజీవిగా అభివర్ణించారు. తెలుగుదేశం పార్టీ నియమ నిబద్ధత క్రమశిక్షణలకు నిజమైన చిరునామా అన్నారు. పార్టీ కార్యకర్తలంతా ఏకతాటిపై ఉండి ప్రతిపక్ష పార్టీలకు గుండెల్లో దడ పుట్టించాలన్నారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ కోఆర్డినేటర్ దామచర్ల సత్య, తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, ఉభయ చిత్తూరు జిల్లాల గ్రంధాలయ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి, మార్కెటింగ్ చైర్మన్ చెంచయ్య నాయుడు, శ్రీకాళహస్తి సీనియర్ టిడిపి నాయకులు మునిరాజా నాయుడు, కాసారం రమేష్, తిరుపతి పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్య రెడ్డి, రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, సింగిల్ విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రేణిగుంట మండల టిడిపి సీనియర్ నాయకులు దేవళ్ళ రమణ, కన్నన్ రెడ్డి, ముచ్చెలి భాస్కర్ రెడ్డి, మునిస్వామి నాయుడు, జి.పాళెం టిడిపి సీనియర్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, మహిళా నాయకురాలు లూవీనా మేరీ, ఏర్పేడు టిడిపి సీనియర్ నాయకులు ధనుంజయులు నాయుడు, అడిషనల్ ఎస్పీ శ్రీలత, రూరల్ సీఐ మంజునాథరెడ్డి, ఏర్పేడు సీఐ శ్రీకాంత్, గాజులమండ్యం ఎస్ఐ హరీష తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్తు

- పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులతో విడియో కాన్ఫరెన్స్‌లో సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పి డిసిఎల్ పరిధిలో పరిశ్రమలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి సిఎండి శివశంకర్ బుధవారం వినియోగదారుల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా 5 మంది పారిశ్రామిక విని యోగదారులు తమ విద్యుత్ సమస్యలపై చర్చిస్తూ, పరిశ్రమలకు నాణ్యమైన, నిరంత రాయ విద్యుత్తును సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులకు మెరు గైన సేవలతో నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రాంతా ల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని వివరించారు. అదేవిధంగా పారిశ్రామిక విద్యుత్ సర్వీసులకు అంతరాయం లేని విద్యుత్తును సరఫరా చేసేందుకు వీలుగా ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేశామన్నారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అత్యంత ప్రాధా న్యతనివ్వాలని సంస్థ అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా నుంచి లార్విన్ గ్లాస్ ఇండస్ట్రీ ప్రతినిధి కె.హరిబాబు మాట్లాడుతూ తమకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోం దని తెలియజేశారు. ఈ అంశంపై అధికారులు స్పందిస్తూ సరఫరాలో అంతరాయాలను నిరోధిం చేందుకు వీలుగా లైన్ పెట్రోలింగ్ నిర్వహించి, లోటుపాట్లను సరిచేయిస్తామని తెలియజేశారు.

**స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వేగవంతం:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ఆ సంస్థ అధికారులతో బుధవారం సాయంత్రం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ సంస్థ పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రాధాన్యత నిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ విద్యుత్ సర్వీసులతోపాటు కొన్ని ఇతర కేటగిరీల సర్వీసులకు కూడా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశామని వివరించారు. స్మార్ట్ మీటర్ల పనులను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) విభాగం ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. విద్యుత్ బిల్లింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు ఆన్లైన్ చెల్లింపులను సరళతరం చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే సందర్భంలో సమాచారాన్ని వినియోగదారులకు ముందుగానే తెలియజేసేం దుకు వీలుగా విద్యుత్ మిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, కె.ఆదిశేషయ్య, ఎన్.శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్రరావు, కె.సంపత్ కుమార్, ఎస్.రమణ, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుని సేవలో లోకేష్



శ్రీకాళహస్తీశ్వరునికి దండం పెడుతున్న మంత్రి లోకేష్

**శ్రీకాళహస్తి, జూలై 1 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం శ్రీకాళహస్తీశ్వరునికి భక్తి శ్రద్ధలతో పూజలు జరుపుకున్నారు. ఆలయం వద్ద శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. నారా లోకేష్ రాగా దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఇఒ బికె వెంకటేశు పర్యవేక్షణలో వేదపండితులతో మేళతాళాలతో స్వాగతం పలికారు. నారా లోకేష్ ఎంతో సంతోషంగా భక్తితో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్నారు. ఆలయమర్యాదలతో దక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లును చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఇఓ వెంకటేశు, ఎఇఓలు లోకేష్‌బాబు, విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు హరియాదవ్, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు. మంత్రి లోకేష్‌కు స్వాగతం పలికిన వారిలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, పట్టణ టిడిపి అధ్యక్షుడు విజయకుమార్ తదితరులున్నారు.

## కైలాసగిరి ఎకో పార్కు ప్రారంభం



టూరిజం ఎకో పార్కును ప్రారంభించిన ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్

**తొట్టంబేడు, జులై 1 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని కైలాసగిరుల్లోని 50హెక్టార్లలో రూ.2 కోట్లతో రూపొందించిన 'ఎకో పార్కు'ను బుధవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ ఎకో పార్కులో ప్రకృతి సౌందర్య, అరుదైన సంపద, కుటుంబ వినోదంలతో మేళవించి రూపొందించారు. పిల్లలకు ఆటస్థలాలు, లోటస్ పాండ్, రైఫిల్ షూటింగ్, బోటింగ్ అర్చరి, వర్చువల్ రియాల్టి, కుటీర వనాలు, రాసి నక్షత్ర, నవగ్రహవనాలు, తులసి వనాలు, మీచ్ గార్డెన్ కెపిరియాలను ఏర్పాటు చేసారు.

ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టెసాయి ప్రసాద్, సత్యవేడు శాసనసభ్యుడు కోనేటి ఆదిమూలం అటవీశాఖ చీఫ్ కన్‌సర్వేటర్ వై.శ్రీనివాసులు రెడ్డి, తిరుపతి సర్కిల్ జిల్లా అటవీశాఖ అధికారి వి.సాయిబాబా, జిల్లా అధికారులు కుమారి బబిత, హారిక, కెవి.శ్రీకాంత్, రేంజ్ అధికారి, లోకేష్, బుజ్జిబాబు, సుబ్బరాయుడు, డెప్యూటీ రేంజ్ అధికారులు దేవరాజులు, ప్రవీణ్‌కుమార్, సుహాసిని, ఇతర అటవీ తదితరులు పాల్గొన్నారు.

## మావిగన్, అమరావతిల్లో ప్రజల మద్దతు ఎవరికి ఉందో

# ఎన్నికల్లో తేల్చుకుందాం


- అమరావతి ప్రాంతానికి వ్యతిరేకం కాదు, అక్కడి రైతులపై పూర్తి సానుభూతి ఉంది
- రాష్ట్రమంతా అభివృద్ధి జరగాలంటే విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ రాజధానిగా రావాల్సిందే
- వైసిపి అధ్యక్షుడు, మాజీ సిఎం వైఎస్ జగన్



**విజయవాడ, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో వచ్చే ఎన్నికలు మావిగన్ వర్సెస్ అమరావతి మధ్య జరుగు తాయని వైసిపి అధినేత మాజీ సిఎం వైఎస్ జగన్మోహన రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసారు. మావిగన్ ప్రతిపాదనకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. మావిగన్‌కు మద్దతు ఇచ్చేవారంతా వైసిపికి ఓటు వేస్తారని చెప్పారు. ఈ రెండు రాజధానుల్లో ప్రజల మద్దతు దేనికి ఎక్కువగా ఉందో వచ్చే ఎన్నికల్లో తేలిపోతుందని అన్నారు. తాడేపల్లిలో జగన్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తాను అమరావతి ప్రాంతానికి వ్యతిరేకం కాదని, అక్కడి రైతులపై తనకు పూర్తి సానుభూతి ఉందని జగన్ స్పష్టం చేశారు. అవినీతికి ఆస్కారం లేకుండా రాష్ట్రమంతా అభివృద్ధి జరగాలంటే విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ రాజధానిగా రావాల్సిందేనని పునరుద్ఘాటించారు. తాము ప్రతిపాదించిన రాజధాని అంశానికే కట్టుబడి ఉన్నామని చెప్పారు. రాబోయే ఎన్నికలు మావిగన్ వర్సెస్ అమరావతిల మధ్యే జరుగుతాయని, ప్రజల మద్దతు ఎవరికి ఉందో అప్పుడే తేలిపోతుందని సవాల్ విసిరారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమం గురించి చర్చ జరిగితే, నేడు చంద్రబాబు పాలనలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు, కస్టోడియల్ మరణాలపై చర్చ జరగడం బాధాకరమని అన్నారు. ఈ ఘటనలో రాష్ట్ర పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన అధికారులు ప్రమేయం ఉందన్న ఆరోపణలు ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయని జగన్ అన్నారు. ఇలాంటి ఘటనలపై ప్రశ్నిస్తే, క్రిమినల్స్‌కు మద్దతు ఇస్తున్నారని ఎదురుదాడి చేయడం సరికాదన్నారు. సాయికృష్ణను మొదట రౌడీషీటర్‌గా పేర్కొన్న ప్రభుత్వం, ప్రజల ఆగ్రహం వ్యక్తమవడంతో యూటర్న్ తీసుకుని కుటుంబ సభ్యులను సచివాలయానికి పిలిపించుకుందని జగన్ విమర్శించారు. కుటుంబాలు, చిన్నారులతో కలిసి ప్రశాంతంగా గడిపే బీచ్‌లను కూడా ప్రభుత్వం వదలడం లేదు. బీచ్ షాక్స్ పేరుతో కొత్త మద్యం సంస్కృతికి తెరలేపుతోంది అంటూ వైసిపి అధినేత జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాడేపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వ నిర్ణయాలు రాష్ట్ర సామాజిక వాతావరణాన్ని పూర్తిగా చెడగొట్టేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, విదేశీ పెట్టుబడులు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పెట్టుబడులను ఆకర్షించే చేతగాని ఈ ప్రభుత్వం, కేవలం అవినీతి, దోపిడీ రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని దుయ్యబట్టారు. 'రాష్ట్రానికి కొత్తగా విదేశీ పెట్టుబడులు రావడం లేదు కానీ, ఇక్కడ దోచుకున్న సొమ్ము మాత్రం విదేశాలకు వెళ్తోంది' అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**సర్ పేరుతో పెద్ద కుట్ర:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరుతో రాష్ట్రంలో పెద్ద కుట్ర జరుగుతోంది. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పేదవాడి ఓటు హక్కునే కాలరాస్తున్నారు అంటూ వైసిపి అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. టిడిపి శ్రేణులు ఒక ప్రత్యేక యాప్‌ను ఉపయోగించి ఓటర్ల జాబితాలో అక్రమంగా జోక్యం చేసుకుంటున్నాయని జగన్ ధ్వజమెత్తారు. తమకు అనుకూలమైన వారి ఓట్లను చేర్చుతూ, వ్యతిరేకంగా ఉన్న పేదల ఓట్లను తొలగిస్తున్నారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను, ఎన్నికల విశ్వసనీయతను పూర్తిగా దెబ్బతీసే చర్యని జగన్ మండిపడ్డారు.

# తిరుమల సమాచారం



## జూన్‌లో గణనీయంగా పెరిగిన భక్తులు

- గత రెండేళ్ళకంటే ఈ ఏడాది అధికం
- 24.40 లక్షల మంది భక్తులు దర్శనం, రూ.125 కోట్లు హుండీ ఆదాయం

**తిరుమల, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని జూన్ నెలలో అత్యధికంగా 24.40లక్షల మందికి పైగా భక్తులు దర్శనం చేసుకున్నారు. భక్తుల సంఖ్యకు తగ్గట్లు తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకల రూపంలో హుండీకి రూ.125 కోట్లు ఆదాయం లభించింది. గత ఏడాది జూన్ నెల కంటే భక్తుల సంఖ్య 40వేల మంది అదనంగా దేవదేవుడిని దర్శనం చేసుకోవడం విశేషం. ముఖ్యంగా జూన్ నెలలో గురు, శుక్ర, శనివారాల్లో అదనంగా మరో పదివేల మందికి పైగా భక్తులకు ఆయా రోజుల్లో శ్రీవారి దర్శనం చేసుకునేలా చూడటం ఈ రికార్డుస్థాయి దర్శనాలకు కారణమైంది. 2025 జూన్ నెలలో ఇష్టదైవాన్ని దర్శించుకున్న భక్తుల సంఖ్య 24,08,781లక్షల మంది కాగా 2024 జూన్‌లో 22.18లక్షల మందిగా నమోదైంది. గత రెండేళ్ళతో పోల్చితే అదనంగా 2లక్షల మంది వరకు భక్తులు ఈ ఏడాది తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం విశేషం. 2025 జూన్ నెలలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీకి రూ.116.86 కోట్ల ఆదాయం మార్కును అధిగమించింది. 2024 జూన్‌లో రూ.113.65 కోట్ల వరకు భక్తులు కానుకల ద్వారా ఆదాయం నమోదైంది. 2026 జూన్‌లో రూ.125 కోట్లు రికార్డుస్థాయిలో ఆదాయం లభించింది.

# దర్శన టోకెన్లు రద్దు

- టిటిడి ప్రకటించినా భారీగా వచ్చిన భక్తులు

**తిరుమల, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి గురువారం ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం, దివ్యదర్శనం టోకెన్లు రద్దుచేయడంతో భక్తులు సమాచారం తెలియక భారీగా తరలివచ్చారు. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం భూదేవి కాంప్లెక్స్ ప్రాంతాల్లో ప్రతిరోజూ నిర్ణయించిన మేరకు ఆఫ్‌లైన్‌లో టైమ్‌స్లాట్ దర్శనం టోకెన్లు, కాలినడక భక్తులకు దివ్యదర్శనం టోకెన్లు జారీచేస్తారు. అయితే వేసవిసెలవులు ముగిసినా భక్తుల రద్దీ విపరీతంగా ఉండటంతో గురువారం స్వామివారికి నేత్ర దర్శనం, తిరుప్పావడ సేవ, సాయంత్రం పూలంగి సేవలతో సామాన్యభక్తులకు ఇబ్బందులు లేకుండా ముందుగానే గురువారం దర్శనాలకు బుధవారం టోకెన్లు ఇవ్వడం లేదని మంగళవారం టిటిడి ప్రకటించింది. దీంతో శుక్రవారం దర్శనానికి సంబంధించి గురువారం(నేటి) సాయంత్రం యధావిధిగా ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో టైమ్ స్లాట్ టోకెన్లు, దివ్యదర్శనం టోకెన్లు జారీచేసేలా టిటిడి అధికారులు చర్యలు తీసుకున్నారు. భక్తులు నేరుగా తిరుమలకు చేరుకుంటే సాధారణ సర్వదర్శనమ్‌లో భక్తులను అనుమతిస్తామని టిటిడి తెలిపింది. ప్రతిరోజూ టైమ్‌స్లాట్ సర్వదర్శన టోకెన్లుతో 12వేల మంది వరకు, దివ్యదర్శనం 2వేల వరకు భక్తులు తిరుమలకు వస్తున్న విషయం విదితమే.

# రేపటి అక్షర గోవిందానికి సర్వం సిద్ధం

## - టిటిడి జెఇఒ డాక్టర్ శరత్



**తిరుమల, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ ధర్మపరిరక్షణలో భాగంగా టిటిడి ఆధ్వర్యంలో వకుళమాత సన్నిధిలో రేపు 'శుక్రవారం' నిర్వహించనున్న 'అక్షర గోవిందం – అన్నప్రాశన్న కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నట్లు టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్ తెలిపారు. బుధవారం ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో, వకుళమాత కరుణా కటాక్షాల మధ్య వేదోక్తంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశన నిర్వహించనున్నట్లు తెలిపారు. వేద మంత్రోచ్చారణల నడుమ సంప్రదాయబద్ధంగా జరిగే ఈ పవిత్ర కార్యక్రమంలో తొలి రోజు నమోదు చేసుకున్న 25 మంది చిన్నారులు తమ తల్లిదండ్రులతో నిర్ణీత సమయానికి హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. అక్షర గోవిందంలో పాల్గొనే ప్రతి చిన్నారికి ఉచితంగా 'అక్షర గోవిందమ్' కిట్ అందజేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు వకుళామాత ఆలయ సమీపంలోని యాగశాలలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అగ్ని ప్రతిష్ఠ, కుంభారాధన, శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, వకుళమాతకు చతుర్‌కలశ స్నపనం, పంచగవ్య, క్షీర, జలాభిషేకాలు, వివిధ హోమాలు వేదపండి తుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మప్రచార పరిషత్ ఇన్‌చార్జి కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్, డిప్యూటీ ఇఒలు వరలక్ష్మి, శివప్రసాద్, ఎస్ఒ మనోహరం, విఎస్ఒలు గిరిధర్, వేంకటేశ్వర్లు, ఇఇ మల్లికార్జున ప్రసాద్, డిఇ సరస్వతి, అదనపు ఆరోగ్య అధికారి డాక్టర్ సునీల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

**9న మేల్‌చాట్ వస్త్రాల ఇ వేలం:** తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన మేల్‌చాట్ వస్త్రాలు జులై 9న ఆన్‌లైన్‌లో ఇ వేలం వేయనున్నారు. ఉపయోగించిన పాక్షికంగా దెబ్బతిన్న 47లాట్లు ఉన్నాయి. ఆసక్తిగల బిడ్డర్లు ఇతర వివరాలకు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో గానీ, టిటిడి వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. తిరుమల. ఒఆర్‌జి, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. కొనుగోలు. ఎపి.జివొవి. ఇన్ సంప్రదించగలరు.

## వెంకయ్యనాయుడుకు బర్త్‌డే విషెస్ చెప్పిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత మాజీ ఉపరాష్ట్రపతి, పద్మ విభూషణ్ ముప్పవరపు వెంకయ్య నాయుడుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వెంకయ్య నాయుడు పుట్టినరోజు సందర్భంగా చంద్రబాబు 'ఎక్స్' సామాజిక మాధ్యమం వేదికగా ఓ ప్రత్యేక సందేశాన్ని పోస్ట్ చేశారు. వెంకయ్య నాయుడు సంపూర్ణ ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని చంద్రబాబు ఆకాంక్షించారు. భారతీయ విలువలతో పాటు తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. "భారత మాజీ ఉపరాష్ట్రపతి, పద్మవిభూషణ్ వెంకయ్య నాయుడుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. భారతీయ విలువలను, తెలుగుదనాన్ని సమున్నతంగా చాటుతూ, తెలుగు భాషాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మీ సేవలు అందరికీ స్ఫూర్తిదాయకం. మీరు సంపూర్ణ ఆయురారోగ్యాలతో, ఆనందంగా, మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా" అని చంద్రబాబు తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# 16న ఆణివార ఆస్థానం

- 14న కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం
- 13న విఐపి బ్రేక్ సిఫార్సు తీసుకోరు



**తిరుమల, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** వడ్డీకాసులవాడికి ఈనెల 16వ తేదీ ఆణివార ఆస్థానం జరగనుండటంతో 14వ తేదీ మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు. ఆనందనిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహద్వారం వరకు ఆలయంలోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం పూజాసామాగ్రి తదితర వస్తువులను సుగంధ ద్రవ్యాలు నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర వాటితో కలగలిపిన నీటితో శుద్ధిచేస్తారు. ఆ సమయంలో స్వామివారి మూలవిరాట్టును శ్వేత వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచుతారు. 16న ఆణివార ఆస్థానం వేడుకలు ఆలయంలో బంగారువాకిలిలో నిర్వహిస్తారు. 14వ తేదీ అష్టదళపాదపద్మారాధన సేవ రద్దుచేశారు. కాగా 14వ తేదీ విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేశారు. అలాగే 16వ తేదీ విఐపి బ్రేక్ రద్దుచేశారు. 15న ఎలాంటి సిఫార్సులు స్వీకరించరు. ఈ రెండు ప్రత్యేక రోజుల్లో ఆలయంలో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేశారు. సోమవారం 13వ తేదీ విఐపి బ్రేక్ దర్శనాల సిఫార్సులేఖలు తీసుకు రావద్దని టిటిడి విజ్ఞప్తి చేసింది. అలాగే 15వ తేదీ బుధవారం కూడా 16వతేదీ విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి సిఫార్సులేఖలు స్వీకరించ బోమని టిటిడి వెల్లడించింది. భక్తులు ఈ విషయాలను గమనించి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

# విద్యుత్ పొదుపుపై టిటిడి ప్రత్యేక దృష్టి

**విద్యుత్ వినియోగ నియంత్రణకు ఇఒ ఆదేశాలు**



**తిరుమల, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ పరిరక్షణ, వనరుల సద్వినియోగం, స్వయం సమృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా టిటిడి పరిపాలనా భవనంతో పాటు అన్ని టిటిడి కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో విద్యుత్ వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించేందుకు టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర బుధవారం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వనరుల పరిరక్షణ మార్గదర్శకాలు, టిటిడి ముఖ్య ఇంజినీర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు అన్ని విభాగాధిపతులు, కార్యాలయాల అధిపతులు ఈ ఆదేశాలను తక్షణమే అమలుచేయాలని సూచించారు. అవసరం లేని సమయంలో లైట్లు, ఫ్యాన్లు, ఎయిర్ కండిషనర్లు, కంప్యూటర్లు, ప్రింటర్లు తదితర విద్యుత్ పరికరాలను తప్పనిసరిగా నిలిపివేయాలని స్పష్టం చేశారు. 'విద్యుత్ పొదుపే వనరుల పరిరక్షణకు తొలి అడుగు' అనే లక్ష్యంతో విద్యుత్ వ్యయాన్ని గణనీయంగా ఆదా చేసేందుకు అధికారులు, ఉద్యోగులందరూ పూర్తి సహకారం అందించాలని కోరారు. తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘన గుర్తిస్తే తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని ఇఒ హెచ్చరించారు.

# మండలి వెంకట కృష్ణారావు జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించాలి

- సిఎం చంద్రబాబుకు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు వినతి

**విజయవాడ, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన మహానేత, దివిసీమ గాంధీ, గాంధేయవాది, మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే మండలి వెంకటకృష్ణారావు జయంతిని ప్రతి సంవత్సరం ఆగస్టు 4వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారిక పండుగ (స్టేట్ ఫెస్టివల్)గా ప్రకటించాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, విద్య, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమం, మానవతా సేవలకు జీవితాంతం అంకితమయ్యారని పేర్కొన్నారు. 1975లో నిర్వహించిన తొలి ప్రపంచ తెలుగు మహాసభలకు ప్రధాన శిల్పిగా నిలిచి ప్రపంచవ్యాప్తంగా తెలుగు జాతిని ఒకే వేదికపైకి తీసుకువచ్చిన మహోన్నత దార్శనికుడని కొనియాడారు. 1977 దివిసీమ ఉప్పెన సమయంలో మంత్రి పదవికంటే ప్రజాసేవకే ప్రాధాన్యతనిస్తూ సహాయక చర్యల్లో ప్రత్యక్షంగా పాల్గొని వేలాది బాధితులకు అండగా నిలిచారని, అందుకే ప్రజలు ఆయనను ప్రేమతో 'దివిసీమ గాంధీ'గా అభివర్ణించారని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మండలి వెంకటకృష్ణారావు నిజాయితీ, నిరాడంబరత, గాంధేయ విలువలు, ప్రజల పట్ల అంకితభావానికి ప్రతీకగా నిలిచారని, భావితరాలకు ఆయన జీవితం ఆదర్శప్రాయమని వీరాంజనేయులు పేర్కొన్నారు. తెలుగు భాష, సంస్కృతి, సేవా భావం, సామాజిక బాధ్యత వంటి విలువలను భావితరాలకు చేరవేయడానికి ఇది గొప్ప ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. కాబట్టి, 2026 ఆగస్టు 4 నుంచి ప్రతి సంవత్సరం మండలి వెంకటకృష్ణారావు జయంతిని రాష్ట్ర అధికారిక పండుగగా ప్రకటించి ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని జాస్తి వీరాంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# జగన్... ఒక స్పైడర్ సినిమా సైకో విలన్



**తిరుపతి (విద్య), జూలై 1 ప్రభాతవార్త:** వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రెస్ మీట్‌లో చేసిన వ్యాఖ్యలను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తీవ్రంగా ఖండించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడు రాజధానుల పేరుతో జగన్ ఎన్నికలకు వెళితే ప్రజలు మాడు పగలగొట్టి కేవలం 11 సీట్లకు పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు మావిగన్ పేరుతో జగన్ ఆడుతున్న కొత్త నాటకాలతో త్వరలోనే ఆ 11 స్థానాల నుంచి వైసీపీ కేవలం ఒక్క స్థానానికి పడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. 2029 ఎన్నికల కంటే ముందే, త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనే ప్రజలు వైసీపీని చిత్తుగా ఓడిస్తారని ఆయన స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాజధాని అమరావతి నిర్మాణాలు పరుగులు పెడుతున్నాయని, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో దూసుకుపోతోందని వివరించారు. రూల్ ఆఫ్ లా గురించి మాట్లాడే కనీస అర్హత జగన్‌కు, ఆయన పేటీఎం బ్యాచ్‌కు లేదని ఆరణి శ్రీనివాసులు మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చట్టాన్ని గౌరవించి, రూల్ ఆఫ్ లా ను అనుసరిస్తూ సాయి కృష్ణా కేసులో సీఐ తో పాటు ఇద్దరు కానిస్టేబుల్‌లను సైతం వెనకాడకుండా అరెస్ట్ చేయించారని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో డాక్టర్ సుధాకర్ ను వేధించి చనిపోయేలా చేసింది ఎవరు? దానికి కారకులు ఎవరు? అని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్సీ అనంతబాబు దళిత యువకుడిని చంపి స్వయంగా డోర్ డెలివరీ చేసినప్పుడు, అలాగే మాజీ మంత్రి విశ్వరూప్ కుమారుడు వాలంటీర్ ను హత్య చేసినప్పుడు జగన్ రూల్ ఆఫ్ లా ఏమైందని నిలదీశారు. జగన్ ఎప్పుడూ నేరం చేసిన వారి ఇళ్లకే పోయి పరామర్శిస్తారని, ఆయన ఐదేళ్ల పాలనలో రూల్ ఆఫ్ లా ఏనాడైనా పాటించారా అని ప్రశ్నించారు. జగన్ ప్రవర్తన స్పైడర్ సినిమాలో సైకో విలన్‌లా ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో నేరాలు చేసిన వారు ఎంతటి వారైనా సరే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని ఎమ్మెల్యే హెచ్చరించారు. రాష్ట్రంలో కుల, మత, ప్రాంతాల పేరుతో జగన్ ఎలాగైనా చిచ్చు పెట్టేందుకు చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుల, మతాల మధ్య చిచ్చుపై ప్రజలకు అవగాహన కల్పిస్తుంటే, ఆయనను తట్టుకోలేక వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. జగన్ అండ్ బ్యాచ్ చేసే ఇలాంటి కుట్రలను ప్రజలు ఎప్పటికీ తిరస్కరిస్తారని, జగన్ సమాజంలో రావణాసురులను, కీచకులను తయారు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ చేసిన హిమాలయాలంత తప్పులను ఇప్పుడు కప్పిపుచ్చుకోవడానికి మళ్లీ పాదయాత్రలు చేసినా, లేదా దేవుడి గుడిలో పొర్లు దండాలు పెట్టినా ఏమాత్రం ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు.


# ముద్రగడ కోలుకుంటున్నారు!

- వైద్యులతో నిరంతరం మాట్లాడుతున్న వైఎస్ జగన్
- ప్రతిపాడు నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ గిరిబాబు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 1 ప్రభాతవార్త:** మాజీ మంత్రి, వైసీపీ పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని, ఆయన అనారోగ్యం నుండి నెమ్మదిగా కోలుకుంటున్నారని ఆయన తనయుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు బుధవారం తెలిపారు. ప్రజలు, అభిమానుల ఆశీస్సులతో రోజురోజుకూ ఆయన ఆరోగ్యం మెరుగవుతోందని పేర్కొన్నారు. తన తండ్రి ముద్రగడ ఆసుపత్రిలో చేరినప్పటి నుండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముద్రగడ కుటుంబానికి కొండంత అండగా నిలిచారని గిరిబాబు కృతజ్ఞతలు తెలిపారు. జగన్ ప్రతిరోజూ ముద్రగడ ఆరోగ్య వివరాలను ఫోన్ ద్వారా అడిగి తెలుసు కుంటున్నారని ఆసుపత్రి యాజమాన్యం పార్థసారథితో పాటు, చికిత్స అందిస్తున్న డాక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడి అప్‌డేట్స్ తీసుకుంటున్నారని వివరించారు. ఇదే సమయంలో అమెరికా నుండి వచ్చిన వైద్య నిపుణులు దత్తాత్రేయులు కూడా ముద్రగడ చికిత్స విషయంలో ప్రత్యేకంగా సహకరిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అభిమానులు, పార్టీ శ్రేణులు ఎవరూ ఆసుపత్రికి రావద్దని ముద్రగడ గిరిబాబు మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేశారు. "నాన్నతో పాటు ఆసుపత్రి ఐసీయూలో ఎంతో మంది ఇతర రోగులు కూడా చికిత్స పొందుతున్నారు. అక్కడ ఇన్ఫెక్షన్ల సమస్య ఉంటుంది. ఇతర రోగులకు, ఆసుపత్రి సిబ్బందికి ఇబ్బంది కలగకుండా అందరూ సహకరించాలి" అని ముద్రగడ గిరిబాబు కోరారు. తన తండ్రి పూర్తిగా కోలుకున్నాక, తామే స్వయంగా జగన్ మోహన్ రెడ్డి ని కలవడానికి వెళ్తామని లేదా ఆయనే స్వయంగా వచ్చి పరామర్శిస్తారని గిరి పేర్కొన్నారు. కష్టసమయంలో తమకు తోడుగా నిలిచిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి ముద్రగడ కుటుంబం తరఫున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సింధు ఆసుపత్రిలో చికిత్స ముద్రగడ పద్మనాభం ను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిల్ సభ్యులు గోరుముచ్చు గోపాల్ యాదవ్ ముద్రగడ ఆరోగ్యం పరిస్థితిని అడిగి తెలుసుకుని పరామర్శించారు. గిరిబాబుకు పార్టీ అండగా ఉంటుందని గిరిబాబుకు గోపాల్ యాదవ్ ధైర్యం చెప్పారు.



# పివి జీవితాన్ని పరిశోధించాలి

**నాంపల్లి, జూలై 1 ప్రభాతవార్త:** భారతరత్న పి.వి. నరసింహారావు బహుముఖ ప్రజ్ఞాశాలి, బహు భాషా కోవిదుడు, రచయిత, న్యాయవాది, భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కర ణలను తీసుకువచ్చారని, గొప్ప రాజకీయ వేత్తగా దేశ రాజకీయాల్లో ఎన్నో అత్యంత అత్యున్నతస్థాయి పదవులతోసహా భారతదేశ ప్రధానమంత్రి పదవులను చేపట్టి దేశాన్ని అభ్యున్నత శిఖరాలు అధిరోహించే దిశలో పయనింపజేశారని అందరూ ప్రశంసించడం సర్వసాధారణమే కానీ ఆయన జీవితాన్ని తప్పక పరిశోధించి పరిశీలించాల్సిన ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అప్పుడే ఆయన్ను పూర్తిగా తెలుసుకున్న వారమవుతాయని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ రాజకీయవేత్త డా. కె. కేశవరావు అన్నారు.

శ్రీకృష్ణ దేవ రాయ తెలుగు భాషానిలయం ఆధ్వ ర్యంలో డా. రావిచెట్టు రంగారావు సభామం దిరంలో భాషానిలయం అధ్యక్షుడు డా. కె.వి. రమణాచారి సభా ధ్యక్షతన జరిగిన పి.వి.నర సింహారావు జయంతి సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.కేశవరావు డా. వి.కిషన్‌రావు, డా. పి.వి.ప్రభాకర్‌రావు, భాషానిలయం గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు తదితరులతో కలిసి పివి చిత్రపటానికి పూలమాలవేసి ఘననివా ళులర్పించి భారతరత్న పి.వి.నరసింహారావు ఒక వాక్చిత్రం పుస్తకాన్ని ఆవిష్కరించి బహుముఖ ప్రజ్ఞాశాలి పి.వి.నరసింహారావు స్మారక ప్రసంగం చేసి ఆయనతో ఉన్న సాన్నిహిత్యాన్ని, అ త్యున్నత లక్షణాలను సవివరపరిచారు. ఈ సందర్భంగా అతిథులు డా. కె.వేశవరావును ఘనంగా సత్కరించారు.

# ప్రకాశం బ్యారేజ్ నుండి కృష్ణా డెల్టాకు నీరు విడుదల

- 13.08 లక్షల ఎకరాల ఆయుకట్టు నీరు.. 30 లక్షల మంది రైతులకు ప్రయోజనం



**విజయవాడ, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇందులో భాగంగా డెల్టా కాలువలపై ఆధారపడిన రైతులకు సకాలంలో సాగు నీరు అందించేందుకు సకాలంలో నీటిని విడుదల చేయడం జరిగిందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. కృష్ణా డెల్టా రైతాంగానికి సకాలంలో సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రకాశం బ్యారేజ్‌లోని కృష్ణా ఈస్టర్న్ మెయిన్ హెడ్ రెగ్యులేటర్ నుంచి బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి తూర్పు, పశ్చిమ కాలువలకు 3,200 క్యూసెక్కుల సాగునీటిని అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణమ్మ తల్లికి పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన 'ఏరువాక పౌర్ణమి' కార్యక్రమానికి కొనసాగింపుగా కృష్ణా డెల్టా రైతులకు సాగునీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. కృష్ణా డెల్టా పరిధిలోని సుమారు 13.08 లక్షల ఎకరాల ఆయకట్టు భూములకు దాదాపు 30 లక్షల మంది రైతులకు ఈ నీటి విడుదల ద్వారా సకాలంలో పంటలు వేసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. రైతులకు ఎలాంటి నీటి కొరత లేకుండా సకాలంలో సాగునీరు అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ సంకల్పమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణారావు మాట్లాడుతూ నీటి క్యాలెండర్ ప్రకారం జులై 1న కృష్ణా డెల్టాకు సాగునీటిని విడుదల చేయడం రైతులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. జూలై చివరి నాటికి వరి నాట్లు పూర్తి చేయడం ద్వారా నవంబర్‌లో వచ్చే తుఫానుల ప్రభావం నుంచి పంటలను రక్షించుకోవచ్చన్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ మాట్లాడుతూ రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. 'ఎల్ నిన్యో' ప్రభావం వల్ల వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు నీటిని పొదుపుగా వినియోగించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని నాయకులు, అధికారులు రైతులకు విజ్ఞప్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, జలవనరుల శాఖ ఎస్ఇ జె. గుణకరరావు, సిఇ బి.రాంబాబు, కెసి డివిజన్ ఇఇ ఆర్.రవికిరణ్, కెఇ డివిజన్ ఇఇ ఆంజనేయ ప్రసాద్, ఇరిగేషన్ అధికారులు ఎల్.కృష్ణప్రసాద్, కె.బాబు, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పి.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండ

- ముందుచూపుతో కేజీ తోతాపురికి రూ.4 ప్రోత్సాహక ధర
- ఉనికి కోసం వైకాపా నిరసనల పేరిట డ్రామాలు
- చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు



**చిత్తూరు, జులై 1 ప్రభాతవార్త:** ఈ సీజన్‌లో మామిడి రైతుల కష్టాన్ని గుర్తించి సిఎం చంద్రబాబు ముందుచూపుతో తోతాపురి మామిడికి రూ.4 ప్రోత్సాహక ధర ప్రకటించి అన్నదాతకు అండగా నిలిచారని పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. రైతు పక్షపాతిగా చంద్రబాబు మరోసారి నిరూపించుకుంటే ప్రతిపక్ష వైకాపా నాయకులు ఉనికి కోసం నిరసనల పేరిట డ్రామాలు ఆడుతున్నారని ఆయన ఆరోపించారు. మామిడి రైతుకు న్యాయం చేయాలని డిమాండ్‌తో వైకాపా నాయకులు చేస్తున్న డ్రామాలను మీడియా ద్వారా తెలుసుకున్న ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు దేశ రాజధాని న్యూఢిల్లీ నుండి ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కూటమి పాలనను చూసి ఓర్వలేక వైకాపా నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఇలాంటి డ్రామా కార్యక్రమాలకు తెర లేపారన్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అన్నదాతకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని, అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసాతో పాటు, ధాన్యం కొనుగోలులోను పారదర్శక విధానాలను అమలు చేస్తోందన్నారు. అకస్మిక ప్రకృతి వైపరీత్యాలు, పంట నష్టాలు సంభవించినపుడు మామిడి వంటి వాణిజ్య పంటలు సాగు చేసే రైతులకు సైతం కిలోకు నిర్దిష్ట నష్టపరిహారంను అందించి కూటమి ప్రభుత్వం ఆదుకుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 19.97 లక్షల మంది రైతుల నుండి 1.29 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యంను ప్రభుత్వం సేకరించిందన్నారు. అలాగే రైతుకు రూ.30,361 కోట్లకు పైగా చెల్లింపులు జరిగాయని ఎంపీ పేర్కొన్నారు. ఇందులో 94 శాతం చెల్లింపులు కేవలం 24 గంటల వ్యవధిలోనే నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయడం సిఎం నారా చంద్రబాబునాయుడు పరిపాలన దక్షతకు నిదర్శనమన్నారు. కొత్త పంటల సాగుకు శ్రీకారం చుట్టే పవిత్రమైన ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని రైతులకు మెరుగైన ప్రణాళికలు, రాయితీలు అందిస్తామని సిఎం చెప్పడం రైతుల సంక్షేమం పట్ల ఆయనకు వున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. అలాగు వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం, భూసార పరీక్షా పత్రాల జారీ, పొలం పిలుస్తోంది వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా కూటమి ప్రభుత్వం వ్యవసాయంను మరింత లాభసాటిగా మార్చుతోందన్నారు. అన్నదాతల అభ్యున్నతి కోసం పలు మంచి పనులు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైకాపా నాయకులు విమర్శలు చేయడం తగదని హితవు పలికారు.

# మామ, అల్లుళ్ళ జంట హత్యపై పలు అనుమానాలు!

**విజయవాడ, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం చిన్న గొల్లపాలెం చెరువులో మామ, అల్లుళ్ళను అత్యంత పాశవీకంగా చంపి, మోటారు సైకిళ్ళకు తాళ్ళు కట్టి హత్యచేసిన ఘటన ఇప్పుడు ఆ ప్రాంతంలో కలకలం రేపుతోంది. మొదట మామ అల్లుళ్ళ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి, అయితే వారిద్దరిని బైకుకు తాళ్లతో కట్టేసి నీళ్లలో పడేశారంటే ఇది హత్యేనని స్థానికులు అనుమానిస్తున్నారు. ముందుగా వారిని కొట్టి చంపి ఉంటారని భావిస్తున్నారు. ఆ తర్వాత ఆధారాలు మాయం చేసేందుకు, మృతదేహాలు పైకి తేలకుండా ఉండేందుకు ఇలా బైకుకు కట్టి నీళ్లలో పడేసి ఉంటారని చర్చించుకుంటున్నారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి లోతుగా విచారిస్తున్నారు. పాత కక్షలు ఏమైనా న్నాయా? అన్న కోణంలోనూ విచారణ సాగుతోంది. ఈ ఘటనతో చిన్న గొల్లపాలెం గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం చిన్న గొల్లపాలెం గ్రామం. అక్కడ యానాది కులానికి చెందిన శెట్టి సుబ్బన్న (51), గొలుసు అయ్యప్ప (40) నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ వరసకు మామా అల్లుళ్లు. వీరు రోజూ చేపల వేటకు వెళ్తుంటారు. ఆ వేటే వారి కుటుంబాలకు ప్రధాన జీవనాధారం. ఎప్పటిలాగే శనివారం రాత్రి కూడా వారు వేటకు బయలుదేరారు. రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లారు. కానీ, అదే వారి చివరి ప్రయాణం అవుతుందని ఆ కుటుంబాలు ఏమాత్రం ఊహించలేదు. రాత్రి వేటకు వెళ్లిన మామాఅల్లుళ్లు మరుసటి రోజు ఉదయం అయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన మొదలైంది. ఆదివారం ఎంతసేపటికీ వారు రాకపోవడంతో సుబ్బన్న కుమారుడు శెట్టి ఏడుకొండలు వారిని వెతుక్కుంటూ బయలుదేరాడు. వారు రోజూ చేపలు పట్టే ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ పరిసరాలను జాగ్రత్తగా గమనించాడు. ఏడుకొండలు ఆ ప్రాంతంలో చూసిన దృశ్యాలు అతడిని భయపెట్టాయి. వారు వేటాడి పట్టుకున్న చేపలు అక్కడ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అక్కడికి కొంత దూరంలో నేల మీద కొన్ని రక్తపు మరకలు కూడా కనిపించాయి. అక్కడే ఒక మొబైల్ ఫోన్ కూడా కింద పడి ఉంది. వెంటనే ఏడుకొండలు మిగతా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్థులు కూడా అక్కడికి చేరుకున్నారు. అంతా కలిసి పరిసరాల్లో గాలించినా వారి ఆచూకీ దొరకలేదు. దీంతో ఆదివారం రాత్రి కృత్తివెన్ను పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తన తండ్రి, బావ అదృశ్యమయ్యారని ఏడుకొండలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల గాలింపులో సోమవారం షాకింగ్ దృశ్యం బయటపడింది. కొత్త కాలువ ఏటి మొగ పాయల వద్ద నీటిలో ఒక బైక్ ఉన్నట్లు గుర్తించారు. ఆ బైకుకు తాళ్లతో కట్టేసిన స్థితిలో రెండు మృతదేహాలు ఉన్నాయి. అవి గల్లంతైన సుబ్బన్న, అయ్యప్పల మృతదేహాలేనని పోలీసులు నిర్ధారించారు. వెంటనే గ్రామస్థుల సహాయంతో పోలీసులు ఆ మృతదేహాలను కష్టపడి బయటకు తీశారు. బుధవారం ఈ ఘటనకు సంబంధించి కొందరు అనుమానితులను విచారిస్తున్నారు.

# వివాహం పేరిట బాలిక కిడ్నాప్, లైంగిక దాడి

## నిందితుడికి 20 యేళ్ల కఠిన శిక్ష విధించిన కోర్టు



నిందితుడు మహమ్మద్ అఫ్రోజ్

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** బాలికను ప్రేమ పేరుతో నమ్మించి వివాహం చేసుకుంటానని మభ్యపెట్టి, ఆమెను కిడ్నాప్ చేసి, పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డ యువకుడికి రాజేంద్రనగర్ ఫోక్సో కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు మూడు వేల రూపాయల జరి మానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పింది. వివరాలు ఇలావున్నాయి. సైబరాబాద్ పరిధిలోని చందానగర్‌లో 2020 మార్చి నెలలో ఈ ఘటన వెలుగు చూసింది. కర్నాటకకు చెందిన మహమ్మద్ అఫ్రోజ్ (23) రామచంద్రపురం పరిధిలో గల లింగంపల్లిలో వుంటూ ఆటో డ్రైవర్‌గా స్థి రపడ్డాడు. తానుండే ప్రాంతంలో పరిచయం అయిన ఓ మైనర్ బాలికను ప్రేమ పేరిట ఇతను వంచించాడు. ఈ విషయం బాలిక కుటుంబీకుల కు తెలియడంతో అఫ్రోజ్‌ను మందలించారు. అయినా అతను తన పద్దతి మార్చుకోలేదు. దీని తరువాత 2020 మార్చి 15వ తేదీన మైనర్ బా లికను ఇంట్లో ఒంటరిగా వున్న సమయంలో ఆటోలో కిడ్నాప్ చేశాడు. అదే రోజు సాయంత్రం బాలిక తల్లి చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చే సింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు బాలికను వెంటనే రక్షించినా అఫ్రోజ్ మాత్రం 2020 జూలై 10వ తేదీన పట్టుబడగా వెంటనే అరెస్టు చేసి ఫోక్సో సెక్షన్ల కింద రిమాండుకు తరలించారు. ఈ కేసుపై ఆరేళ్లుగా రాజేంద్రనగర్‌లోని ఫోక్సో కోర్టులో వాదనలు జరుగుతున్నాయి . దీనిపై బుధవారం నాడు ఫోక్సో కోర్టు స్పెషల్ జడ్జి టి.శ్రీనివాస్ తీర్పును వెలువరిస్తూ మైనర్ బాలికను ప్రేమ పేరుతో కిడ్నాప్ చేయడంతో పాటు పెళ్లి చేసుకుంటానని నమ్మించి వ లు వ మా ర్లు లైంగిక దాడికి పా ల్ప డ్డ మ హ మ్మ ద్ అ ఫ్రో జ్ కు 20ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు మూడు వేలరూపాయల జ రి మా నా విధించారు. ఈ కేసు లో బాధిత బాలికకు శిక్షపడ్డ అఫ్రోజ్ లక్ష రూపా యల నష్ట పరిహారం చెల్లించాలని స్పెషల్ జడ్జి తీర్పు చెప్పారు. దీని తరువాత నిందితుడు అఫ్రోజ్‌ను చందానగర్ పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# కత్తి వెంకటస్వామికి షోకాజు నోటీసు

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** ఎఐసిసి ఒబిసి కన్వీనర్, టిపిసిసి జనరల్ సెక్రటరీ కత్తి వెంకటస్వామికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎంపి మల్లు రవి షోకాజు నోటిసు బుధవారం జారీచేశారు. కాంగ్రెస్ పార్టీపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పలు సామాజిక వేదికలు, టి వి షోలలో పార్టీ అస్థిత్వంకు, ముఖ్యమంత్రి పరువుకు భంగం కలిగించేలా కత్తివెంకటస్వామి మాట్లాడు తున్నారని మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని షోకాజు నోటిసులు జారీచేశారు. ఏదైనా సంకటపరిస్థితి ఉంటే వాటిని పార్టీ అంతర్గత వేదికలపై మాట్లాడుకోవాలని ఇలా బహిరంగంగా చర్చకు పెట్టడం తగదని ఆయన వైఖరికి విపరీతంగా ఉందని మూడు రోజుల్లో రాతపూర్వ కంగా వ్యక్తిగతంగా వచ్చి వివరణ ఇచ్చుకోవాలనీ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎంపి మల్లు రవి ఆదేశించారు.

# దుర్గమ్మ సేవలో కె కన్నబాబు



దేవదాయ సెక్రటరీ కె కెన్నబాబుకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జులై 1 ప్రభాతవార్త:** దుర్గమ్మని రాష్ట్ర దేవాదాయ శాఖ సెక్రటరీగా నియమితులైన కె. కన్నబాబు బుధవారం దర్శించుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

**దుర్గమ్మ ఆలయ సిబ్బంది పదవీ విరమణ:** దుర్గమ్మ ఆలయంలో విధులు నిర్వర్తించిన ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. బి. త్రినాథ్ (సీనియర్ అసిస్టెంట్), కె. పద్మజ (జూనియర్ అసిస్టెంట్)ల సేవలను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్. రంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్.రమ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ పి. చంద్రశేఖర్, డాక్టర్ కె. గంగాధర్ మరియు ఎం. తిరుమలేశ్వరరావు పదవీ విరమణ చేసిన సిబ్బంది కర్తవ్య దీక్షను, ఆలయ అభివృద్ధికి వారందించిన సేవలను కొనియాడారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా గడవాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సత్కరించి, అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, నూతన వస్త్రాలను అందజేసి గౌరవించారు. కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, సూపరింటెండెంట్లు తోటి సిబ్బంది, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇఏపిసెట్-2026 ఫలితాల్లో నారాయణ విజయభేరి

- 100లోపు 35 ర్యాంకులు నారాయణ విద్యార్థులవే!



**హైదరాబాద్, జులై 1 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రకటించిన ఈఏపీసెట్-2026 ఫలితాలలో నారాయణ విద్యార్థులు సంచలనాలు ఆవిష్కరించారు. తెల్లూరి శ్రేయాస్‌రెడ్డి స్టేట్ 5వ ర్యాంకుతో సంచలనం సృష్టించాడు. స్టేట్ ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మసీ విభాగాలలో స్టేట్ 5, 12, 13, 16, 17, 19, 20, 21, 23, 28, 31, 34, 42, 43, 45, 47, 48, 52, 54, 57, 63, 67, 71, 79, 80, 84, 84, 85, 87, 87, 90, 91, 96, 97, 100 వంటి లోపు 35టాప్ ర్యాంకులు నారాయణ విద్యార్థులే చేజిక్కించుకున్నారు. మొత్తంగా 10లోపు 1, 100 లోపు 35, 500లోపు 204, 1000లోపు 414 ర్యాంకులు సాధించి విద్యార్థులు, తల్లిదండ్రుల ఆశయాల సాధన ఒక్క నారాయణకు మాత్రమే సాధ్యమని మరోసారి నిరూపించామని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.సింధూర నారాయణ, డైరెక్టర్ పి.శరణి నారాయణ పేర్కొన్నారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో 100లోపు 24 ర్యాంకులు కేవలం నారాయణ విద్యా ప్రణాళిక ద్వారానే సాధించామని వివరించారు. అగ్రి, ఫార్మసీ విభాగంలో 100లోపు 11 ర్యాంకులు నారాయణ విద్యార్థులు సాధించటం మెడికల్ ప్రోగ్రామ్‌పై నారాయణ విద్యాసంస్థలకు ఉన్న పట్టుని రుజువు చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నారాయణ తప్ప మరి ఏ ఇతర విద్యాసంస్థ ఈ స్థాయి ర్యాంకులు సాధించలేరని పేర్కొన్నారు. గత సంవత్సరంతో పోల్చితే సీటు సాధించే ర్యాంకుల సంఖ్య అత్యధికంగా ఉండటం గమనించాల్సిన విషయమన్నారు. గత 47 సంవత్సరాలుగా కేవలం టాప్ ర్యాంకులను పరమావధిగా చేసుకుని రూపొందించిన నారాయణ విశిష్ట విద్యా ప్రణాళిక ద్వారానే ఈ ఘన విజయాలను సాధించగలిగామని తెలియజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈఏపీసెట్ ఫలితాలలో ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మసీ విభాగాలలో టాప్ ర్యాంకులు సాధిస్తూ తమ అధిపత్యాన్ని కొనసాగిస్తూనే ఉన్నామని, ఈ పోటీ పరీక్షలలో తమకు పోటీ అనేది లేకుండా నిరంతరంగా శ్రమిస్తూనే ఉంటామని తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలియజేశారు.

# ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మాలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ శ్రీచైతన్య విద్యార్థులదే

- ఇఏపిసెట్2026 ఫలితాల్లో టాప్
- 100లోపు 97 ర్యాంకులు శ్రీచైతన్య విద్యార్థులవే



జొన్నల రోషన్ మనుదీప్‌రెడ్డి ఇంజనీరింగ్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్



సంబంగి జస్వంత్‌నాయుడు అగ్రి, ఫార్మాలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్

**హైదరాబాద్, జులై 1 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** ఏపీలో విడుదలైన ఏపీ ఈఏపిసెట్-2026 ఫలితాల్లో ఇంజనీరింగ్‌లోనూ అగ్రి, ఫార్మాలోనూ స్టేట్ ఫస్ట్ ర్యాంకులతో పాటు టాప్ ర్యాంకులు సాధించి ఎప్పటిలానే శ్రీచైతన్య రికార్డ్స్ క్రియేట్ చేసింది. ఇంజనీరింగ్‌లోనూ టాప్ 10లోపు 6 ర్యాంకులు, అగ్రి, ఫార్మాలో టాప్ 10లోపు 5 ర్యాంకులతో పాటు ఏపీ ఇఏపిసెట్‌లో 100 లోపు 97 ర్యాంకులు పైగా శ్రీచైతన్యవే. అగ్రి, ఫార్మాలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సంబంగి జస్వంత్ నాయుడు, 2వ ర్యాంక్ కుడుముల వెంకట మహంతాక్షజ్ రెడ్డి, 3వ ర్యాంక్ కొండురెడ్డి హారికా దేవి శ్రీ అనుహ్య, 8వ ర్యాంక్ దండమూడి జాగృతి, 10వ ర్యాంక్ రేలంగి జయ శన్ముఖి, ఇంజనీరింగ్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ జొన్నల రోషన్ మనుదీప్‌రెడ్డి, 2వ ర్యాంక్ కోరుకొండ శ్రావ్య, 6వ ర్యాక్ ముక్కర సాకేత్, 7వ ర్యాంక్ బండి వెంకట సాత్విక్, 9వ ర్యాంక్ పాసల మోహిత్, 10వ ర్యాంక్ మర్కర వంశీధర్‌రెడ్డి లాంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించింది శ్రీచైతన్య విద్యార్థులే ఉండటం విశేషం. ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మాలో విభాగాలలో రెండు స్టేట్ ఫస్ట్ ర్యాంకులతో పాటు టాప్ 10లోపు 1, 1, 2, 2, 3, 6, 7, 8, 9, 10, 10 ర్యాంకులతో పాటు టాపు 100లోపు 97 ర్యాంకులు పైగా ర్యాంకులు, 500లోపు 242 పైగా ర్యాంకులు శ్రీచైతన్య విద్యార్థులే సాధించి అటు ఇంజనీరింగ్‌లోనైనా ఇటు అగ్రి, ఫార్మాలో నైనా శ్రీచైతన్యకు పోటీ లేదని నిరూపించారు. టాప్ ర్యాంకులు సాధించిన వారిలో అత్యధిక మంది శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు కావడం విశేషం. గత 40 ఏళ్లగా ఇంజనీరింగ్ లోనైనా, మెడికల్‌లోనైనా అత్యధిక టాప్ ర్యాంకులు, మార్కులు సాధించిన ఘనత ఒక్క శ్రీచైతన్యదే. ఈ అత్యుత్తమ ఫలితాల వెనుక శ్రీచైతన్య సృష్టించిన అనితర సాధ్యమైన ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాములు, ఇంటర్నల్ టెస్ట్ పేపర్లు, స్టూడెంట్ టీచర్ 1 టు 1 అడాప్షన్ సిస్టమ్‌తో నిపుణులైన అధ్యాపక బృందం శిక్షణ కీలకంగా నిలిచాయని శ్రీచైతన్య విద్యాసంస్థలు అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఈ సందర్భంగా తెలియజేశారు. పోటీ పరీక్ష ఏదైనా పరీక్షా విధానాలు ఎలా మారినా నెం.1గా నిలిచేది తమ విద్యార్థులేనని, ఈ ఏడాది విడుదలైన జెఈఈ మెయిన్స్, జెఈఈ అడ్వాన్స్‌డ్‌లో సైతం టాప్ ర్యాంకులు సాధించిన ఘనత ఒక్క శ్రీచైతన్యదేనని, రాబోయే నీట్ 2026లో కూడా అగ్రస్థానం మా విద్యార్థులదేనని ధీమా వ్యక్తం చేశారు.

# స్వీడన్‌ను చిత్తుచేసిన ఫ్రాన్స్, ప్రిక్వార్టర్స్‌కు మెక్సికో




కలిసికట్టుగా ఫ్రాన్స్ అటాక్

**న్యూజెర్సీ, జూన్ 1 :** హాట్ ఫేవరెట్, రెండు సార్లు ఛాంపియన్ ఫ్రాన్స్... ముచ్చటగా మూడోసారి కప్ అందుకునే దిశగా సాకర్ ప్రపంచకప్‌లో దూసుకుపోతోంది. ఎంబాపె మ్యాజిక్ గోల్స్‌తో ఫ్రాన్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. నాకౌట్‌లో స్వీడన్‌ను 3-0 గోల్స్ తో చిత్తు చేసింది. కైలియన్ ఎంబాపె మరోసారి డబుల్ గోల్స్ (45, 74వ నిమిషం)తో మెరవగా, బ్రాడ్లీ బార్కోలా (53వ నిమిషం) మరో గోల్ సాధించాడు. ప్రి క్వార్టర్ ఫైనల్లో పరాగ్వేతో ఫ్రాన్స్ తలపడనుంది.

మ్యాచ్ ప్రారంభం నుంచి ఫ్రాన్స్ అటాకింగ్ గేమ్ మొదలు పెట్టింది. పలుసార్లు స్వీడన్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసింది. ఫ్రాన్స్ ఫార్వర్డ్‌ల స్పీడ్‌కు స్వీడన్ వద్ద సమాధానం లేకపోయింది. మ్యాచ్‌లో ఎక్కువసేపు బంతిని ఫ్రాన్స్ తమ ఆధీనంలోనే ఉంచుకుంది. తొలి అర్ధభాగం గోల్ లెస్‌గా ముగుస్తుందనుకుంటున్నదశలో ఎంబాపె అద్భుత గోల్‌తో ఫ్రాన్స్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. ఉస్మానే డెంబెలే, మైఖేల్ ఒలిసేలు చాకచక్యంగా ఆడిన షార్ట్ కార్నర్ వ్యూహం స్వీడన్‌ను దెబ్బతీసింది. ఎడమ వైపు నుంచి బంతిని అందుకున్న ఎంబాపె.. మెరుపు వేగం తో స్వీడన్ స్ట్రైకర్ విక్టర్ గ్యోకెరెస్‌ను కింద పడేశాడు. ఆ వెంటనే కుడికాలి క్లినికల్ షాట్‌తో బంతిని గోల్ కీపర్ జాకబ్ విడెల్ జెటర్‌స్ట్రోమ్‌కు అందకుండా నెట్‌లోకి పంపాడు దీంతో ఫ్రాన్స్ మొదటి గోల్ సాధించింది.

రెండో అర్ధభాగంలో ఫ్రాన్స్ మరింత దూకుడుగా ఆడింది. 53వ నిమిషంలో మైఖేల్ ఒలిసే స్వీడన్ డిఫెన్స్‌ను దాటుకొని అందించిన బంతిని బ్రాడ్లీ బార్కోలా గోల్‌గా మలిచాడు. దీంతో ఫ్రాన్స్ రెండో గోల్ సాధించింది. ఇక 74వ నిమిషంలో ఫ్రాన్స్ విజయం అధికారికం గా ఖరారైంది. ఒలిసే మరోసారి స్వీడన్ డిఫెన్స్ ను చేధిస్తూ ఎంబాపెకు అద్భుతమైన పాస్ ఇచ్చాడు. బంతితో దూసుకెళ్లిన ఫ్రెంచ్ కెప్టెన్ బంతిని కర్ల్ చేస్తూ ఫార్ కార్నర్‌లోకి పంపాడు. స్కోరు 3-0గా మార్చాడు.



ఈక్వెడార్‌పై మెక్సికో ఆటగాళ్ల గెలుపు సంబరాలు

**40యేళ్ల తర్వాత మెక్సికో**

అమెరికా, కెనాడాతో కలిసి అతిథ్యమిస్తున్న మెక్సికో అద్భుత ప్రదర్శనతో 40 ఏళ్ల తర్వాత నాకౌట్ మ్యాచ్‌లో విజయం సాధించింది. ఈక్వె డార్‌పై 2-0 గోల్స్ తేడాతో నెగ్గి ప్రి క్వార్టర్ ఫైనల్ చేరింది. వర్షం వల్ల గంట ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో హోమ్ క్రౌడ్ మద్దతు తో మొదటి నుంచే ఆధిపత్యం చూపింది. మ్యాచ్ తొలి అర్ధభాగంలో కేవలం 9 నిమిషాల వ్యవధి లోనే రెండు గోల్స్ చేసింది. జూలియన్ క్వినోనెస్ అద్భుత గోల్‌తో ఖాతా తెరవగా.. వెంటనే రౌల్ జిమెనెజ్ రెండో గోల్‌తో ఆధిక్యం పెంచాడు. గ్రూప్ దశలో జర్మనీపై సంచలన విజయం సాధించి అనూహ్యంగా అంచనాలు పెంచుకున్న ఈక్వెడార్... ఈ మ్యాచ్‌లో మాత్రం తేలిపోయింది. రెండో అర్ధభాగంలో పీరో హింకాపీ రెడ్ కార్డ్‌తో వైదొలగడంతో జట్టు 10 మందికే పరిమితమైంది.

మెక్సికో చివరిసారిగా 1986 ఎడిషన్‌లో బల్గేరియాపై నాకౌట్ విజయం సాధించింది. ఇప్పుడు అదే అజ్‌టెకా స్టేడియంలో, అదే స్కోర్ లైన్‌తో మరోసారి నాకౌట్ గెలుపొందింది. వరుసగా 7 నాకౌట్ పరాజయాల తర్వాత వచ్చి న ఈవిజయం మెక్సికోకు భారీ ఊరట ఇచ్చింది.



## కైలియన్ ఎంబాపె సరికొత్త రికార్డు

మెస్సీకి కూడా సాధ్యం కాని రికార్డును ఎంబాపె తన పేరిట లిఖించాడు. ఫిఫా ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాడిగా ఎంబాపె (10 గోల్స్) నిలిచాడు. అర్జెంటీనా స్టార్ లియోనల్ మెస్సీ 5 గోల్స్‌తో ఎంబాపెకు ఆమడ దూరంలో ఉన్నాడు. జస్ట్ ఫొంటైన్, వావా, ఒల్డ్‌రిచ్, పీలే చెరో ఏడు గోల్స్ సాధించారు. ఎంబాపె ఆడిన మూడు వరల్డ్‌కప్స్ 2018, 2022, 2026 నాకౌట్ స్టేజ్‌లో మొత్తం 10 గోల్స్ కొట్టాడు. 2018ఫిఫా నాకౌట్ దశలో మూడు గోల్స్, 2022 ఫిఫా నాకౌట్ దశల్లో ఐదు గోల్స్, తాజాగా 2026 ఫిఫాలో నాకౌట్ దశలో ఇప్పటికే రెండు గోల్స్ సాధించాడు.

**మెస్సీ రికార్డుకు అడుగు దూరంలో..**

ఫ్రాన్స్ సంచలనం వెంబాపె రికార్డుల మీద రికార్డులు సాధిస్తున్నాడు. స్వీడన్‌పై రెండు గోల్స్ చేయడం ద్వారా ఎంబాపె (18 గోల్స్) ఫిఫాలో అత్యధిక గోల్స్ చేసిన ఆల్ టైమ్ ఆటగాళ్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో జర్మనీ దిగ్గజం మిరాస్లావ్ క్లోజ్ (16 గోల్స్) రికార్డును బద్దలుకొట్టాడు. ఇక అర్జెంటీనా స్టార్ మెస్సీ 19 గోల్స్‌తో తొలి స్థానంలో ఉన్నాడు. మెస్సీ రికార్డును సమం చేయడానికి ఒక్క అడుగు దూరంలో ఉన్నాడు.




## ఓటమితో రీఎంట్రీ

**లండన్, జూలై 1:** నాలుగేళ్ల తర్వాత 44 ఏళ్ల వయస్సులో గ్రాండ్‌స్లామ్ బరిలోకి దిగిన టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ రీఎంట్రీ ఓటమితో ప్రారంభమైంది. వైల్డ్ కార్డ్ ఎంట్రీతో వింబుల్డన్‌లో పునరాగమనం చేసిన ఈఅమెరికా స్టార్‌కు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. 23గ్రాండ్‌స్లామ్స్ విజేత సెరెనాపై 20ఏళ్ల ఆస్ట్రేలియా ప్లేయర్ మాయా జాయింట్ 6-3, 6-7, 6-3తో గెలుపొందింది. 44 ఏళ్ల వయస్సులోనూ తన ఆటలో పదును తగ్గలేదని సెరెనా ఈ మ్యాచ్‌లో రుజువుచేసుకుంది. తొలి సెట్‌ను 3-6తో కోల్పోయినా... రెండో సెట్‌లో సెరెనా అద్భుతంగా పుంజుకుని తన టెన్నిస్ కెరీర్ కంటే తక్కువ వయస్సు క్రీడాకారిణిపై పవర్ గేమ్ చాటింది. పోటాపోటీగా సర్వీసులు నిలబెట్టుకుంటూ సెట్‌ను ట్రైబ్రేకర్‌కు తీసుకెళ్లింది. ఇక్కడ మాయా సర్వీసును కొల్లగొడుతూ రెండో సెట్‌ను 7-6తో ముగించి సమవుజ్జీగా నిలిచింది. దీంతో నిర్ణయాత్మక మూడో రౌండ్ మరింత ఉత్కంఠగా సాగుతుందని అభిమానులు భావించారు. కానీ, మాయా దూకుడు ముందు సెరెనా నిలవలేకపోయింది. ఈ మ్యాచ్‌ను సెరెనా కుమార్తె ఒలంపియా ప్రత్యక్షంగా వీక్షి ంచింది.

వింబుల్డన్‌లో సింగిల్స్, డబుల్స్‌లో వైల్డ్‌కార్డ్ పొందిన సెరెనా.. మహిళల డబుల్స్‌లో సోదరి వీనస్ విలియమ్స్‌తో కలిసి బరిలోకి దిగనుంది. ఈ క్రమంలో సెరెనా పేరుతో.. వింబుల్డన్ నిర్వాహకులు ఓ ప్రకటన విడుదల చేశారు. వింబుల్డన్‌లోకి తిరిగిరావడం చాలా ఆనందంగా ఉంది. దీన్ని చాలా మిస్ అయ్యా. మళ్లీ వస్తానని ఎప్పుడూ ఊహించలేదు. ఇక్కడి వాతావరణం అద్భుతంగా ఉంది. బాగా ఆస్వాదించాను. ప్రతిక్షణాన్ని ఎంజాయ్ చేశా అని సెరెనా వెల్లడించింది.

## మెరుపు హాఫ్ సెంచరీలతో చెలరేగిన అభిషేక్, శ్రేయాస్





**చెస్టర్-లీ-స్ట్రీట్, జూన్ 1:** ఇంగ్లాండ్‌తో తొలి టీ20 మ్యాచ్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. మరో వైపు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. తానెదుర్కొన్న రెండో బంతినే కవర్స్ మీదుగా బౌండరీతో ఖాతా తెరిచిన అభిషేక్... ఇంగ్లాండ్ బౌలర్లను ఊచకోత కోశాడు. ఇక డాసన్ బంతికి సిక్స్ బాదాడు. ఇక మహమూద్‌నైతే ఆడుకున్నాడు. వరుసగా 4,6,6తో రెచ్చిపోయాడు. వుడ్ బౌలింగ్‌లోనూ వరుసగా మూడు ఫోర్లు కొట్టాడు. కేవలం 20 బంతుల్లోనే ఆరు ఫోర్లు, మూడు సిక్స్‌లతో మెరుపు హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కెప్టెన్ శ్రేయాస్ బాధ్యతగా ఆడుతూ 38బంతుల్లోనే 4 ఫోర్లతో అర్ధసెంచరీ సాధించాడు.

**సంజూ, ఇషాన్ ఫ్లాప్ షో**

టీ20 ప్రపంచకప్ హీరో సంజూ శాంమ్సన్ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ విఫలమయ్యాడు. సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. ఏడు బంతులు ఎదుర్కొని ఒక పరుగు చేసిన సంజూ.. మహ్మద్ బౌలింగ్‌లో బాంటన్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ఐర్లాండ్ తో రెండు మ్యాచ్‌ల్లో 5, డకౌట్ అయిన సంజూ.. మూడు మ్యాచ్‌ల్లో మొత్తం 6 పరుగులే చేశాడు. ఇక వన్‌డౌన్ బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్ కూడా ఫ్లాప్ షో కొనసాగుతోంది. ఈ మ్యాచ్‌లో ఏకంగా డకౌట్ అయ్యాడు. రెండు బంతికి రన్ తీసే ప్రయత్నంలో రనౌట్‌గా వెనుదిరిగాడు. ఇషాన్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ రనౌటైయ్యాడు. ఇర్లాండ్‌పై 1, 12 పరుగులు చేసిన ఇషాన్.. మొత్తంగా మూడుమ్యాచ్‌ల్లో13రన్స్ చేయగలిగాడు. టాప్‌ఆర్డర్‌లో వీరి ఫెయిల్యూర్ .. టీమిండియాపై ప్రభావం చూపుతోంది.

**వైభవ్‌కు నో ఛాన్స్**

టీమిండియాలోకి దూసుకొచ్చిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి ఈమ్యాచ్‌లోనూ తుది జట్టులో చోటు దక్కలేదు. సంజూ, ఇషాన్ కిషన్‌లలో ఒకరిని తప్పించి వైభవ్‌కు చోటు ఇస్తారని ఆశించిన ఫ్యాన్స్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ నిరాశపరిచింది. సీనియర్ల వైపే మొగ్గు చూపింది. కాగా ఇంగ్లాండ్‌తో తొలి టీ20 కోసం ఏకంగా ముగ్గురు స్పిన్నర్లతో టీమిండియా బరిలోకి దిగింది. స్పిన్ ఆల్‌రౌండర్‌గా అక్షర్ పటేల్‌తో పాటు వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్‌లకు చోటు కల్పించింది.



## వింబుల్డన్‌లో ఒసాకా ఫ్యాషన్స్

**లండన్:** జపాన్ క్రీడాకారిణి నయోమి ఒసాకా.. వింబుల్డన్‌లో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆటతోనే కాకుండా రోజుకో ఫ్యాషన్ డ్రెస్‌తో తళతళమెరుస్తూ హోరెత్తిస్తోంది. తొలిరోజు జపాన్ డాల్‌గా కనిపించిన ఒసాకా...రెండో రోజు మరింత భిన్నంగా డ్రెస్‌తో కోర్టులోకి అడుగుపెట్టింది. ఇక ఆటపరంగా చూస్తే నయోమి ఒసాకా...అలవోకగా మూడో రౌండ్‌లోకి ప్రవేశించింది. రెండో రౌండ్‌లో క్వాలిఫయర్ అనస్టాసియా గుసనోవాపై ఒసాకా 6-3, 6-2తో వరుస సెట్లలో అలవోకగా గెలుపొంది మూడో రౌండ్‌కు చేరుకుంది.

## రెండురోజుల నష్టాలకు బ్రేక్ — లాభాల్లో ర్యాలీ తీసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, జూలై 1:** రెండురోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఆటో, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్షియల్ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు బలంగా ముగిశాయి. ఐటీ షేర్లపై ఒత్తిడి కొనసాగినా నిఫ్టీ మళ్లీ 24 వేల మార్కును దాటింది. గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, పెద్దకంపెనీల షేర్లలో విలువ ఆధారిత కొనుగోళ్లు మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 443పాయింట్లు లాభపడి 76 వేల 922 వద్ద ముగిసింది. నిఫ్టీ 140 పాయింట్లు పెరిగి 24 వేల 5 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ర్యాలీకి ఎటర్నల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రధానంగా మద్దతు అందించాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా స్వల్ప లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా యూరప్ మార్కెట్లు స్వల్పనష్టాల్లో ట్రేడ్ కాగా ఆసియామార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి.




అమెరికాఇరాన్ చర్చలు, యూఎస్ ట్రెజరీ రాబడుల పెరుగుదల, అమెరికా ఉద్యోగ గణాంకాలపై పెట్టుబడిదారులు దృష్టి సారించారు. వాహన విక్రయాల గణాంకాలు విడుదల చేసిన కంపెనీల్లో ఆశోక్ లేలాండ్ దాదాపు 3 శాతం, ఓలా ఎలక్ట్రిక్ 2.6 శాతం, వీఎస్‌టీ టిల్లర్స్, ఎస్కార్ట్స్ కుబోటా షేర్లు కూడా లాభాల్లో ముగిశాయి. స్టీల్ స్ట్రిప్స్ వీల్స్ షేర్ ఏకంగా 7 శాతానికి పైగా ఎగిసింది. అయితే కేపీఐటీ టెక్నాలజీస్ షేర్ భారీగా 16 శాతానికి పైగా పతనమైంది. తొలి త్రైమాసికం మాదిరిగానే రెండో త్రైమాసికంలోనూ ఆదాయం బలహీనంగానే ఉండొచ్చని కంపెనీ అంచనా వేయడంతో పెట్టుబడిదారులు అమ్మకాల బాట పట్టారు. ఫైసాలో డిజిటల్ షేర్ 19 శాతం ఎగిసి పడగా రైట్స్ 12 శాతం, జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్, వీఏ టెక్ వాబాగ్, ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ రెక్టిఫైయర్స్ షేర్లు కూడా లాభాలతో ముగిశాయి. నాక్ ప్యాకేజింగ్ ఐపీఓకు రెండున్నర రెట్లకు పైగా సబ్‌స్క్రిప్షన్ లభించింది.

ఆస్తా స్పింటెక్స్ ఐపీఓకు 4.6 రెట్లకు పైగా స్పందన వచ్చింది. రెండు ఇష్యూలకూ పెట్టుబడిదారుల నుంచి మంచి ఆదరణ లభించింది. రెండు రోజుల నష్టాల తర్వాత మార్కెట్లు బలంగా పుంజుకోవడం పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని నింపింది.

## స్టాక్ మార్కెట్‌లో భారీ కుంభకోణం — 221 మందిపై సెబీ నిషేధం


### రూ.144 కోట్లను వడ్డీతో చెల్లించాలని హుకుం




**ముంబయి, జూలై 1:** భారతీయ స్టాక్ మార్కెట్‌లో సెబీ భారీ మోసాన్ని బయటపెట్టింది. ఐదు లిస్టెడ్ కంపెనీల షేర్లలో ధరలను కృత్రిమంగా పెంచి, అమాయక పెట్టుబడిదారులను మోసం చేసిన భారీ పంప్ అండ్ డంప్ కుంభకోణంపై కఠిన చర్యలు తీసుకుంది. మొత్తం 221 మందిపై మార్కెట్ నిషేధం విధించడంతో పాటు, అక్రమంగా సంపాదించిన రూ.143.79 కోట్లను వసూలు చేయాలని ఆదేశించింది. 2017 నుంచి 2020 వరకు కొనసాగిన ఈ భారీ షేర్ మార్కెట్ మోసానికి హనీఫ్ షేక్ సూత్రధారిగా వ్యవహరించినట్లు సెబీ తన విచారణలో వెల్లడించింది.

మోరియా ఉద్యోగ్, 7ఎన్ఆర్ రిటైల్, డార్జిలింగ్ రోప్‌వే కంపెనీ, జీబీఎల్ ఇండస్ట్రీస్, విశాల్ ఫ్యాబ్రిక్స్ అనే ఐదు లిస్టెడ్ కంపెనీల షేర్లలో కృత్రిమంగా ధరలు, ట్రేడింగ్ పరిమాణాన్ని పెంచినట్లు గుర్తించింది. ఈ మోసంలో 200 మందికి పైగా వివిధ బాధ్యతలు నిర్వహించినట్లు సెబీ గుర్తించింది. ముందుగా కొందరు సమన్వయంతో కొనుగోలు, అమ్మకాల ద్వారా షేర్ ధరలను పెంచి తర్వాత వేలాది మంది రిటైల్ పెట్టుబడిదారులకు భారీ ఎత్తున ఈ షేర్లు కొనండి అంటూ ఎస్ఎంఎస్‌లు పంపించారు. ఇలా అక్రమంగా వచ్చిన నిధులను షెల్ కంపెనీలు, ఫైనాన్షియర్లు, విదేశీ మారక సంస్థల ద్వారా బదిలీ చేసి, చివరకు హనీఫ్ షేక్‌కు చెందిన సంస్థలు లేదా ఆయా కంపెనీల ప్రమోటర్లకు చేరేలా వ్యవస్థ రూపొందించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ వ్యవహారంలో మొత్తం రూ.143.79 కోట్ల అక్రమ లాభాలు ఆర్జించినట్లు అంచనా వేసిన సెబీ, ఆ మొత్తాన్ని 2020 అక్టోబర్ నుంచి సంవత్సరానికి 12 శాతం వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ప్రధాన నిందితుడు హనీఫ్ షేక్‌పై ఏడేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్‌లో నిషేధం విధించడంతో పాటు రూ.10 కోట్ల జరిమానా కూడా విధించింది. ఆతని మరో 5సంస్థలకు ఆరేళ్ల నిషేధం, ఒక్కో సంస్థకు 2కోట్ల జరిమానా విధించింది. మిగిలిన నిందితులపై ఐదేళ్ల వరకు మార్కెట్ నిషేధం విధించడంతో పాటు రూ.5లక్షల నుంచి రూ.1 కోటి వరకు జరిమానాలు విధించింది.

## జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లు




**న్యూఢిల్లీ, జూలై 1:** దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి భారీగా నమోదయ్యాయి. ఈ ఏడాది జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1.94 లక్షల కోట్లు దాటింది. నేడు విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం గతేడాది ఇదే నెలతో పోలిస్తే వసూళ్లు 13.9 శాతం పెరిగాయి. ముఖ్యంగా దిగుమతులపై వచ్చే పన్ను రాబడి గణనీయంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1,94,812 కోట్లుగా నమోదైంది. గత సంవత్సరం జూన్‌లో ఈ మొత్తం రూ.1,71,105 కోట్లుగా ఉంది. ఈపెరుగుదలలో దిగుమతులపై వచ్చే జీఎస్టీ వాటానే అధికం. దిగుమతులపై పన్ను రాబడి ఏకంగా 34.6 శాతం పెరిగి రూ.60,038 కోట్లకు చేరుకుంది. దేశీయ లావాదేవీల ద్వారా సమకూరిన జీఎస్టీ ఆదాయం మాత్రం 6.5 శాతం వృద్ధితో రూ.1,34,774 కోట్లుగా నమోదైంది. దేశీయ వసూళ్ల వృద్ధి రేటు కంటే దిగుమతులపై వసూళ్ల వృద్ధి రేటు ఎక్కువగా ఉండటం గమనార్హం.

రీఫండ్‌ల తర్వాత ప్రభుత్వానికి అందిన నికర జీఎస్టీ ఆదాయం జూన్‌లో 11.2 శాతం వృద్ధితో రూ.1,62,377 కోట్లకు చేరింది. గతేడాది ఇదే నెలలో నికర వసూళ్లు రూ.1,45,984కోట్లుగా ఉన్నాయి. ఈసారి మొత్తం రిఫండ్‌లు కూడా దాదాపు 30 శాతం పెరిగి రూ.32,436 కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో దేశీయ రిఫండ్‌లు 42.9 శాతం పెరిగి రూ.17,767 కోట్లకు చేరగా, ఎగుమతులపై ఐస్‌గేట్ ద్వారా ఇచ్చిన రిఫండ్‌లు 15.6 శాతం పెరిగి రూ.14,669 కోట్లుగా ఉన్నాయి. ఇక, నికర ఆదాయాన్ని విశ్లేషిస్తే దేశీయ లావాదేవీలపై వచ్చిన నికర జీఎస్టీ రాబడి కేవలం 2.6 శాతం మాత్రమే పెరిగి రూ.1,17,007 కోట్లుగా ఉంది. అదే సమయంలో దిగుమతులపై వచ్చిన నికర కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం ఏకంగా 42.2 శాతం పెరిగి రూ.45,370 కోట్లకు చేరింది.

ఇది దిగుమతులపై ఆధారపడి పన్ను వసూళ్లు ఎంతగా పెరిగాయో స్పష్టం చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం గణాంకాలను పరిశీలిస్తే స్థూల జీఎస్టీ వసూళ్లు 8.4 శాతం వృద్ధితో రూ.6,31,699 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే సమయంలో ఈ వసూళ్లు రూ.5,82,542 కోట్లుగా ఉన్నాయి. ఇదే కాలంలో నికర జీఎస్టీ రాబడి7.1శాతం పెరిగి 5,40,218 కోట్లుగా నమోదైంది. మే నెలలో కూడా జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లుగా నమోదవగా, జూన్‌లోనూ అదే స్థాయి వసూళ్లు కొనసాగడం ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు సూచికగా నిపుణులు భావిస్తున్నారు.

## పెట్రోడీజిల్ ధరలు తగ్గించిన నయారా

**ముంబయి, జూలై 1:** దేశవ్యాప్తంగా వాహనదారులకు నయారా ఎనర్జీ భారీ ఊరటనిచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 5, డీజిల్‌పై లీటర్‌కు రూ. 3 చొప్పున కోత విధించింది. దేశవ్యాప్తంగా ఉన్న 7వేలకు పైగా నయారా రిటైల్ ఔట్‌లెట్లలో తగ్గిన ధరలు తక్షణమే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం, కీలకమైన సముద్రమార్గాలు తిరిగి తెరుచుకోవడంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలోనే నయారా ఎనర్జీ ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రాల వారీగా ఉండే వ్యాట్ వంటి స్థానిక పన్నుల కారణంగా తుది రిటైల్ ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. నయారా ధరలను తగ్గించినప్పటికీ, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు మాత్రం పాత ధరలనే కొనసాగిస్తున్నాయి. దేశంలోని 90 శాతానికి పైగా ఇంధన మార్కెట్‌ను నియంత్రించే ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ తమ ధరలలో ఎటువంటి మార్పు చేయలేదు.







## ఇండిగో లైట్ పేరుతో కొత్త టికెట్ ఛార్జీలు

**ముంబయి, జూలై 1:** దేశీయ పౌర విమానయాన సంస్థ ఇండిగో లోబడ్జెట్‌లో ప్రయాణించాలనుకునే సాధారణ ప్రజల కోసం కొత్త ఛార్జీలతెచ్చింది. హ్యాండ్ బ్యాగ్ లేదా క్యాబిన్ లగేజ్‌తో మాత్రమే ప్రయాణించే వారి కోసం "ఇండిగో లైట్" పేరుతో ఓఎకానమీ క్లాస్ ఛార్జీల కేటగిరిని ప్రవేశపెట్టింది. లగేజీ రహిత ప్రయాణికులకు విమాన టికెట్ ఛార్జీలపై మరింత రాయితీ కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈ ప్రత్యేక సదుపాయం ద్వారా లభించే విమాన టికెట్ల బుకింగ్స్ నేటి నుంచే ప్రారంభం అయ్యాయి కూడా. ప్రయాణికులు ఈ టికెట్లతో జూలై 15వ తేదీ నుండి ప్రయాణాలు సాగించవచ్చని ఇండిగో యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. ఇండిగోకు చెందిన అధికారిక వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్, నేరుగా కాల్‌సెంటర్ వంటి అధికారిక యాక్సెస్ మార్గాల ద్వారా టికెట్ బుక్ చేసుకునే వారికి మాత్రమే ఇండిగో లైట్ ప్రయోజనాలు దక్కుతాయి. డొమెస్టిక్ తో పాటు అంతర్జాతీయ నాన్ స్టాప్ విమాన ప్రయాణాలన్నింటికీ ఈ విధానం వర్తిస్తుంది. ఈ సదుపాయాన్ని వన్ వే, రౌండ్ ట్రిప్, మల్టీసిటీ బుకింగ్‌లకు కూడా సమానంగా వర్తింపజేసుకోవడం ఇండిగో లైట్ ఛార్జీల ప్రత్యేకత. పెద్దలతో పాటు పిల్లల టికెట్లకు కూడా ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది.

## వాట్సాప్‌లో నంబర్‌లేకుండా యూజర్‌నేమ్ సెట్టింగ్ — ప్రమాదకరం అని హెచ్చరిస్తున్న కేంద్రం




**న్యూఢిల్లీ, జూలై 1:** వాట్సాప్‌లో త్వరలో యూజర్ నేమ్ పేరుతో కొత్త ఫీచర్ రాబోతోంది. ఇకపై యూజర్లు తమ నెంబర్ కనిపించకుండా యూజర్ నేమ్ సెట్ చేసుకోవచ్చు. ఫోన్ నెంబర్ షేర్ చేయకుండా యూజర్ నేమ్ ద్వారా ఇతరులతో చాట్ చేయవచ్చు. ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న ఈ ఫీచర్‌పై కేంద్రం దృష్టి సారించింది. ఈ ఫీచర్ ఎంత వరకు ప్రమాదకరమో పరిశీలిస్తోంది.

కొత్త ఫీచర్ ద్వారా ఏమైనా ఆన్‌లైన్ మోసాలకు అవకాశం ఉందా, యూజర్ నేమ్‌ల ద్వారా ఇతర యూజర్లకు ఎలాంటి సేఫ్టీ ఉంటుంది, తప్పుడు సమాచారం చేరవేసేందుకు ఉన్న అవకాశాలు వంటి అంశాల్ని పరిశీలించనుంది. ఈ ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం సమీక్షించిన తర్వాతే దీనికి అనుమతి లభిస్తుంది. ఈ కొత్త ఫీచర్ ఈ ఏడాది చివరి నుంచి అందుబాటులోకి రానుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ఇతర సోషల మీడియా యాప్‌లలో ఉండే యూజర్ నేమ్‌లలాగే పని చేస్తుంది. ఇందుకోసం యూజర్లు తమ యూజర్ ఐడీని రిజర్వ్ చేసుకునే అవకాశం కూడా ఉంది. దీనిపై యూజర్లకు వాట్సాప్ సమాచారం కూడా ఇస్తోంది. ఈ కొత్త ఫీచర్ వల్ల ప్రయోజనాలతోపాటు ఇబ్బందులు కూడా ఉంటాయి. ఎవరితో నైనా తాత్కాలికంగా చాట్ చేయాల్సి వచ్చినప్పుడు ఫోన్ నెంబర్‌తో పని లేకుండా యూజర్ నేమ్ ద్వారానే చాట్ చేయవచ్చు. ఇతరులు కూడా అలాగే, చాట్ చేస్తే వారి ఒరిజినల్ నెంబర్ గుర్తించడం కష్టం. కొత్త ఫీచర్ అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఇప్పటికే ఉన్న బ్లాక్, అన్‌నోన్ కాలర్స్ సైలెన్సింగ్ వంటి ఫీచర్లు కొనసాగుతాయి. యూజర్ నేమ్ 3 నుంచి 35 అక్షరాల వరకు ఉండొచ్చు. ఇంగ్లీష్‌లో ఏ టు జడ్ 09 వరకు అంకెలు, డాట్, అండర్‌స్కోర్ మాత్రమే వాడుకోవచ్చు. యూజర్ నేమ్ ఇతరులు యాక్సెస్ చేయాలంటే నాలుగు అంకెలతో ఒక కీ కూడా సెట్ చేసుకోవాలి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

రాజమహేంద్రవరం | గురువారం 02 జులై 2026 | I



# దేవస్థానంలో సిబ్బంది రెండవ విడత అంతర్గత బదిలీలు

## ముగ్గురు సూపరింటెండెంట్లతో సహా 8 మందికి స్థానచలనం,

**శంఖవరం (అన్నవరం), ,జులై - 01. ప్రభాతవార్త** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సిబ్బందిని రెండవ విడత అంతర్గత బదిలీలు (విభాగాల మార్పు) చేస్తూ ఈమేరకు ఈఓ నల్లం సూర్య చక్రధరరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేసారు. జూన్ 25 తేధీన వివిధ కేటగిరీలకు చెందిన మొత్తం 44 మందిని అంతర్గత బదిలీలు చేయగా, ప్రస్తుతం ముగ్గురు సూపరింటెండెంట్లతో సహా 8 మందిని అంతర్గత బదిలీ చేపట్టారు.వీరిలో ప్రస్తుతం స్వామివారి నిత్యన్నదానం సూపరింటెండెంట్ గా ఉన్న పర్చూరి కృష్ణప్రసాద్ ను ఆలయ విభాగానికి, ప్రసాదం తయారీ విభాగం (భూతాధి) సూపరింటెండెంట్ గా ఉన్న జాజిమొగ్గల రామకృష్ణను అక్కౌంట్స్ విభాగానికి, సి-సెక్షన్ సూపరింటెండెంట్ గా ఉన్న పప్పుల వెంకట రమణకు అదనంగా ప్రసాదం తయారీ విభాగం (భూతాధి) కేటాయిస్తూ ఈఓ ఉత్తర్వులు జారీ చేసారు.మిగతా ముగ్గురిలో ఒకరు సీనియర్ అసిస్టెంట్, నాల్గవ స్థాయి ఉద్యోగిని, మరో ముగ్గురు ఫిక్సిడ్ పే ఉధ్యోగులు ఉన్నారు.

# ఏడువారాల వెంకన్నకు అష్టోత్తర, నిత్య కళ్యాణం..

## అశేష సంఖ్యలో భక్తులు..





**ఆత్రేయపురం, జూలై 01,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికీ బుధవారం వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ, పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు లు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.

# లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న కలెక్టర్



**రంపచోడవరం, జూలై 1: (ప్రభాతవార్త)** రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు చేపట్టడం జరిగిందనీ పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. బుధవారం రంపచోడవరం మండలంలోని గోపవరం, ఫోక్స్ పేట గ్రామాలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులు,వితంతువులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులతో కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి,సంక్షేమ పథకాల అమలుపై ఆయన అడిగి తీసుకొని పింఛను అందజేశారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మొదటి తేదీనే ఇంటి వద్దకే పింఛన్ అందించే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. పింఛన్ పంపిణీలో ఎలాంటి జాప్యం లేదా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. పింఛన్ లబ్ధిదారులు ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. ప్రతినెల రేషన్ సకాలంలో అందుతున్నది లేనిది ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా పింఛన్ డబ్బులకు లంచాలు అడుగుతున్నది లేనిది ఆయన ఆరా తీశారు. ఎవరు అడిగినా డబ్బులు ఇవ్వవద్దని మీ వ్యక్తిగత ఖర్చులకు మీ కుటుంబ పోషణ అవసరాల కొరకు ఉపయోగించుకోవాలని ఆయన అన్నారు. ఏమైనా సమస్యలు ఉన్న యెడల సంబంధిత అధికారులకు సంప్రదించాలని ఆయన అన్నారు.

# ద్రాక్షారామంలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ..దుకాణాల దగ్ధంపై సమీక్ష
## రైతులకు సేంద్రియ సాగు దిశగా సూచనలు





**రామచంద్రపురం,జూలై 01(ప్రభాతవార్త):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ బుధవారం రామచంద్రపురం మండలం ద్రాక్షారామంలో విస్తృతంగా పర్యటించారు. సంక్షేమం, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు కార్యక్రమాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సంఘం కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ భరోసాసామాజిక భద్రతా పింఛన్లను కలెక్టర్ స్వయంగా పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి వారి అవసరాలు,సమస్యలనుం తెలుసు కున్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ సక్రమంగా చేరేలా చర్యలు కొనసాగించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

**అగ్నిప్రమాద స్థల పరిశీలన..క్రీడా మౌలిక వసతులపై దృష్టి**

ఇటీవల మార్కెట్ యార్డ్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన 48 దుకాణాలను కలెక్టర్ పరిశీలించారు.ఘటనకు సంబంధించిన వివరాలు,నష్టాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధిత వ్యాపారులకు తక్షణ సహాయ చర్యలు చేపట్టేలా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు.ద్రాక్షారామం ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియాన్ని పరిశీలించిన కలెక్టర్,భవన పరిస్థితి,వసతుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.అవసరమైన మరమ్మతులు,అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని సూచించారు.

**ఎరువుల పంపిణీ వ్యవస్థపై సమీక్ష**

పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్,ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ విధానాన్ని పరిశీలించారు.స్టాక్ రికార్డులు,భౌతిక నిల్వలను తనిఖీ చేశారు.రైతులకు అవసరమైన యూరియా సహా అన్ని ఎరువులు ప్రభుత్వం ద్వారా నిరంతరంగా అందుబాటులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.భూసారాన్ని కాపాడేందుకు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని రైతులకు సూచించారు.ఎరువుల పంపిణీలో ఎలాంటి అపోహలు తలెత్తకుండా వ్యవసాయ శాఖ అధికారులు,సచివాలయ వ్యవసాయ సహాయకులు సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో రెవెన్యూ,వ్యవసాయ శాఖల అధికారులు,సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# భాష్యం లో జాతీయ వైద్యుల దినోత్సవం.....



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై1,ప్రభాతవార్త.** జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు పిఠాపురం భాష్యం స్కూల్లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పిఠాపురానికి చెందిన ప్రముఖ సీనియర్ గైనకాలజిస్టు డా.సి. హెచ్. వరలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా డా. వరలక్ష్మి మాట్లాడుతూ, వైద్య వృత్తి సేవా భావానికి ప్రతీక అని, ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. డా. బిధాన్ చంద్ర రాయ్ దేశ వైద్య రంగ అభివృద్ధికి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేసిన సేవలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. జోనల్ ఇంచార్జ్ పి.వేణు మాట్లాడుతూ డా.బిధాన్ చంద్ర రాయ్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ వైద్యుల దినోత్సవం జరుపుకుంటామని పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న పురస్కార గ్రహీత అయిన డా. బిధాన్ చంద్ర రాయ్ వైద్య రంగానికి,ప్రజాసేవకు చేసిన విశిష్ట సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా ఈస్ట్ ఫోర్ జెడ్ ఈవో పి వేణు గుర్తు చేశారు.చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో ఆరోగ్యం పై అవగాహన, పరిశుభ్రత అలవాట్లు,మానవతా విలువలు పెంపొందించుకోవాలని సూచించారు.విద్యార్థులు వైద్యుల వేషధారణలో ఆకట్టుకునే ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు వైద్యుల సేవలను కొనియాడుతూ అందరినీ అలరించారు. ప్రిన్సిపల్ అంజి రెడ్డి,ప్రైమరీ హెచ్ఎం అరుణ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు మరియు పాఠశాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని జాతీయ వైద్యుల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# ఏపీ ఈఏపీసెట్-2026లో తిమ్మాపురం విద్యార్థి ప్రతిభ

## 4వ ర్యాంకు సాధించిన కర్రి సత్యనారాయణ

**కాకినాడ రూరల్, జూలై 1( ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాల్లో కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన విద్యార్థి కర్రీ సత్యనారాయణ 4వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబరచడం పట్ల తల్లిదండ్రులు కర్రి వెంకట రాజు సుజాత దంపతులు, బంధువులు,కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో సత్యనారాయణ 144 మార్కులతో అత్యుత్తమ ర్యాంకు సాధించడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. పట్టుదలతో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై పలువురు విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



# ఎన్టీఆర్ భరోసా" పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు.



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై1,ప్రబాతవార్త.** ఉప్పలగుప్తం మండలం, వానపల్లిపాలెం గ్రామంలో బుధవారం జరిగిన ఎన్టీఆర్ భరోసా" పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అమలాపురం నియోజకవర్గ శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవ్వాతాతలు, అక్కాచెల్లెమ్మల ముఖాల్లో ఆనందం చూడటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఈ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పెంచి, గౌరవప్రదంగా అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేరడమే మన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# కోలుకుంటున్న ముద్రగడ పద్మనాభం

## వైద్యులు, యాజమాన్యంతో నిరంతరం మాట్లాడుతున్న వైఎస్ జగన్



**ప్రత్తిపాడు, జూలై 1 (ప్రభాతవార్త)** మాజీ మంత్రి వైసీపీ పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని, ఆయన అనారోగ్యం నుండి నెమ్మదిగా కోలుకుంటున్నారని ఆయన తనయుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, అభిమానుల ఆశీస్సులతో రోజురోజుకూ ఆయన ఆరోగ్యం మెరుగవుతోందని పేర్కొన్నారు. తన తండ్రి ?ముద్రగడ ఆసుపత్రిలో చేరినప్పటి నుండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముద్రగడ కుటుంబానికి కొండంత అండగా నిలిచారని గిరిబాబు కృతజ్ఞతలు తెలిపారు. జగన్ ప్రతిరోజూ ముద్రగడ గారి ఆరోగ్య వివరాలను ఫోన్ ద్వారా అడిగి తెలుసుకుంటున్నారని ఆసుపత్రి యాజమాన్యం పార్థసారథి గారితో పాటు, చికిత్స అందిస్తున్న డాక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడి అప్‌డేట్స్ తీసుకుంటున్నారని వివరించారు. ఇదే సమయంలో అమెరికా నుండి వచ్చిన వైద్య నిపుణులు దత్తాత్రేయులు కూడా ముద్రగడ చికిత్స విషయంలో ప్రత్యేకంగా సహకరిస్తున్నట్లు వెల్లడించారు. ?ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అభిమానులు, పార్టీ శ్రేణులు ఎవరూ ఆసుపత్రికి రావద్దని ముద్రగడ గిరిబాబు మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేశారు. "నాన్నగారితో పాటు ఆసుపత్రి ఐసీయూ లో ఎంతో మంది ఇతర రోగులు కూడా చికిత్స పొందుతున్నారు. అక్కడ ఇన్ఫెక్షన్ల భయం ఉంటుంది. ఇతర రోగులకు, ఆసుపత్రి సిబ్బందికి ఇబ్బంది కలగకుండా అందరూ సహకరించాలి" అని కోరారు. తన తండ్రి పూర్తిగా కోలుకున్నాక, తామే స్వయంగా జగన్ మోహన్ రెడ్డి ని కలవడానికి వెళ్తామని లేదా ఆయనే స్వయంగా వచ్చి పరామర్శిస్తారని గిరి పేర్కొన్నారు. కష్టసమయంలో తమకు తోడుగా నిలిచిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి ముద్రగడ కుటుంబం తరఫున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సింధు ఆసుపత్రిలో చికిత్స ముద్రగడ పద్మనాభం ను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిల్ సభ్యులు గోరుముచ్చు గోపాల్ యాదవ్ ముద్రగడ ఆరోగ్యం పరిస్థితిని అడిగి తెలుసుకుని పరామర్శించారు. గిరిబాబుకు పార్టీ అండగా ఉంటుందని గిరిబాబుకు గోపాల్ యాదవ్ ధైర్యం చెప్పారు.

# ప్రభుత్వ లక్ష్యలను ఐసి డీ ఎస్ ద్వారా చేరువ కావాలి

## ఎమ్మెల్యే చిన రాజప్ప



**పెద్దాపురం, జులై 01(ప్రభాత వార్త )** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడి కేంద్రాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నందున లక్ష్యాన్ని సాధించేందుకు అంగన్వాడీలు మంచి సేవలు అందించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. ఐసిడిఎస్ సిడిపిఓ ఉష ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్ల కు నియామక ఉత్తర్వులు అందించిన సందర్భంగా బుధవారం పెద్దాపురం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కొత్తగా విధుల్లో చేరుతున్న ప్రతి ఒక్కరు అంకిత భావంతో సేవలు అందించాలని ఆయన పేర్కొన్నారు.నియోజకవర్గంలో ఒక అంగన్వాడీ వర్కర్ పోస్ట్, 22 హెల్పర్ పోస్ట్ లకు సంబంధించి ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూరిబాబు రోజు మాట్లాడుతూ అంగన్వాడీలకు వచ్చే పౌష్టికాహారాన్ని చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు కచ్చితంగా అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నిమ్మకాయల రంగనాగ్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్,అడబాల కుమారస్వామి,నూనె రామారావు,బలుసు వాసు,ఎలిశెట్టి నాని,రేలంగి వెంకట్రావు,తదితరులు పాల్గొన్నారు

# ఐఐటి మెడికల్‌లో మెరిసిన తిరుమల

## ఆరో ర్యాంకు కైవలం







**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై1,ప్రభాతవార్త.** ఐఐటి మెడికల్ అకాడమీలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం తిరుమల విజయ దంఖా మ్రోగించింది. తమ విద్యార్థులు ఆరవ ర్యాంకు సాధించినట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమల రావు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన ఏపీ ఈ ఏ పీ సి ఇ టి ఇంజనీరింగ్ మెడికల్ ఫార్మసీ విభాగాలలో తమ విద్యార్థులు గొప్ప ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు అగ్రికల్చర్ విభాగంలో పల్లికొండ ధర్మ తేజ స్టేట్ ఆరో ర్యాంకును, ఎడ్లూరి కృష్ణ చైతన్య 11 వ ర్యాంకును, కురుమెల్ల విష్ణు మిహిర్ 18 వ ర్యాంకును పలివెల ప్రణవ్ సాయి గణేష్ 22 ను, బూరుగుపల్లి శ్రీ సాయి భవ్య 25వ ర్యాంకును, వంగపండు ఉదయ రిషిత 36వ ర్యాంకులు ,అద్దేపల్లి కార్తికేయ నందన్ 37వ ర్యాంకును నరుకుల పూజిత 45వ ర్యాంకునుకైవసం చేసుకున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో దేవ శ్రీ వేద 30వ ర్యాంకును, వదిలం వెంకట నాగ సూర్య ధావన్ 50వ ర్యాంకును ,గొల్ల వైభవ్ తేజ 66 వ ర్యాంకును, గన్నమనీడి వాత్సల్య 69 వ ర్యాంకును, బొర్రా బాను కౌశిక్ 83 వ ర్యాంకును, పసల సూర్య మనోహర్ 88 వ ర్యాంకును, గోపిశెట్టి మోనిష 91వ ర్యాంకును, చల్లపల్లి రుచిత్ సాయి99 వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఇంజనీరింగ్ అగ్రికల్చర్ కలిపి వందలోపు 22 మంది 500 లోపు 163 మంది 1000 లోపు 340 మంది 2000 లోపు 714 మంది 5000 లోపు 1619 మంది 10000 లోపు 2633 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని తిరుమల రావు తెలిపారు. ఈ విజయాలకు కారణమైన అధ్యాపకులను విద్యార్థులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు







# ఉద్రిక్తంగా మారిన పిఠాపురం

## యూట్యూబర్ 'ప్రశ్న రావణ్' ను అదుపులోకి తీసుకున్న పిఠాపురం పోలీసులు



**యు.కొత్తపల్లి, (పిఠాపురం) జూలై 1 (ప్రభాతవార్త):** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాధా మనోహర్ దాస్ పై ఇటీవల ఏలూరు బహిరంగ సభలో యూట్యూబర్ ప్రశ్న రావణ్ అనుచిత వ్యాఖ్యలు చేసారంటూ పిఠాపురం జనసేన నాయకుడు బొజ్జా కుమార్ ఇచ్చిన ఫిర్యాదు పై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రశ్న రావణ్ ను అరెస్టు చేశారు. పిఠాపురం టౌన్ పోలీస్టేషన్ లో విచారించారు. విచారణ అనంతరం రావణ్‌ను జిల్లా కోర్టులో హాజరుపరచాలని పోలీసులు ప్రయత్నించారు. పిఠాపురం పోలీస్ స్టేషన్ నుంచి వైద్య పరిక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించబోతుండగా జనసేన నాయకులు భారీ సంఖ్యలో చేరుకుని ఆందోళనకు దిగారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు క్షమాపణలు చెప్పిన తరువాతే తరలించాలని డిమాండ్ చేసారు. అయితే రావణ్ కు మద్దతుగా మరో వర్గం ఆందోళనకు రావడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. 24 గంటల లోపు న్యాయమూర్తి హాజరు పరచాలని పోలీసులు ప్రయత్నాలు చేసారు. పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొనడంతో అదనపు బలగాలను మోహరించారు. దీంతో ఏం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం అవుతుంది. రావణ్ ను పోలీసులు న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. ఈ ఉద్రిక్తత సమయంలో జడ శ్రావణ్ కుమార్ పిఠాపురం చేరుకున్నారు.

# వైద్యం..విద్య...శాంతిభద్రతలకే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత

## ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం అర్బన్, జూలై1, (ప్రభాతవార్త)** ప్రతి నియోజకవర్గ అభివృద్ధికి వైద్యం, విద్య, శాంతిభద్రతలు అనే మూడు అంశాలు అత్యంత కీలకమని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడు రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అత్యంత గొప్ప సంక్షేమ కార్యక్రమమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క సీఎంఆర్ఎఫ్ చెక్కు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. 2019 నాటికి పెండింగ్‌లో ఉన్న 23 దరఖాస్తులను కూడా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలు, రాజకీయాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో మొత్తం 686 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ సహాయం అందిందన్నారు. మొత్తం సహాయం రూ.5,69,91,934 అని వెల్లడించారు. అంతకుముందు 596 చెక్కుల ద్వారా రూ.5,07,81,071 పంపిణీ చేశామని తెలిపారు. ఈ రోజు 87 చెక్కులు, 3 ఎల్ఓసీలు కలిపి రూ.62,10,863 విలువైన సహాయం అందజేశామని చెప్పారు. ఇంకా 83 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, వాటి విలువ రూ.1,12,54,954 అని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎన్టీఆర్ వైద్యసేవ పరిధిలోకి రాని పేదలను కూడా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటోందని చెప్పారు. ప్రజల భద్రతే ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడే బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ ఆగడాలను అరికడతామని చెప్పామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 120 మందికి పైగా రౌడీషీట్లు తెరిచామని, 21 మందిపై పీడీ యాక్టు నమోదు చేశామని, గంజాయి వ్యాపారులపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నామని, సారా మాఫియాపై ఉక్కుపాదంతో వ్యవహరిస్తున్నామని తెలిపారు.అలాగే యాసిడ్ పురుగు విషయంలో ప్రజలు అవసరానికి మించి భయపడవద్దని ఎమ్మెల్యే సూచించారు. తనకు గతంలో ఈ పురుగుతో అనుభవం ఉందని చెబుతూ, దానిని నలిపితే మాత్రమే ద్రవం విడుదలై చర్మంపై మంట కలుగుతుందని, నలపకుండా దులిపేస్తే ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. అవసరమైతే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం 90 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలన ధ్యేయంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ...

## -గ్రామాలు, ఇంటి పరిశుభ్రంగా ఉండాలి...మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు.



**ఆత్రేయపురం, జూలై 01,(ప్రభాత వార్త)** పేదరిక నిర్మూలన ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పింఛన్లు అన్ని వర్గాలవారికి ఆపన్న హస్తంగా మారిందని మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు (బాబు) అన్నారు. మండలంలోని 17 గ్రామాల్లో శాసనసభ్యులు బండారు సత్యానంద రావు ఆదేశాల మేరకు తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ కుమార్, సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి సత్యనారాయణ లు ఆధ్వర్యంలో తాడిపూడి, వెలిచేరు, ఉచ్చిలి గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం లో ఆయన పాల్గొని పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ లు అన్ని వర్గాల పేదలకు,వితంతువులకు, దివ్యాంగులకు పెంచెన్లు ప్రతి నెల ఒకటో తేదీన అందేలా చెయ్యడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడిపూడి గ్రామ టిడిపి అధ్యక్షులు కూసంపూడి రమేష్ రాజు, వెలిచేరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది గంటా శివరామకృష్ణ, వరద సూరిబాబు, కొప్పుల సత్యనారాయణ, నాగిరెడ్డి రామకృష్ణ, వెలిచేరు గ్రామ టిడిపి అధ్యక్షులు కవల సత్తిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం తాడిపూడి, వెలిచేరు గ్రామ పంచాయతీ నందు ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. మండల టిడిపి అధ్యక్షులు మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతకు డ్రైనేజీ వ్యవస్థ ప్రతి వీధిలో చెత్త సదారాలను పరిశుభ్రంగా చేయాలని ఎక్కడ ఏ వీధిలోని నీటి నిలువలు లేకుండా దోమలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రముఖ వైద్యులు గంధం రామంకు ఘన సత్కారం



**అమలాపురం కలెక్టరేట్, జులై 1 ప్రభాతవార్త** జులై 1వ తేదీ వైద్యుల దినోత్సవం సందర్భంగా అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో గోఖలే వీధిలో గల లక్ష్మీ నర్సింగ్ హోమ్ నందు ప్రముఖ వైద్యులు, అమలాపురం ఏరియా హాస్పిటల్ రిటైర్డ్ సూపరిండెంట్ డాక్టర్ గంధం రామం చేసిన వైద్య సేవలకు కృతజ్ఞతలతో ఆయన్ని ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో వైద్యుల పాత్ర మరువలేనిదని, అమూల్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గోటేటి లక్ష్మి, కోశాధికారి కంకటాల విజయలక్ష్మి, గోటేటి గంగాధరరావు, పుత్సా కృష్ణ కామేశ్వర్, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, డాక్టర్ ఉప్పుగంటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యో నారాయణో హరి అడ్డతీగల సీహెచ్‌సీలో ఘనంగా డాక్టర్స్ డే




**అడ్డతీగల, జూలై 1, ప్రభాతవార్త** సామాజిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక కౌన్సిలర్ వాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమాజానికి వైద్యులు అందిస్తున్న నిస్వార్థ సేవలను పలువురు ప్రత్యేకంగా కొనియాడారు. ముందుగా వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రి ప్రాంగణంలో వైద్య బృందం సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం నిరంతరం రోగుల సేవలో తరిస్తూ, ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడుతున్న ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అనూష, డాక్టర్ హర్ష, డాక్టర్ మస్తాన్, డాక్టర్ ప్రసన్న దేవి, డాక్టర్ రేష్మ సుల్తానా, మరియు డాక్టర్ ఎస్. రామలక్ష్మి నారాయణలను శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించారు. అదేవిధంగా, సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ రెడ్డి అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ప్రముఖ సామాజిక కార్యకర్త సత్తి బాబు గారు ఆయనను శాలువాతో సత్కరించి, ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వాసు మరియు రామకృష్ణ మాట్లాడుతూ, సమాజంలో ప్రాణదాతలైన వైద్యుల సేవలు ఎంతో వెలకట్టలేనివని, అహర్నిశలు రోగుల ఆరోగ్యం కోసం నిస్వార్థంగా శ్రమిస్తున్న వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలపడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ ఘన సన్మాన కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, ఇతర వైద్య సిబ్బంది మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# గొండోలు గ్రామంలో పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ



**అడ్డతీగల,జులై 1, ప్రభాత వార్త** అడ్డతీగల మండలం గొండోలు గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్, మండల పార్టీ అధ్యక్షుల ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గొండోలు గ్రామానికి చెందిన ఏడిది వీర్రాజు భార్య ఏడిది పాపయమ్మకు, అలాగే రాజానగరం గ్రామానికి చెందిన మిడతాడి కన్నబ్బాయి భార్య మిడతాడి లక్ష్మికి కొత్త వితంతు పెన్షన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వై. రత్నకుమారి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి కారు నాగరాజు, గొల్లె నిశాంత్, బూత్ ఇన్‌చార్జి కంభం రామారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు చల్ మూర్తి, వీరపురెడ్డి, చింతోజి వీరభద్రరావు, బీజేపీ నాయకుడు బాతు శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్టేట్ ర్యాంకులకు ఆసా సత్కారం...



**సఖినేటిపల్లి/ మలికిపురం జూలై 1, ప్రభాత వార్త:** కోనసీమ జిల్లా లో2026 ఇంటర్ బెటర్మెంట్ ఫలితాల్లో జూనియర్ ఇంటర్ లో 467/470 మార్కులతో స్టేట్ తృతీయా ర్యాంక్, జిల్లా మొదటి ర్యాంక్ సాధించిన సాయి దీప్తి, జూనియర్ కళాశాల విద్యార్థిని గిడుగు ఐశ్వర్య లక్ష్మి తల్లిదండ్రులను ఆసా (ఆల్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్) స్థాపకులు పోలిశెట్టి గణేష్ దండ శాలువా తో సన్మానించి సత్కరించారు. గణేష్ మాట్లాడుతూ కష్టపడి చదివే విద్యార్థులకు తను ఎప్పుడూ అండగా నిలబడి ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ యాజమాన్యం, ప్రిన్సిపల్ అధ్యాపకులు కూడా పాల్గొని విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

# గ్రామసభలు సమస్యల పరిష్కారానికి దోహదం

## -- తాసిల్దార్ బి.ఎమ్. ముక్తేశ్వరరావు



**రావులపాలెం, జూలై 01(ప్రభాతవార్త) :** గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి గ్రామసభలు ఎంతో ఉపయోగపడతాయని రావులపాలెం తాసిల్దార్ బి.ఎమ్. ముక్తేశ్వరరావు తెలిపారు. వార్షిక గ్రామసభలలో భాగంగా బుధవారం రావులపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల్లో ఆమోదించే ప్రతిపాదనలు, అభివృద్ధి పనుల అమలుకు మార్గం సుగమం చేస్తాయని చెప్పారు. స్వర్ణ పంచాయతీ కార్యక్రమం ద్వారా గ్రామంలో పారదర్శకంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. గృహ నిర్మాణాల విషయంలో లబ్ధిదారులకు అధికారులు, సిబ్బంది పూర్తి సహకారం అందించాలని, నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురిచేయరాదని జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, సీనియర్ టీడీపీ నేత గుత్తుల పట్టాభిరామయ్య సూచించారు. హైవేపై ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో డివైడర్ మూసివేత వల్ల ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి అనుకూలంగా చర్యలు తీసుకునేలా గ్రామసభలో తీర్మానం చేయాలని తోట చంద్రశేఖర్ కోరారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి ఎల్. దుర్గాప్రసాద్ పంచాయతీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాసరావు, కూటమి నాయకులు గ్రామ పంచాయతీ సిబ్బంది, స్వర్ణ గ్రామం ఉద్యోగులు, అంగన్‌వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకం బీటీ రోడ్డు నిర్మాణం.....



**సఖినేటిపల్లి జూలై 1, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, టేకిశెట్టిపాలెం గ్రామంలో సుమారు కోటి 1.5 లక్షల రూ.ల వ్యయంతో ప్రధానమంత్రి జన జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ పథకంలో ఏటుకట్టుపై బీటీ రోడ్డు నిర్మాణము నాశరకంగా పనులు నిర్వహిస్తున్నారని, ప్రమాణాలను తుంగలోపు తొక్కుతున్నారని, కాలవలో పూడికలు తొలగించిన మట్టిని, ఏటుగట్టు ప్రక్కన ఉన్న మట్టిని తీసి రోడ్డు నిర్మాణంలో వినియోగిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. టేఖిశెట్టిపాలెం లోజరిగిన గ్రామ సభలో గ్రామ ఇన్చార్జ్ తహసిల్దార్ కృష్ణంరాజు కు వినతిపత్రం అందించారు. ఎంపీటీసీ లింగోలు మహాలక్ష్మి, జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మాలే శ్రీనివాస నగేష్, తెలుగుదేశం గ్రామ శాఖ అధ్యక్షులు ఆదిమూలం వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ గెడ్డం పేర్రాజు, నాయకులు కటికిరెడ్డి మహేష్, రావూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురంలో ఘరానా మోసం

## -వృద్ధుడిని బురిడీ కొట్టించి రూ. 20 వేలు కాజేసిన కేటుగాడు!

**పెద్దాపురం, జులై 01(ప్రభాత వార్త )** సాంకేతికతపై అవగాహన లేని అమాయకులే లక్ష్యంగా కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. సాయం చేస్తామంటూ నమ్మించి, ఏటీఎం కార్డులు మార్చేసి నగదు అపహరిస్తున్న ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో ఇటువంటి ఘోరమైన మోసం ఒకటి వెలుగుచూసింది. ఓ వృద్ధుడి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న గుర్తుతెలియని కేటుగాడు రూ. 20 వేలు నగదును కాజేశాడు. అసలేం జరిగిందంటే..పోలీసులు బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దాపురం పట్టణంలోని స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ బి ఐ ) ఏటీఎం కేంద్రానికి ఓ వృద్ధుడు నగదు ఉపసంహరణ కోసం వచ్చాడు. అయితే, ఏటీఎం మిషన్ ఆపరేట్ చేయడం అతనికి కాస్త ఇబ్బందిగా మారింది. సరిగ్గా అదే సమయంలో అక్కడికి వచ్చిన ఒక గుర్తుతెలియని వ్యక్తి... "నేను సహాయం చేస్తాను తాతా" అంటూ వృద్ధుడిని నమ్మించాడు. బాధితుడి నమ్మకాన్ని గెలుచుకున్న ఆ కేటుగాడు, చకచకా ఏటీఎం పిన్ నంబర్‌ను చూసేశాడు. ఆపై వృద్ధుడి దృష్టి మరల్చి, క్షణాల వ్యవధిలోనే ఒరిజినల్ ఏటీఎం కార్డు స్థానంలో వేరే నకిలీ కార్డును అతనికి చేతికి ఇచ్చాడు. ఆ తర్వాత వృద్ధుడు అక్కడి నుంచి వెళ్ళిపోగానే, అతని ఖాతా నుండి ఏకంగా రూ. 20 వేలు నగదును డ్రా చేసుకుని పరారయ్యాడు. కాసేపటికి మొబైల్ ఫోన్‌కు వచ్చిన మెసేజ్ చూసుకున్న వృద్ధుడు, తాను మోసపోయానని గ్రహించి లబోదిబోమన్నాడు. సీసీటీవీలో రికార్డు అయిన దృశ్యాలుబాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పెద్దాపురం పోలీసులు ఏటీఎం కేంద్రంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. ఈ విచారణలో నిందితుడు వృద్ధుడిని మోసం చేస్తున్న దృశ్యాలు స్పష్టంగా రికార్డయ్యాయి. పోలీసుల విజ్ఞప్తి:సీసీటీవీ విజువల్స్ ఆధారంగా నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇక్కడ కనిపిస్తున్న సీసీటీవీ ఫుటేజీ స్క్రీన్ షాట్స్‌లోని నిందితుడిని ఎవరైనా గుర్తిస్తే, వెంటనే పెద్దాపురం పోలీస్ స్టేషన్‌కు గానీ లేదా స్థానిక పోలీసులకు గానీ సమాచారం అందించాల్సిందిగా కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడుతాయని స్పష్టం చేశారు.

# రూ.1 కోటి 35 లక్షలు సి.ఎం.ఎఫ్. ఆర్. చెక్కుల పంపిణీ.



**తాళ్ళరేవు, జూలై 1 (ప్రభాతవార్త):** సి.ఎం. రిలీఫ్ ఫండ్ కు సంబంధించి రూ.1కోటి 35 లక్షల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పంపిణీ చేశారు. నియోజకవర్గం పరిధిలోని 173 మంది వైద్యం చేయించుకుని దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ చెక్కులను మురమళ్ల క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఇంత పెద్ద మొత్తం లో ఒకే రోజు ఏ నియోజకవర్గం లోను ఇచ్చి ఉండరని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి అన్నారు. ఈ కార్యక్రమం లో నాగిడి నాగేశ్వరావు, చెల్లి అశోక్, ధూళిపూడి వెంకటరమణ, సాగి సూరిబాబు రాజు, చెల్లి సురేష్, కట్టా సత్తిబాబు, సాక సీతాదేవి, జయలక్ష్మి, రుక్మిణి, తాడి నరశింహరావు, జక్కల ప్రసాద్, కూటమి నాయకులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణతో అతి పెద్ద రాజకీయ కుట్ర



**రంపచోడవరం జులై 1 ప్రభాతవార్త.** ఎస్సీ వర్గీకరణతో అతి పెద్ద రాజకీయ కుట్ర జరుగుతోందని మాలమాహానాడు రత్నాకర్ ఆరోపించారు. పోలవరం జిల్లా రంపచోడవరం జిల్లా కేంద్రంలో పాత్రికేయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతను దెబ్బతీసే రాజకీయ కుట్ర దేశవ్యాప్తంగా జరుగుతోందని మాల మహానాడు నాయకులు ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని మొదట కాంగ్రెస్ ప్రభుత్వం పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో అమలు చేయగా, అనంతరం కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేసిందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ వల్ల కొద్ది వర్గాలకే ప్రయోజనం చేకూరుతుందని, దేశంలోని 1,108 ఎస్సీ కులాలకు సమానంగా న్యాయం ఎలా జరుగుతుందో కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే తెలుగు రాష్ట్రాల్లో ఉన్న 59 ఎస్సీ ఉపకులాల మధ్య అవకాశాల పంపిణీ ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రభుత్వాలు వివరించాలని కోరారు. కొంతమంది నాయకులు రాజకీయ పార్టీలకు విశ్వాసంగా ఉన్నారే తప్ప తమ జాతి పట్ల విశ్వాసంగా లేరన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని అన్నారు. రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు పొందిన ఉద్యోగులారా మన జాతిని అనచివేసే ప్రయత్నం జరుగుతుంది ఇప్పటికైనా మేల్కొని తమ పోరాటానికి మద్దతు తెలపాల్సిందిగా కోరారు. తెలుగు రాష్ట్రాల్లో శాంతియుత పోరాటానికి సిద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలే పండు, చెక్కా మోహనరావు, వేచలపు గంగాధర్, వరలక్ష్మి, కొప్పుల ప్రేమ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యతిరేక మాషోత్సవాలు...



**సఖినేటిపల్లి జులై1, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం మోరీ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా ప్రణయ్, డా శ్రావణి ల ఆధ్వర్యంలో మలేరియా, డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ ను నిర్వహించారు. ర్యాలీలో మలేరియా, డెంగ్యూ, వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి చుట్టూ నీటి నిల్వలు, పాత్రలలో నీటి నిల్వలు ఉండ కుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్క్ పెడ్ డైరెక్టర్ జి పెదకాపు, ఎంపీటీసీ శ్రీదేవి, యూనిట్ అధికారి ఆదినారాయణ, కార్యదర్శి ఏసు, విజయ, నాగరాజు, ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ఈఏపీసెట్-2026లో వొమ్మంగి విద్యార్థి సంచలనం

## -108వ ర్యాంకు సాధించిన దేవారపు సురేంద్ర



**ప్రత్తిపాడు, జూలై 1: ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్-2026) ఫలితాల్లో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వొమ్మంగి గ్రామానికి చెందిన విద్యార్థి దేవారపు సురేంద్ర రాష్ట్ర స్థాయిలో 108వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటాడు. బుధవారం విడుదలైన ఫలితాల్లో సురేంద్ర 82.4771 మార్కులు సాధించి రాష్ట్రవ్యాప్తంగా 108వ ర్యాంకు దక్కించుకున్నాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన సాధారణ కుటుంబం నుంచి వచ్చిన సురేంద్ర ఈ అత్యుత్తమ ర్యాంకు సాధించడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. సురేంద్ర విజయంతో అతని తల్లిదండ్రులు దేవారపు సురేష్, సునీత, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు,బంధువులు, స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా కృషి, పట్టుదలతో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించగలరని సురేంద్ర నిరూపించాడని స్థానికులు కొనియాడుతున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు సురేంద్రను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# వి బి జి రాంజీ రద్దుచేసి, మహాత్మా గాంధీ ఉపాధి పునరుద్ధరించాలి.



**తాళ్ళరేవు, జూలై 1 (ప్రభాతవార్త):** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన వి బి జి రామ్ జి ఉపాధి హామీ స్కీమ్ ను రద్దుచేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలనీ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలోనూ జిల్లాలలోనూ అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం పిలుపులో భాగంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన వి బి జి రామ్ జి ఉపాధి హామీ స్కీం ను రద్దు చేయాలని, స్థానిక మండల పరిషత్ కార్యాలయము వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో కలిసి ఆయన బుధవారం ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి ఈశ్వరరావు మాట్లాడారు. ఎన్నో పోరాటాలు ఫలితంగా యూపీఏ గవర్నమెంట్ హయాంలో వామపక్షాల ఒత్తిడి మేరకు అప్పటి యూపీఏ ప్రభుత్వం పేదలకు ఆర్థికంగా, గ్రామాల అభివృద్ధికి, రైతాంగానికి మేలు చేస్తూ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో పార్లమెంటులో చర్చించకుండా, నిరంకుశత్వం గా ఆ చట్టాన్ని రద్దు చేసి, కొత్త ఉపాధి హామీ పథకాన్ని తెచ్చిందని దీనిలో ఫేస్ యాప్ తప్పనిసరి చేసిందన్నారు. వి బి జి రాంజీ స్కీంలో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించాలని, వ్యవసాయ సీజన్ లో రెండు నెలల పాటు ఉపాధి పనులు చెప్పకూడదని రూల్స్ ఫ్రేమ్ చేసి పేదల నోట్లో మట్టి కొట్టే విధంగా ఈ పథకాన్ని తయారు చేశారన్నారు. దీనిని బిజెపి పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వ్యతిరేకించిన, మన రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం మాట్లాడకపోవడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోడి భాస్కర రావు, పితాని కనకదుర్గ ,నామాడి మాణిక్యాలమ్మ, చింతపల్లి సుభద్ర ,పితాని మంగాదేవి, రాయుడు దుర్గ, గణికమ్మ, కాద ధర్మారావు, వెంకయ్యమ్మ, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు తూకం మిషన్ల పంపిణీ

## -వేగంగా మార్కెట్ పునర్నిర్మాణం



**రామచంద్రపురం,జూలై 01(ప్రభాతవార్త):** ద్రాక్షారామం మార్కెట్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన వ్యాపారులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. బాధితులు తిరిగి తమ జీవనోపాధిని ప్రారంభించేలా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా బుధవారం బాధిత వ్యాపారులకు అవసరమైన తూకం మిషన్లను పంపిణీ చేశారు. కూటమి పార్టీల సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం,ఆర్డీవో సరళావతి,ఎంపీడీవో పద్మజ్యోతి,ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ చేతుల మీదుగా తూకం మిషన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ,అగ్నిప్రమాదంలో 48దుకాణాలు పూర్తిగా దగ్ధం కావడం బాధాకరమని అన్నారు. ఉపాధి కోల్పోయిన వ్యాపారులను అన్ని విధాలా ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇచ్చిన హామీ మేరకు మరో పది రోజుల్లోగా నూతన మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేసి,వ్యాపారులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచి తూకం మిషన్లను అందజేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో పాటు కూటమి నాయకత్వానికి బాధిత వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు,అధికారులు,మార్కెట్ వ్యాపారులు పాల్గొన్నారు..

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే...

## -సమస్యలు తెలిపిన ప్రజలు



**రాజవొమ్మంగి, జూలై 01, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం జడ్డంగి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. మండలంలో 6,224 మంది లబ్ధిదారులకు రూ. 2.59 కోట్లు పింఛను సొమ్ములను వారింటికే వెళ్లి ఒక్క రోజున పంపిణీ చేయడం కూటమి ప్రభుత్వ గొప్పతనమని శిరీషాదేవి అన్నారు. వెలిశెట్టి వారి వీధిలో వీధి కొళాయిలు ద్వారా నీరు రాక ఇబ్బందులు పడుతున్నా మని ఎమ్మెల్యే కు చెప్పారు. పి. హెచ్. సి ప్రక్కనే సీసీ రోడ్డు కావాలన్నారు. జడ్డంగి.. చిన్నయ్య పాలెం గ్రామం మీదుగా సింగంపల్లి రహదారి పనులుఅసంపూర్తిగా ఆపివేశారని, రహదారి బురదగా మారి ఇబ్బందులు పడుతున్నట్లు సాగిన చిన్నమ్ములు, బత్తుల లక్ష్మి ఎమ్మెల్యే కు తెలిపారు. జడ్డంగి మడేరు ఆనకట్ట సాగు నీరు వెళ్లే ట్రప్పులు పాడయి పొలాలకు నీరు వెళ్లకుండా వృధాగా పోతుందని చైర్మన్ కాళ్ళకూరి సుందరం ఎమ్మెల్యే కు వివరించారు. త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపిడిఓ యాదగిరేశ్వరరావు, కార్యదర్శి సతీష్ కు సూచించారు. మడేరు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళదామన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై వచ్చే ఐ. వి ఆర్. ఎస్. ఫోన్ కాల్స్ పై ప్రజలు స్వతంత్రంగా స్పందించాలన్నారు. ఓటరు పరిశీలన కార్యక్రమంలో ప్రతీ ఓటరు వారి వివరాలను పూర్తి చేసి బి. ఎల్. ఓ కు అందించాలన్నారు. అశ్రద్ధ చేస్తే ఓటుపోతుందన్నారు. సంక్షేమ పథకాలతో ముందు వెళుతున్న కూటమి ప్రభుత్వం, తనకు ప్రజా ఆశీస్సులు ఉండాలన్నారు. కార్యక్రమంలో ముప్పన కేశవ్, వాసంశెట్టి గంగాధర్,గణజాల తాతారావ్,గట్టి మాణిక్యం, మండల బారంగి అనుదీప్, కాళ్ళకూరి సత్య సుందరం, చవల కుమార్ బాబు చెక్కా పండు బాబు , మండల పరిషత్ అభివృద్ధి అధికారి లోకుల యాదగిరీశ్వరరావు, వెలుగు సీసీ సూర్యనారాయణ, అధికారులు, ఎస్. ఐ. చినబాబు, సిబ్బంది, కూటమి శ్రేణులు, పాల్గొన్నారు.

# వార్త ప్రభావం అంబులెన్సు రోడ్డెక్కింది...



**రాజవొమ్మంగి, జూలై 01, ప్రభాత వార్త** జడ్డంగి పి. హెచ్. సి లో అన్నీ సమస్యలే : 20 రోజులుగా మూలకు చేరిన అంబులెన్సు అంటూ జూన్ 29 తేదీన వార్తలో వెలువడిన కదనంపై అధికారులు స్పందించారు. బుధవారం అంబులెన్సు మరమ్మత్తులు అయ్యి, జడ్డంగి పి. హెచ్. సి కి చేరుకొని రోడ్డెక్కింది. 41 గ్రామాల్లో 18 వేల జనాబాతో బాటు రాజవొమ్మంగి, లాగరాయి, అడ్డతీగల ఆసుపత్రుల పరిధిలో రోగులు కూడా ఇక్కడ వైద్య సేవలకు వస్తారు. 40 పాఠశాలలు, 40 అంగన్వాడీ కేంద్రాలు, ఐదు అశ్రమ పాఠశాలల విద్యార్థులకు కూడా ఇక్కడే వైద్య సేవలను పొందాలి. ప్రతీ రోజు 100 మందికి పైగా రోగులు వస్తుంటారు. ప్రతీ నెలా 10 ప్రసవ సేవలను అందించాలి. గర్భిణీలు, ఇతర వ్యాధులకు స్కానింగ్ మిషన్ చాలా ఉపయోగకరం. శిక్షణ పొందిన వారు మాత్రమే ఈస్కానింగ్ మిషన్ వాడాలి. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానికి ముందు వచ్చి వైద్య సేవలను పొందటానికి బర్త్ వెయిటింగ్ హాలు లేదు. దీనివల్ల ప్రసవానికి వచ్చే వారికి భోజన సౌకర్యం లేదు. ప్రసవానికి వస్తున్నారు ప్రసవ అనంతరం పి. హెచ్. సి లో ఉన్న ఆరు బెడ్స్ లో మూడు బెడ్స్ వీరికి కేటాయింపు జరిగింది. సాదారణ రోగులు మధ్యలో అప్పుడే పుట్టిన శిశువును వేయాల్సి వస్తోంది. మూడు బెడ్స్ కు పరుపులు లేవు. సమస్యలు ఎప్పుడు పరిస్కారం చేస్తారో అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా వైద్యాధికారిణి డా. సరిత అన్నారు.

# డాక్టర్ బీసీ రాయ్ అందించిన సేవలే నేటి వైద్యులకు ఆదర్శం



**రాజమహేంద్రవరం అర్బన్,జూలై1(ప్రభాతవార్త)** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా పిఎంపి సభ్యులు ఆధ్వర్యంలో జిల్లా డీడీఓ,సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఆర్వీవీ సత్యనారాయణ,డాక్టర్ రోహిత గాదిరెడ్డి సీఏఎస్,డాక్టర్ దివ్య పావని రామదాసు సీఏఎస్ లను ఘనంగా సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ అపరి ధన్వంతరి డాక్టర్ బీసీ రాయ్ 1882 జూలై 1వ తేదీన జన్మించారని,పేదలకు సేవలందించుట వైద్య వృత్తి ద్వారానే అవకాశం ఉందని భావించి వైద్యులు గా కలకత్తా లో ఎంతోమంది పేదలకు వైద్య సేవలందించారని,ఈ సేవలతోనే కలకత్తా మేయర్ గా,పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కూడా అయ్యారని అన్నారు. భారతదేశంలో వైద్య వృత్తిలో ఎన్నో కీలకమైన సంస్కరణలు చేసారని,ఆయన సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం భారతరత్న అవార్డు తో గౌరవించడం జరిగిందని అన్నారు,అయన 1962 జూలై 1వ తేదీన పరమపదించడం జరిగిందని,ఆయన జయంతి వర్ధంతి ఒకే రోజు రావడం,ఆయన స్మరిస్తూ ఈ రోజు ను డాక్టర్స్ డే గా జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి దేవానందం, మండల కన్వీనర్ అబ్దుల్ రహమాన్ ఖాన్,కో కన్వీనర్ మట్టా రమేష్,ఏ సురేష్ బాబు, కె లక్ష్మీనారాయణ,సుంకర శ్రీనివాస్,బాపూజీ, టీఎల్డీ ప్రసాద్,కేఎస్ రాజు,హీరా,రాజ్యలక్ష్మి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత.. సి. ఐ. సన్యాసినాయుడు



**రాజవొమ్మంగి, జూలై 01, ప్రభాతవార్త** మహిళల భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని రాజవొమ్మంగి సి. ఐ. సన్యాసినాయుడు అన్నారు. బుధవారం కొమరాపురం గ్రామంలో జడ్డంగి ఎస్. ఐ. చినబాబు ఆధ్వర్యంలో మహిళల పై జరిగే నేరాల నియంత్రణకు అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా సి. ఐ. సన్యాసినాయుడు మాట్లాడుతూ మహిళలపై జరిగే వేధింపులు, గృహహింస, ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలపై వివరించారు. మహిళలు వారి హక్కులపై అవగాహనను కలిగి ఉండాలన్నారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం, పోలీసు శాఖ పలు చర్యలు చేపడుతున్నట్లు సి. ఐ. సన్యాసి నాయుడు వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఎస్. ఐ. చినబాబు, కానిస్టేబుల్ ప్రసాద్ రెడ్డి, హోం గార్డు సి. హెచ్. చిన్నారావు, స్థానికులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## అధికార కూటమి--వైసీపీ పార్టీల మధ్య రహస్య ఒప్పందం

### -రామచంద్రాపురంలో కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు..



**రామచంద్రపురం,జూలై 01(ప్రభాతవార్త):** కూటమి ప్రభుత్వం,కేంద్రంలోని బీజేపీపై కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రామచంద్రాపురం కాంగ్రెస్ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ కోట శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు.ఎన్నికల సమయంలో వైసీపీపై భూకబ్జాలు,ఇసుక దోపిడీ,కల్తీ మద్యం,తిరుమల లడ్డూ అంశాలపై తీవ్ర ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆయన అనుచరులపై చర్యలు తీసుకోవడంలో విఫలమైందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్.డి.ఖాన్ ఆరోపించారు.బీజేపీ,టీడీపీ,జనసేన,వైసీపీ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉండటమే ఇందుకు కారణమని ఆయన విమర్శించారు.కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ జగన్‌ను రక్షిస్తోందని ఆరోపించారు.అయోధ్య రాముడి విరాళాల అవకతవకల ఆరోపణలపై బీజేపీ టీడీపీ,జనసేన ఎందుకు ప్రశ్నించడం లేదని నేతలు నిలదీశారు.మీడియా,కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.2029లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని,రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని నేతలు ధీమా వ్యక్తం చేశారు.సమావేశంలో నియోజకవర్గ,పట్టణ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్యుల సేవలకు పురస్కారం గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్



**అమలాపురం కలెక్టరేట్, జూలై 1 ప్రభాతవార్త** ప్రతి సంవత్సరం వైద్యులు చేసిన సేవలకు కృతజ్ఞతలతో ప్రతి సంవత్సరం జులై 1వ తేదీ గౌరవప్రదంగా పురస్కారం సన్మానించి జరుపుకునే వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్ మరియు అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ సంయుక్తంగా పార్క్ వీధిలో గల శశి నర్సింగ్ హోమ్ నందు డా. శశికిరణ్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్యక్షులు గోటేటి లక్ష్మి, ఉపాధ్యక్షులు గోటేటి గంగాధరరావు (ఎక్స్ ఆర్మీ), కార్యదర్శి కుడిపూడి త్రినాథ్ వైస్ నాయుడు, హరిబాబు, గోటేటి లక్ష్మి, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి వై ఎస్. జగన్ ను కలిసిన వైస్సార్సీపీ పంచాయతీ రాజ్ అధ్యక్షులు పాలా నాగేశ్వరరావు ..



**ఆత్రేయపురం, జూలై 01.(ప్రభాత వార్త)** వైస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైయస్ జగన్ గారిని బుధవారం వైస్సార్సీపీ రాష్ట్ర లీగల్ జాయింట్ సెక్రటరీ పాలా శివ కళ్యాణి, కొత్తపేట నియోజకవర్గం వైస్సార్సీపీ పంచాయతీ రాజ్ అధ్యక్షులు పాలా నాగేశ్వరరావు , కుటుంబం సభ్యులు లిఖిత నాగ సాయి, ప్రదీప్ వెంకట సూర్య మర్యాద పూర్వక గా కలిసి అభినందనలు తెలియజేసారు.

## నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు పునరుద్ధరణ



**రామచంద్రపురం,జులై 01(ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం భవన,ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు మార్చి01,2026 నుంచి తిరిగి అమల్లోకి వచ్చాయని సహాయ కార్మిక అధికారి పి.మనోజ్ తెలిపారు. కె.గంగవరం,సత్యవాడ గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సమావేశాల్లో భవన నిర్మాణ కార్మికులకు పథకాల వివరాలను వివరించారు.సహజ మరణానికి రూ.60 వేలు,అంత్యక్రియలకు రూ.20వేలు,ప్రసూతి సహాయం రూ.20వేలు,వివాహ కానుకగా రూ.20వేలు అందజేస్తామని ఆయన తెలిపారు.అర్హులైన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో నమోదు చేసుకోవడంతో పాటు గడువు ముగిసిన సభ్యత్వాలను వెంటనే రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.దరఖాస్తులను గ్రామ,వార్డు సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్ ద్వారా సమర్పించవచ్చని ఆయన తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి నిర్మాణ కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని కార్మిక అధికారి మనోజ్ విజ్ఞప్తి చేశారు.

## భాష్యం స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



**దేవరపల్లి, జూలై 1 (ప్రభాతవార్త) :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవరపల్లిలోని భాష్యం స్కూల్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు సుమంత్, జనతా, చందన, సాయిశ్రీ, సుస్మిత ఆసుపత్రులను సందర్శించి వైద్యులకు పుష్పగుచ్ఛాలు అందజేసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పి. పేరయ్య నాయుడు మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ జయంతి, వర్ధంతి సందర్భంగా ప్రతి ఏడాది జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనదని, విద్యార్థులు వైద్యులను ఆదర్శంగా తీసుకుని సేవాభావం, అంకితభావం, కృషి వంటి విలువలను పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాష్యం చాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షబానా, వైస్ ప్రిన్సిపల్స్ సుదీషా, పి. వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు,

## ఆర్టీసీ సిబ్బంది తీరు మార్చుకోవాలి.. మహిళల పట్ల అగౌరవంగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు.. ఎమ్మెల్యే గిడ్డి..

### -మండల సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష..




**అంబాజీపేట, జూలై 1, (ప్రభాతవార్త):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళల పక్షపాతిగా పనిచేస్తుందని, మహిళల ఆర్థిక స్వావలంబనం కోసం స్త్రీ శక్తి పథకమును ప్రారంభించి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంను అందిస్తుంటే కొంతమంది ఆర్టీసీ సిబ్బంది (డ్రైవర్లు,కండక్టర్లు) మహిళల పట్ల అమర్యాదగా ప్రవహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని,వారి పనితీరు మార్చుకోకుంటే ఉన్నతాధికాతులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.అంబాజీపేటలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా సంబంధిత శాఖల అధికారులు పనిచేయాలన్నారు. రాష్ట్రంలో విద్య, వ్యవసాయం, వైద్య, పంచాయతీరాజ్ వ్యవస్థలపై ప్రభుత్వం ప్రధాన దృష్టి సారించిందని, వీటిని సక్రమంగా ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. విద్యుత్ శాఖ పనితీరు పట్ల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పశువులకు సంబంధించిన దాణా, ఇతర పథకాలు పంపిణీ చేసే సమయంలో రైతులకు స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం తెలపకుండా పశు వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాకలగరువు ఎంపిటిసి సభ్యుడు వాకపల్లి దొరబాబు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆర్వా ప్లాంట్లపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారం ఫిల్టర్ కానీ నీటిని అమ్మకాలు చేస్తున్నారని ఎంపీటీసీలు సమైక్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ అధికారులకు తెలిపారు. అనంతరం వివిధ శాఖ అధికారులతో సమీక్షించి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఏమైనా లోపాలు ఉంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నియోజవర్గంలో నూతనంగా పంచాయతీ కార్యదర్శులుగా బాధ్యతలు చేపట్టిన ఉద్యోగులు స్థానిక ప్రజలు ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.మమత, తహసీల్దారు బి.చినబాబు, డిప్యూటీ ఎంపీడీవోలు కంచి శ్రీనివాస్, ఎండి. అబ్బాస్ అలీ, ఎంఈఓ-1 కె.వెంకటేశ్వరరావు, ఉపాధి ఏపీవో అడపా శ్రీ వెంకట కృష్ణ,జెడ్పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు,రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు దొమ్మేటి సురేష్ కుమార్, కుడుపూడి రాంబాబు, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

## నర్సరీ రైతులకు కొరకు జెసిబి సేవలు ప్రారంభించిన నర్సరీ అసోసియేషన్.



**కడియం, జూలై 1 ( ప్రభాతవార్త)** నర్సరీ రైతులకు అవసరమైన సమయంలో తోడ్పాటునందించేందుకు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేసీబీ సేవలను సోమవారం ప్రారంభించినట్లు అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప తెలిపారు.నర్సరీల్లో మొక్కల లారీలు దిగబెట్టే సమయంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని ఆయన చెప్పారు. నేటి నుంచి రైతుల అవసరాల మేరకు జేసీబీ సేవలు అందుబాటులో ఉంటాయని, మొక్కల లారీలు ఎక్కడ దిగబెట్టాల్సి వచ్చినా అసోసియేషన్ కార్యాలయ నంబర్ 9491474168ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని నర్సరీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జేసీబీ సేవలను రత్నం బాబ్జి, గాజుల రత్తయ్య, కొండేపూడి నాగు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నర్సరీ రైతులు హాజరై అసోసియేషన్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు.రైతుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను కూడా భవిష్యత్తులో అందించేందుకు కృషి చేస్తామని అధ్యక్షులు రత్నం అయ్యప్ప తెలిపారు.

## లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్



**రంపచోడవరం-గంగవరం. జూలై 1. ప్రభాతవార్త.** ప్రతి నెల వివిధ రకాలైన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు ఒకటవ తారీఖున లబ్ధిదారులకు అందించే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం గంగవరం మండలం గంగవరం గ్రామంలోని ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ వివిధ రకాలైన సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తారీఖున ప్రభుత్వ నిబంధన ప్రకారం వివిధ రకాలైన సామాజిక పింఛన్లు అందజేయుటకు సిబ్బందిని ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. గంగవరం గ్రామంలోని వివిధ రకాలైన పింఛన్ లబ్ధిదారుల వద్దకు వెళ్లి జాయింట్ కలెక్టర్ సామాజిక పింఛన్లు అందజేయడం జరిగింది. ప్రతినెల సకాలంలో వివిధ రకాలైన పింఛన్లు లబ్ధిదారులకు అందుచున్నది లేనిది అదేవిధంగా ప్రతినెల రేషన్ బియ్యం సకాలంలో అందుచున్నది లేనిది ఆయన ఆరా తీశారు.

## ఇండెక్స్ స్టవ్ వినియోగంపై అంగన్వాడీలకు శిక్షణ



**రాజవొమ్మంగి, జూలై 01, ప్రభాతవార్త** రాజవొమ్మంగి ఐ. సి. డి. ఎస్. ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద బుధవారం సూపర్ వైజర్స్ వీరయ్యమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్, సహాయకులకు ఇండెక్ట్ స్టవ్ ను ఎలా వినియోగించాలో వర్కర్ కె. వెంకటలక్ష్మి అవగాహనను కల్పించారు. స్టవ్ పై ఏవస్తువు ఎంత విద్యుత్ సామర్థ్యంతో వినియోగించిన తరువాత ఎలా స్టవ్ ను ఎంతసేపులో ఆపి వేయాలో వెంకటలక్ష్మి వివరించారు. ఈకార్యక్రమంలో సూపర్ వైజర్స్ వీరయ్యమ్మ, అమ్మిరాజు, బి. పి. ఏ. సోనీ, 103 మంది వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

## పెద్దాపురం ఏరియా ఆసుపత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు



**పెద్దాపురం,జులై01 (ప్రభాత వార్త )** పెద్దాపురం ఏరియా ఆసుపత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా మండలం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు.ఆసుపత్రి సూపరిండెంట్ రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాదులు మడికి రాంబాబు ఎస్ విశాలాక్షి గణేష్ పాల్గొని పలుచట్టలపై అవగాహన కల్పించారు అనంతరం ఆసుపత్రిలో ఇన్ పేషెంట్ వార్డ్ లో రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు ఇతర అంశాలపై రోగులతో మాట్లాడి వారికి తగిన సూచనలు సలహాలు అందించారు ఉచిత న్యాయ సహాయం పొందగోరు వారు మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బందిని సంప్రదించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు ఏ శ్రీనివాస్ డాక్టర్ రాజు డాక్టర్ హర్షిత రాజా ఐసిటిసి కౌన్సిలర్ శ్రీనివాస్ హెడ్నర్స్ రమాదేవి ఆరోగ్య మిత్రలు శేఖర్ జగపతి రాజు,పారా లీగల్ వాలంటీర్లు మాసా.చంద్రరావు ( చందు), కేవీపీ లక్ష్మి, డి లక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## రైతు సంక్షేమ ప్రభుత్వం.. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



**రాజవొమ్మంగి, జూలై 01, ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమ కోరే ప్రభుత్వమని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన పథకం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం రూ 49,00,708లతో రాజవొమ్మంగి అప్పలరాజుపేట గ్రామ సమీప వట్టిగెడ్డ రిజర్వాయర్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగు నీటి వనరులను కూడా పొదుపుగా వాడుకోవాలని రైతులను కోరారు. ఈ అభివృద్ధి పనులు ద్వారా ఆయకట్టు క్రింది రైతులకు రెండు పంటలు సాగుచేసుకోవడానికి కూడా పుష్కలంగా నీరు నిల్వ చేసుకోవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహజ నీటివనరుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కూటమి శ్రేణులు పనులను పూర్తి నాణ్యతతో చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ. పి. ఐ. ఐ. సి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, ఏ. ఎం. సి చైర్మన్ లోతా లక్ష్మణరావు, సొసైటీ అధ్యక్షులు ముప్పన కేశవ్, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, తెదేపా నాయకులు గణజాల తాతారావ్, మండల కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, ముప్పన మోహన్, చీడిపల్లి అప్పారావు, నియోజక వర్గ బీసీ విభాగం ఉపాధ్యక్షులు మాకిరెడ్డి లోవరాజు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లోకుల యాదగిరీశ్వరరావు, ఏ. పి. ఓ. శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

## గౌరవ వేతనాలు చెల్లించి గౌరవంగా సాగనంపండి..

### -ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్న ఎంపీటీసీ సభ్యులు..



**అంబాజీపేట,జూలై 1, (ప్రభాతవార్త):** ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.అంబాజీపేటలోబుధవారం మండల సర్వసభ్య సమావేశంనకు హాజరైన గిడ్డి సత్యనారాయణకు ఎంపీటీసీలు తమ గోడును వెళ్ళబోచుకున్నారు.అప్పటి వైసిపి ప్రభుత్వం, ఇప్పటి కూటమి ప్రభుత్వం ఎంపీటీసీలను చిన్న చూపు చూస్తోందని,సెప్టెంబర్ 2023 నుండి, జూన్ 2026 వరకు 33 నెలలుగా గత,ప్రస్తుత ప్రభుత్వాలు ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు చెల్లించలేదన్నారు.ఒక్కొక్క ఎంపీటీసీకు రూ.99 వేలు, ఎంపీపీ కి 1.98 లక్షలు గౌరవ వేతనం చెల్లించాలన్నారు.మరో రెండున్నర నెలల కాలంలో తమ పదవీకాలం ముగియబోతోందని, అప్పట్లోగా కూటమి ప్రభుత్వం తమ బాధను అర్థం చేసుకొని మాకు రావాల్సిన గౌరవ వేతనాలను చెల్లించి,తమను గౌరవంగా సాగనంపాలని ఎమ్మెల్యేకు అందించిన వినతిపత్రంలో పేర్కొన్నారు.రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి పంచాయతీలకు జీవం పోస్తున్నారని, అలాగే మా ఎంపీటీసీల బాధను అర్థం చేసుకొని,తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు,ఎంపీటీసీల సమైక్య అధ్యక్షులు ముత్తాబత్తుల ప్రశాంత్, విత్తనాల దుర్గాభవాని, వదలి కృష్ణమూర్తి, పబ్బినీడి రాంబాబు, వాకపల్లి దొరబాబు, పిల్లి సత్యవేణి, మైలా నాగలక్ష్మి,వనచర్ల విజయదుర్గ, బుడితి సత్యనారాయణమ్మ, నెల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## కొర్రాజుల జాతర కు సహకరించినవారందరికి కృతజ్ఞతలు




**వి.ఆర్.పురం,జూలై 1,ప్రభాతవార్త** మండల కేంద్రం రేఖపల్లిలో పదకొండు రోజులపాటు అంగరంగ వైభవంగా, ఆదివాసీ నాయకపోడు గిరిజనులు, గిరిజన కొండరెడ్ల ఆధ్వర్యంలో జరిగిన చిన్నసార్లమ్మ, పెద్దసార్లమ్మ, కొర్రాజుల కొలుపు జాతరకు సహకరించిన వారందరికి, జాతర నిర్వాక కమిటి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. జాతర ముగింపును పురస్కరించుకొని, బుధవారం ఆదివాసీ నాయకపోడు సేవ సంఘం సభ్యులు, ఆదివాసీ నాయకపోడు రేఖపల్లి గ్రామ కుల పెద్దలు, రాజుల స్వామి వారి ప్రధాన పూజారి, ఆలయ కమిటి సభ్యులు నగిరి (గుడి ) వద్ద విలేఖరులతో మాట్లాడారు. జాతర ఎలాంటి అడ్డంకులు లేకుండా విజయవంతం అయ్యిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. జాతరకు అందరు సహకరించినట్లుగానే, జాతర ముగింపు రోజు వర్షం పడకుండా వాతావరణం సైతం తమకు సహకరించిందన్నారు. గిరిజన తెగల ఆచార సాంప్రదాయ ఉ ట్టిపడేలా రాజుల కొలుపులు నిర్వహించామని సంతృప్తిని వ్యక్తం చేశారు. కొర్రాజుల జాతర పేరుకి గిరిజన జాతర అయినప్పటికీ, అన్ని సామాజిక వర్గాల వారు తమ ఇంట్లో పండుగల భావించి, జాతరలో పాల్గొన్నారన్నారు. జాతరకు ఆర్థిక చేయుత అందించిన దాతలతో పాటుగా, రేఖపల్లి వాసి, బాలల హక్కుల కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు, చింతూరు, ఎటపాక డివిజన్ ల అటవిశాఖ, రెవెన్యూ, పంచాయతీ రాజ్, జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్త్ నిర్వహించిన పోలీస్ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. జాతరకు నెల రోజుల ముందు నుండి, జాతర ముగిసే వరకు జాతర విశిష్టతను తమ పత్రికలు, ఛానళ్ల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన ప్రింట్, ఎలెక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ఆయా సంస్థల సిబ్బంది, యాజమాన్యానికి తాము రుణపడి ఉంటామన్నారు.

## గంజాయి, డ్రగ్స్ మహమ్మారిపై యువత అప్రమత్తంగా ఉండాలి..ఎస్ ఐ లక్ష్మీకాంతం



**ప్రత్తిపాడు, జులై 1 ( ప్రభాతవార్త)** యువత గంజాయి, డ్రగ్స్ వంటి ప్రాణాంతక మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని స్థానిక ఎస్ ఐ లక్ష్మీకాంతం పిలుపునిచ్చారు. సీఐ బి. సూర్య అప్పారావు పర్యవేక్షణలో బుధవారం మండల కేంద్రమైన ప్రత్తిపాడు ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో కాలేజీ విద్యార్థులకు "గంజాయి - డ్రగ్స్ నిర్మూలన"పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ ఐ లక్ష్మీకాంతం మాట్లాడుతూ క్షణికానందం కోసం మత్తు పదార్థాల వైపు ఆకర్షితులై విద్యార్థులు, యువత తమ జీవితాలను అంధకారం చేసుకోవద్దని హితవు పలికారు. మండల పరిధిలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, నిర్వాహకులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.కాలేజీ విద్యార్థినులను వేధించినా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే సహించేది లేదని ఎస్ ఐ హెచ్చరించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండి, బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప అడిషనల్ ఎస్ ఐ రమణమూర్తి, పోలీస్ సిబ్బంది స్థానిక కాలేజీల విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు శ్రీ మావుళ్ళమ్మ జాతర మహోత్సవం




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై1,ప్రభాతవార్త**అమలాపురం రూరల్ మండలం, ఇందుపల్లి గరువులో వేంచేసియున్న శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం రాత్రి జరగనున్నాయి. ఇందుపల్లి, ఇందుపల్లి గరువు ప్రాంతాల్లో శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ప్రతీ ఏటా మాదిరిగానే ఈ సంవత్సరంలో అంతకు మించి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలైన చెడీ తాళింఖానా, గరగనృత్యాలు, కోయిడాన్సులు, కొమ్ముబూరలు, కోలాడాన్స్,బుట్టబొమ్మలు, శక్తివేషాలు,డి.జె.,లు, భారీ బాణా సంచాలతో అంగరంగ వైభవం గా జాతర 2వ తేదీ గురువారం సాయంత్రం జరగనున్నాయి. అమ్మవారి ఆలయాన్ని పూలమాలలు, విద్యుత్ దీపాలలు సర్వాంగ సుందరంగా అలంకరించారు. అలాగే 3వ తేదీ శుక్రవారం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి తీర్థం సందర్భంగా అమ్మవారిని ఆడపడుచులు మరియు మహిళలు కుటుంబ సమేతంగా దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకుని తీర్థప్రదాలు స్వీకరించి తరించాలని ఆలయ కమిటీవారు కోరారు.

## రిజిస్ట్రేషన్ సేవలు ప్రైవేటికరణ విరమించాలని లేఖర్ల నిరసన..



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై1,ప్రభాతవార్త.** రిజిస్ట్రేషన్ సేవలు ప్రైవేటి కరణ విరమించాలని అమలాపురం దస్తావేజు లేఖర్లు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక నల్లవంతెన వద్ద గల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద అమలాపురం దస్తావేజు లేఖర్లు రాష్ట్ర సంఘము పిలుపు మేరకు దస్తావేజు లేఖర్లు నల్ల బ్యాడ్జ్ లు ధరించి లైసెన్స్‌లు పునరుద్ధించాలని, రిజిస్ట్రేషన్ సేవలు ప్రైవేటి కరణ విరమించుకోవాలంటూ నినాదాలు చేశారు. లేని పక్షంలో ఈ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని లేఖర్లు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో అమలాపురం దస్తావేజు లేఖర్ల ప్రెసిడెంట్ జున్నూరి సురేష్, గౌరవ అధ్యక్షులు గుంటు ఫణి ప్రసాద్, సెక్రటరీ పెద్దిరెడ్డి దుర్గేష్, ఉపాధ్యక్షులు సుబ్బు, కన్వీనర్ మట్టపర్తి రాము, సంఘ సభ్యులు పందిరి హరి, బోగిరాజు, బుట్టే , పృథ్వి శ్రీను, సుబ్బయ్య, రాజా, చిన్ని, మహేష్, కరుణ, సహాయకులు, టైపిస్ట్‌తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ



**కాట్రేనికోన :జూలై 01 (ప్రభాతవార్త)** కాట్రేనికోన మండలం వేట్లపాలెం, కందికుప్ప గ్రామ పంచాయతీల్లో ఎంపీడీఓ బి. రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు బుధవారం పంపిణీ చేశారు.మాజీ మత్స్య శాఖ కార్పొరేషన్ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు, డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ఆకాశం శ్రీనివాస రావు లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా నాగిడి నాగేశ్వరరావు మాట్లాడుతూ పేద,బీద, బడుగు, బలహీన వర్గాల సామాజిక భద్రతకు మరియు ఆర్థిక వికాసానికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీల స్వర్ణ గ్రామ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణపండపనికి భూమి పూజ



**అనపర్తి జూలై 1 (ప్రభాతవార్త)** అనపర్తి మండలం రామవరంలో నిర్మాణం లో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద కళ్యాణ మండపం నిర్మాణానికి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి .అరుణదంపతులు బుధవారం శంకుస్థాపన చేశారు.ఈకార్యక్రమానికి ఎమ్మెల్యేనల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు .

## అక్రమ కేసులను ఎదుర్కొంటామే తప్ప వెనక్కి తగ్గేదే లేదు



**శంఖవరం జూలై 1 ప్రభాతవార్త** శంఖవరం ప్రజల మేలు కోరి గ్రామంలోని అవినీతికి వ్యతిరేకంగా సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన సమాచారంతో ప్రభుత్వాధికారులకు పిర్యాదులు చేస్తూ ఉద్యమిస్తున్నట్లు సామాజిక కార్యకర్త మేకల కృష్ణ, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నారు. శంఖవరంలోని మేకల కృష్ణ నివాసంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ శ్రీ వాణీ నవ దుర్గమ్మ ఆలయానికి ఎదురుగా ఉన్న సాయిబాబా మందిరాన్ని ఆనుకుని సర్వే నెంబర్ 12/1 లోని 32 సెంట్ల ప్రభుత్వ నిషేధిత వ్యవసాయ సాగు భూమినిలోని నాలుగు సెంట్లలో ఇండ్ల నిర్మాణానికి పునాదిని నిర్మించి, దానిలో మట్టిని నింపుతుండగా, అది ఎవరిదో తెలుసుకునేందుకు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల్లో ఇద్దరం అక్కడికి వెళ్ళి మొబైల్ ఫోన్లో గూగుల్ మేప్ ను పరిశీలించామని, ఆ అక్రమ నిర్మాణాన్ని పంచాయతీ, రెవెన్యూ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఆ మాత్రం దానికే జూన్ 22న మాపై అన్నవరం పోలీసు స్టేషన్లో ఎస్సీ, ఎస్టీ చట్టాల ప్రకారం అక్రమంగా ఫిర్యాదు చేశారన్నారు. ఇన్ని బెదిరింపులు చేసిన వెనక్కి తగ్గేదే లేదని గ్రామ అభివృద్ధి కమిటీ శంఖవరం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గుణపర్తి అపురూప్, పగడాల మోహన సన్యాసిరావు (బాబ్జి), బొమ్మిడి సత్యనారాయణ (చిట్టిబాబు), రేలంగి వెంకట సత్యనారాయణ (దొంగబాబు), పడాల చంటిబాబు, మోకిరెడ్డి పెదకాపు, గుద్దాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు

## హత్య కేసులో నలుగురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష

**పెద్దాపురం జూలై 01(ప్రభాత వార్త )** కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ స్వీయ పర్యవేక్షణలో హత్య కేసుల ట్రయల్స్‌ను వేగవంతం చేస్తూ కాకినాడ జిల్లా పోలీసులు మరో కీలక కేసులో విజయవంతమైన తీర్పు సాధించారు. ఈ మేరకు ఈ తీర్పుకు సంభందించి పెద్దాపురం డి ఎస్పీ ఎబిజి తిలక్ బుధవారం వివరాలు వెల్లడించారు. 2016లో పెద్దాపురం మండలం చినబ్రహ్మదేవం గ్రామంలో జరిగిన ఘటనలో మృతుడు బత్రెడ్డి స్వామి అనే బూరిబాబు తన మేనకోడలు తాళిశెట్టి దేవి "పసుపు-కుంకుమ"గా పొందిన రెండు ఎకరాల భూమిని విక్రయించిన విషయమై ప్రశ్నించడంతో వారి మధ్య వివాదం నెలకొంది. అనంతరం మృతుడు దేవిపై దాడి చేయడంతో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ జరగగా, తన తప్పును అంగీకరించాడు. అయితే అప్పటి నుంచి దేవి కుటుంబ సభ్యులు మృతుడిపై కక్ష పెంచుకున్నారు. ఈ క్రమంలో 2016 మే 30న రాత్రి సుమారు 8 గంటల సమయంలో లు ముద్దాయి ఆచంట శివ, ఆచంట గోపాలస్వామి అలియాస్ గబ్బర్ సింగ్, ఆచంట వెంకన్న, ఆచంట గోపాలస్వామి అనే తాతయ్యకాపులు కర్రలతో మృతుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం అతడిని పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి అన్నయ్య బత్రెడ్డి గోవింద్ ఫిర్యాదు మేరకు పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ వై సతీష్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి సీఐ కె శ్రీధర్ కుమార్ దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను 2016 జూన్ 8న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఆ కేసు ట్రయల్ రన్ జరగగా ఇటీవల జరిగిన ట్రయల్‌లో ప్రభుత్వ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె వినయ తేజ బలమైన వాదనలు వినిపించగా, 7వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎన్ సరస్వతి ఈ కేసులో నలుగురు నిందితులకు బుధవారం యావజ్జీవ కఠిన కారాగార శిక్ష తో పాటు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్టు డి ఎస్పీ తిలక్ తెలిపారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ కేసు దర్యాప్తును సమర్థవంతంగా నిర్వహించిన అప్పటి దర్యాప్తు అధికారి శ్రీధర్ కుమార్, అప్పటి పెద్దాపురం ఎస్‌డీపీఓ డి శ్రీహరి రాజు, ప్రస్తుత ఎస్‌డీపీఓ ఎబిజి తిలక్, సీఐ వైఆర్కె శ్రీనివాస్, ఎస్ఐ వి మౌనిక, కోర్టు లైజన్ ఆఫీసర్ డిఎన్ఎస్డి సాయి వెంకటేశ్వరావులతో పాటు ప్రభుత్వ తరపున సమర్థవంతంగా వాదనలు వినిపించిన ఎం ధనుజయ రావు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె వినయ తేజను ప్రత్యేకంగా అభినందించారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps